thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 123 | కరీంనగర్ శనివారం, 12 జులై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా రాత్రి నుంచి ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పోస్ట్




దిల్లీ: ఎవరైనా సరే 75 ఏళ్లు రాగానే రిటైర్మెంట్ తీసుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దీనిపై కాంగ్రెస్ స్పందిస్తూ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించింది. మోదీని ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని ఎద్దేవా చేసింది. అసలేం జరిగిందంటే.. ఇటీవల మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. రిటైర్మెంట్‌పై మరాఠా సామ్రాజ్య మొదటి పీష్వా, సంఘ్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే అభిప్రాయాన్ని ప్రస్తావించారు. "75 ఏళ్ల శాలువా మన మీద కప్పారంటే.. మనం ఒక నిర్దిష్ట వయసుకు చేరుకున్నామని అర్థం. అప్పుడు మనం పక్కకు జరిగి.. వేరే వాళ్లు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి" అని పింగ్లే వ్యాఖ్యలను భాగవత్ గుర్తుచేశారు. ఇది కాస్తా నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది సెప్టెంబరుతో ప్రధాని మోదీకి 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. "పలు అవార్డులు తీసుకొని, విదేశీ పర్యటనలు ముగించుకుని వస్తున్న ప్రధాని మోదీకి ఎలాంటి స్వాగతం లభించిందో చూడండి..! ఈ ఏడాది సెప్టెంబరు 17 నాటికి మోదీకి 75 ఏళ్లు పూర్తవుతాయనే విషయాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ గుర్తుచేస్తున్నారు.

కానీ, భాగవత్‌కు కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి 75 ఏళ్లు నిండుతాయనే విషయాన్ని మోదీ గుర్తు చేయాలి" అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ పోస్ట్ పెట్టారు. 'ఒక్క దెబ్బకు.. రెండు పిట్టలు' అంటూ ఎద్దేవా చేశారు. ఈ ఏడాది మార్చిలో ప్రధాని మోదీ నాగ్‌పుర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే మోదీ రిటైర్మెంట్ గురించి చర్చ మొదలైంది. అప్పట్లో దీనిపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్‌రౌత్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"గత 10, 11 ఏళ్లలో మోదీ ఎన్నడూ ఈ కార్యాలయానికి రాలేదు. దేశ నాయకత్వంలో మార్పు రావాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటోంది. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని సంఘ్ భావిస్తోంది" అని నాడు రౌత్ వ్యాఖ్యానించారు. అయితే, దీన్ని భాజపా కొట్టిపారేసింది. ఇప్పుడు భాగవత్ వ్యాఖ్యలతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది.

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు.. 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్



తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి, అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.

**తెలంగాణలో వర్షాలు...** ప్రస్తుత పరిస్థితి: తెలంగాణలోని చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌తో సహా 18 జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ముందు జాగ్రత్తలు: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా చెట్ల కింద నిలబడరాదని, పిడుగుల ప్రమాదం అధికంగా ఉంటుందని హెచ్చరించారు. రైతులు ఈ రెండు, మూడు రోజులు పొలాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి. జూలై నెల అంచనా:

ఈ జూలై నెలలో తెలంగాణలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

**ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు...** ప్రస్తుత పరిస్థితి: ఏపీలో కూడా నైరుతి రుతుపవనాలు విస్తరించి పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. భవిష్యత్ సూచన: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాబోయే రెండు మూడు రోజుల్లో ఏపీలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవనున్నాయి.

**ముందస్తు రుతుపవనాలు:** ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మే 24నే కేరళను తాకి, తెలుగు రాష్ట్రాల్లోకి కూడా మే 26నే ప్రవేశించాయి. ఇది సాధారణ సమయం కంటే ముందుగానే రుతుపవనాలు రావడాన్ని సూచిస్తుంది. అయితే, జూన్ నెలలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. తెలుగు రాష్ట్రాల్లో రాబోయే రెండు, మూడు రోజులలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పిడుగులు, ఈదురుగాలుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# కొత్త రేషన్ కార్డులొస్తున్నాయ్!




## హైదరాబాద్‌లో కొత్త రేషన్ కార్డుల కోసం చూస్తున్నోళ్లకు గుడ్ న్యూస్

### 14న 29 వేల రేషన్‌కార్డులు పంపిణీ - 9 సర్కిళ్ల పరిధిలో ఇవ్వనున్న సివిల్ సప్లయీస్ శాఖ
### 2.5 లక్షల దరఖాస్తులు వచ్చాయన్న అధికారులు - రోజూ కొత్తగా 6 వేల అప్లికేషన్లు

హైదరాబాద్ :తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల జారీకి ముహూర్తం ఖరారైంది. ఈనెల 14న తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.4లక్షల కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు. దీని ద్వారా 11.30లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రంలో గత ఆరు నెలల్లో 41 లక్షల మందికి ప్రభుత్వం కొత్తగా రేషన్ పంపిణీ చేసింది. త్వరలో పంపిణీ చేయనున్న వాటితో కలిపి రేషన్‌కార్డుల సంఖ్య 94,72,422కి చేరనుంది. మొత్తంగా 3.14కోట్ల మందికి లబ్ధి చేకూరనుంది. కొత్త రేషన్ కార్డుల కోసం గ్రేటర్ పరిధిలోని లక్షల మంది ఆతృతతో ఎదురుచూస్తుండడంతో ఈనెల14న కొత్త కార్డుల పంపిణీకి అధికారుల ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని 9 సర్కిళ్ల పరిధిలో 29,487 మందికి కార్డుల పంపిణీ చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ వెల్లడించారు. అయితే, 14వ తేదీన ఇచ్చే కార్డులు వెరిఫికేషన్‌పూర్తయి నవి మాత్రమేనని, దరఖాస్తులు, వెరిఫికేషన్, పంపిణీ అనేది నిరంతర ప్రక్రియగా ఉంటుందని తెలిపారు. కార్డులు పొందిన వారికి సెప్టెంబర్ నుంచి సరుకుల పంపిణీ ఉంటుందన్నారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో కూడా కార్డుల పంపిణీ ఉంటుందన్నారు.

**ఏడాదిలో లక్ష కొత్త కార్డులు....** ఇప్పటి వరకు ఒక్క హైదరాబాద్ పరిధిలోనే 2.5 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ నిరంతరం ఉంటుందని ప్రకటించడంతో రోజుకు దాదాపు 5 వేల నుంచి 6 వేల దరఖాస్తులు మీసేవా కేంద్రాల్లో నమోదవుతున్నాయంటున్నారు. ఇలా వచ్చిన దరఖాస్తులను సర్కిళ్ల వారీగా ఏఎస్ఓలు పరిశీలించి వెరిఫికేషన్ పనులను ఆర్ఐలకు అప్పగిస్తున్నారు. వారు దరఖాస్తుదారులు పేర్కొన్న చిరునామాలకు వెళ్లి ఇచ్చిన వివరాలు సరిగ్గా ఉన్నాయా? లేదా? కార్డు ఇవ్వడానికి అర్హులేనా? కాదా అన్నవిషయాలను పరిశీలించి ఏఎస్ఓకు నివేదిక ఇస్తున్నారు. ఏఎస్వోలు డీఎస్ఓకు రిపోర్ట్ ఇస్తారు. తర్వాత ఆ కార్డులకు చీఫ్ రేషనింగ్‌ఆఫీసర్( సీఆర్ఓ) ఆమోదం తెలుపుతారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 6,39,451 కార్డులున్నాయి. మరో ఏడాదిలో లక్షకు పైగానే కొత్త కార్డులు ఇస్తామని అధికారులు చెప్తున్నారు.

## వెరిఫికేషన్ వేగవంతానికి మిగతా శాఖల నుంచి సిబ్బంది

**సిబ్బంది కొరత కారణంగా ఆలస్యం...** నగరంలోని 9 సర్కిళ్ల పరిధిలో కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడానికి పౌరసరఫరాల శాఖకు అవసరమైన సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారు. రోజుకు వేలల్లో దరఖాస్తులు వస్తున్నా వెరిఫికేషన్ చేసేందుకు అవసరమైన సిబ్బంది లేరని, అందుకే ఆలస్యమవుతోందంటున్నారు. దీంతో వెరిఫికేషన్ పనులకు కొందరు ఆఫీసర్లను ఇవ్వాల్సిందిగా బల్దియా, రెవెన్యూ శాఖలకు లెటర్లు రాశారు. వారు ఈ నెలాఖరులో వచ్చే అవకాశం ఉండడంతో పని స్పీడప్ చేస్తామంటున్నారు.

ఇప్పటి వరకూ వచ్చిన రెండున్నర లక్షల దరఖాస్తుల్లో 10శాతం మాత్రమే వెరిఫికేషన్ పూర్తయ్యిందంటున్నారు.

మరో రెండు నెలలు రేషన్‌పంపిణీ లేనందున పూర్తిగా కొత్త దరఖాస్తుల వెరిఫికేషన్ పైనే దృష్టి పెడతామంటున్నారు.




# పట్టు మీదున్న బిజెపి పెద్దలు!!

# కమలం వికసించేనా!?

# దక్షిణాదిన పాగా వేయాల్సిందే!

బీజేపీకి ఇపుడు దక్షిణాది కావాలి. ఆ పార్టీని మొదటి నుంచి ఉత్తరాది ఆదరిస్తోంది. దాంతో సౌత్ స్టేట్స్ లో పెద్దగా బలం లేకపోయినా అధికారం సొంతం అవుతోంది. మొత్తం మీద పడుతూ లేస్తూ కర్ణాటకలో కాస్త ఉనికిని చాటుకుంది. తెలంగా ణాలో ఇపుడిపుడే నేను ఉన్నాను అంటోంది. తమిళనాడు కేరళలలో అయితే బీజేపీ చిరునామా కోసం పెద్ద పోరు చేయాల్సి వస్తోంది. ఏపీ లాంటి చోట్ల పొత్తులు లేకపోతే నోటాతోనే పోటీ పడే సన్నివేశం ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీకి ఉత్తరాదిన ఆదరణ నెమ్మదిగా తగ్గుముఖం పడుతోంది. అది 2024 ఎన్నికల్లో సంకేతంగా రుజువు అయింది. అతి పెద్ద స్టేట్ గా ఉన్న యూపీలో మెజారిటీ ఎంపెలను అఖిలేష్ యాదవ్ నాయకత్వంలోని ఎస్పీ తన్నుకుని పోయింది. ఇక బీహార్ లో ఈ రోజుకీ సీఎం పీఠం దక్కడంలేదు. నితీష్ కుమార్ పార్టీ జేడీయూతో పొత్తు లేకపోతే అక్కడ కమల వికాసం జరగడం లేదు. పంజాబ్ లో ఆప్ గెలిచింది. ఢిల్లీలో ఈసారి ఓడినా బలంగానే ఉంది. గుజరాత్ లో సవాల్ చేస్తోంది. మహారాష్ట్రలో కూడా ఎన్డీయే అధికారంలోకి వచ్చినా కూడా బలంగా సరద్ పవార్ శివసేన, ఉద్ధవ్ ఠాక్రే శివసేన కాంగ్రెస్ ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీని గద్దె నుంచి దించడం శక్తికి మించిన పని అవుతోంది. హిమాచల్ ప్రదేశ్ లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మిగిలిన చోట్లా ప్రయత్నాలు చేస్తోంది. ఇలా రాజకీయ దృశ్యం ఉంటే ఏకంగా 139 ఎంపీ సీట్లు ఉన్న సౌత్ స్టేట్స్ లో 39 సీట్లు అయినా బీజేపీ సాధించకపోతే ఎలా అన్న చర్చ సాగుతోంది. ఇక అవి కూడా చాలవు, ఈసారి కచ్చితంగా సగానికి పైగా సాధిస్తేనే మళ్ళీ బీజేపీకి పీఠం దక్కుతుంది. దాంతో దక్షిణాదిన బీజేపీ పువ్వు పూయించాలని బీజేపీ తెగ తపన పడుతోంది. అందులో భాగంగానే చాలా ప్రయోగాలే చేస్తోంది. బీజేపీ అధ్యక్ష పీఠాలను వరసబెట్టి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వారికే బీజేపీ అప్పగించడం చూస్తూంటే భారీ ప్లాన్ తో ఆ పార్టీ ఉందని అంటున్నారు ఈసారి దక్షిణాదిన కలసి వచ్చే పార్టీలతో పొత్తులు లేదా తెర వెనక పొత్తులు ఎవైనా పెట్టుకుని 2029 ఎన్నికల్లో మరోసారి అధికారం చేపట్టాలని బీజేపీ చూస్తోంది. అందులో భాగనే అధ్యక్షుల ఎంపికలో ఈ జాగ్రత్తలు అని అంటున్నారు. అంతే కాదు గతానికి భిన్నంగా దక్షిణాదిన రాష్ట్రాలకు అధిక నిధులను ఇస్తోంది. అలాగే కీలక ప్రాజెక్టులను మంజూరు చేస్తోంది. ఇదంతా తనకు సానుకూలం అవుతుందని ఆ పార్టీ నమ్ముతోంది. దక్షిణాదిన అయిదు రాష్ట్రాలు ఉంటే కేరళ మినహాయించి మిగిలిన చోట్ల గట్టిగా పాతుకుని పోవాలని బీజేపీ చూస్తోంది. తమిళనా డులో బలంగా ఉన్న అన్నాడీఎంకేతో చెలిమి చేయడం అందులో భాగమే అని అంటున్నారు.

కర్ణాటకలో జేడీఎస్ తో పొత్తు పెట్టుకుని బీజేపీ తెలివిగా వ్యవహరించింది అన్నది ఎంపీ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఏపీలో చూస్తే టీడీపీ జనసేన బీజేపీకి కొండంత అండగా ఉన్నారు. తెలం గాణాలో కూడా ఎన్నికల వేళకు త్రిముఖ పోటీని ద్విముఖ పోటీగా మార్చాలని బీజేపీ చూస్తోంది. దానికి ఆ పార్టీ వేసే ఎత్తులు వేరే లెవెల్ లో ఉంటాయని అంటున్నారు. ఈసారి బీజేపీకి కేంద్రంలో అధికారం దక్కడానికి దక్షిణాది రాష్ట్రాలే కారణం అని చెప్పాలి. ఏపీలో టీడీపీ జనసేన ఎంపీల బలం ఆ పార్టీకి శ్రీరామ రక్షగా ఉంది. దాంతో ఇదే ఫార్ములాను 2029 నాటికి కూడా అమలు చేసి మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సిందే ఏపీలో కానీ తెలంగాణాలో కానీ జాతీయ స్థాయికి వచ్చేటప్పటికి కాంగ్రెస్ కమ్యూనిస్టులు తప్ప మిగిలిన పార్టీలను తన వైపే ఉంచుకోవాలని బీజేపీ జాగ్రత్తగా వేస్తున్న అడుగులకు దర్పణమే ఈ అధ్యక్షుల ఎంపిక అని అంటున్నారు. సోరానున్న రోజుల్లో మొత్తం 139 ఎంపీ సీట్లలో బీజేపీ దాని మిత్రులు ఎన్ని సీట్లు గెలుచుకుంటారు, కొత్త మిత్రులు పరోక్షంగా బీజేపీఎకి ఏ విధంగా సాయపడతారు అనేది చూడాల్సి ఉంది.

చురకలు

శనివారం 12 జూలై 2025



## ఇంజినీరింగ్ కళాశాలలకు చుక్కెదురు

హైదరాబాద్: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు హైకోర్టులో చుక్కెదురైంది. ఫీజులు పెంచుకునేందుకు అనుమతివ్వాలని ఆయా కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫీజుల పెంపు కోసం ఇచ్చిన వినతులపై టీఏఎఫ్‌ఆర్‌సీ (తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ) నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆరువారాల్లో నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించింది. ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయంపైనే ఫీజుల పెంపు ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపునకు సంబంధించి ఏటా ఓ తంతు నడుస్తోందంటూ టీఏఎఫ్‌ఆర్‌సీ తీరుపై నిన్న విచారణ సందర్భంగా హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏటా కాలేజీలు ఫీజుల పెంపునకు ప్రతిపాదనలు చేయడం, కౌన్సెలింగ్ పూర్తయి అడ్మిషన్‌లు చేపట్టేదాకా దానిపై టీఏఎఫ్‌ఆర్‌సీ సిఫారసులు చేయకపోవడం, కాలేజీలు కోర్టును ఆశ్రయించడం అన్నది ఏటా కొనసాగుతోందని వ్యాఖ్యానించింది. ఇంజినీరింగ్ కాలేజీల్లో గత బ్లాక్ పీరియడ్ ఫీజులే 2025-26కు వర్తిస్తాయంటూ జారీ చేసిన జీవో 26ను సవాలు చేస్తూ గురునానక్, గోకరాజు రంగరాజు కాలేజీలతో పాటు సుమారు 11 కళాశాలలు గురువారం లంచ్ మోషన్ పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి మూడేళ్లకోసారి కాలేజీలను పరిశీలించి పెంపుపై నిర్ణయం తీసుకోలేకపోవడం సరికాదన్నారు. డిసెంబరులో ప్రతిపాదనలు వస్తే జూన్ వరకు నిర్ణయం తీసుకోలేదని, 15 మంది సభ్యులదాకా ఉన్న కమిటీ నిర్ణయంలో జాప్యమెందుకన్నారు. టీఏఎఫ్‌ఆర్‌సీపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదని, కౌన్సెలింగ్ పూర్తయ్యాక పిటిషన్‌లు వేయడమేమిటని కాలేజీలను ప్రశ్నించారు. కళాశాలల తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ గత డిసెంబరులో ప్రతిపాదనలు సమర్పించామని, మార్చిలో కమిటీ సమావేశమైందని, అందులో తమ ప్రతిపాదనలు ఆమోదించిందని, దీనికి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలే నిదర్శనమన్నారు. టీఏఎఫ్‌ఆర్‌సీ తరఫు సీనియర్ న్యాయవాది పి.శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ కాలేజీలు 5,000 పేజీలతో ప్రతిపాదనలు సమర్పించాయని, వీటిని పరిశీలించడానికి సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో గత బ్లాక్ పీరియడ్‌లో వసూలు చేసిన మొత్తాన్నే ఈ ఏడాదికి సిఫారసు చేసిందన్నారు. ప్రభుత్వం తరపున రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ కాలేజీల్లో కొన్ని గత ఏడాది కంటే సుమారు 70 నుంచి 90 శాతం పెంపు అడుగుతున్నాయన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అక్షర జ్యోతులు వెలుగుతున్నాయి: సీఎం రేవంత్



హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో భారీ సంఖ్యలో విద్యార్థులు చేరుతున్నారు. వీటికి సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలను సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా షేర్ చేస్తూ ప్రభుత్వ టీచర్లు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. "పదేళ్ల చీకట్లను పారదోలి.. ప్రభుత్వ పాఠశాలల్లో అక్షర జ్యోతులు వెలుగుతున్నాయి. పేద బిడ్డల చదువుల గుడులు అక్షర మంత్రోశ్చరణలతో పవిత్రతను సంతరించుకున్నాయి. సర్కారు బడికి గత పాలకులు వేసిన తాళాలు బద్ధలవుతున్నాయి. పాఠశాలల్లో కనిపిస్తోన్న ఈ గుణాత్మక మార్పు తెలంగాణ భవిష్యత్తు గమనానికి సంకేతం. ప్రజా ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం. ఈ అక్షర యజ్ఞంలో చేతులు కలిపిన ప్రతి ఒక్కరికీ అభినందనలు"అని సీఎం పేర్కొన్నారు.



## సనాతన ధర్మం కోసం కలిసికట్టుగా..

తిరుమల: సనాతన ధర్మం కోసం ప్రజలు కలిసికట్టుగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్టు కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. శుక్రవారం ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో తిరుమల శ్రీవారిని కేంద్రమంత్రి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలను తితిదే రక్షించాలని కోరారు. పురాతన ఆలయాలను గుర్తించి అభివృద్ధికి నిధులివ్వాలన్నారు. తెలంగాణలోని కొండగట్టు, కరీంనగర్, వేములవాడ, ఇల్లంతకుంట రామాలయాలను అభివృద్ధి చేయాలని తితిదే ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. తితిదే ఉద్యోగుల్లో వెయ్యిమందికి పైగా అన్యమతస్థులు ఉన్నారని, నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తితిదే ఏ ఒక్కరి ఆస్తి కాదని.. హిందువులది మాత్రమేనని బండి సంజయ్ అన్నారు.

## భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలి: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల వంటి ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని సివిల్ ఇంజినీర్లను కోరారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో "నెక్స్ట్-జెన్ హై-రైజ్ బిల్డింగ్స్" అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చిందని చెప్పారు.

ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200పైగానే ఉన్నాయని, మరో 250 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలని సూచించారు. కాంపోజిట్ స్టీల్ హై-రైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌తో కలిసి పని చేస్తామన్నారు. సంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు హామీ ఇచ్చారు.





## ఇంధన స్విచ్ చుట్టూనే సందేహాలు

ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 ప్రమాదంలో ఇంధన సరఫరా స్విచ్‌లను ఆఫ్ చేసినట్లు సందేహాలను వ్యక్తంచేస్తూ అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. అమెరికా అధికారుల అంచనాలను ఉటంకిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. విమానంలోని జీఈ సంస్థకు చెందిన రెండు జెట్ ఇంజిన్లు సక్రమంగానే పనిచేస్తున్నట్లు పేర్కొంది. ఇంధనం సరఫరా చేసే స్విచ్‌లు ఆఫ్ అయి ఉంటాయని అమెరికా నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు పేర్కొంది. దీంతో టేకాఫ్ అయిన వెంటనే హఠాత్తుగా విమానం థ్రస్ట్‌ను కోల్పోయి ఉండొచ్చని పేర్కొంది. సాధారణంగా విమానం ఇంజిన్లను స్టార్ట్ చేయడం లేదా షట్‌డౌన్ చేయడానికి, కొన్ని అత్యవసర సందర్భాల్లో రీసెట్ కోసం వాడుతుంటారు. విమానం గాల్లోకి ఎగిరే సమయంలో స్విచ్‌లు సాధారణంగానే ఉన్నట్లు వాల్‌స్ట్రీట్ చెబుతోంది. అవి ఎలా ఆఫ్ అవుతాయనే విషయాన్ని నిపుణులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. వీటిని ఉద్దేశపూర్వకంగా ఆపారా..? తిరిగి ఆన్ చేయడానికి ప్రయత్నించారా అనే అంశాన్ని వారు స్పష్టంగా చెప్పలేకపోతున్నారని వెల్లడించింది. స్విచ్‌లు ఆఫ్ అయితే మాత్రం ర్యాట్ (ర్యామ్ ఎయిర్ టర్బైన్) ఎందుకు యాక్టివేట్ అయిందో చెప్పే అవకాశం ఉంది. మరోవైపు భారత్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రస్తుతం దీనిపై దర్యాప్తు చేస్తోంది. ప్రాథమిక నివేదిక అతిత్వరలో విడుదల కావచ్చన్న అంచనాలు ఉన్నాయి. అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ ప్రస్తుతం భారత దర్యాప్తునకు సహకారం అందిస్తోంది. అయితే, భారత ప్రభుత్వం ఇతర దేశాలకు డేటాను షేర్ చేయడంలో అభిప్రాయబేధాలున్నట్లు వాల్‌స్ట్రీట్ చెబుతోంది. ఈ ప్రమాదంపై అమెరికా అధికారులు ఆ పత్రికతో మాట్లాడుతూ విమానం మోడల్, లేదా జీఈ ఇంజిన్లతో దుర్ఘటనకు సంబంధం లేదని దర్యాప్తు సూచిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఎఫ్ఏఏ లేదా బోయింగ్, జీఈలు ఎటువంటి సర్వీస్ బులెటిన్‌ను విడుదల చేయలేదన్నారు. మరోవైపు వైమానిక రంగానికి చెందిన పత్రిక 'ది ఎయిర్ కరెంట్' కూడా ఈ ప్రమాద దర్యాప్తు మొత్తం ఇంధన కంట్రోల్ స్విచ్‌ల చుట్టూనే తిరిగినట్లు పేర్కొంది. దర్యాప్తు ముందుకుసాగే కొద్దీ చేరే కొత్త సమాచారంతో ఈ అంచనాలు, అభిప్రాయాలు మారుతుంటాయని వెల్లడించింది. ఈ ప్రమాదంపై ఇప్పటివరకు జరిపిన విశ్లేషణ, దర్యాప్తు ఆధారంగా ఏఏఐబీ ప్రాథమిక నివేదిక రూపొందించింది. దాన్ని మంగళవారం కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత ఇతర అధికారులకు సమర్పించినట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసుకోగా.. ఆ మరుసటిరోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. దీనికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్‌బాక్స్‌లను ఏఏఐబీ ల్యాబ్‌కు తరలించారు. అందులోని డేటాను విజయవంతంగా డౌన్‌లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు.

## గత ప్రభుత్వంలో హైదరాబాద్ బస్తీలు అభివృద్ధి చెందలేదు: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం రూ.5 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని వెంగళ్‌రావు నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రులు వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీల అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నేతలు తాము ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల్లో మాత్రమే వివక్షపూరితంగా అభివృద్ధి చేసుకున్నారని విమర్శించారు. హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారి, ప్రజాప్రతినిధులు, మంత్రుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కొంత మంది ఉప ఎన్నికల సమయంలోనే ఇక్కడికి వస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు.

## ఉజ్జయిని మహంకాళి బోనాలు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు: ఎమ్మెల్యే తలసాని



రెజిమెంటల్ బజార్: జులై 13న జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మహంకాళి ఆలయ పరిసరాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మీడియాతో మాట్లాడుతూ.. "బోనాల ఉత్సవాలు మన అందరి పండుగ. గొప్పగా చేసుకుందాం. బోనాల సందర్భంగా ఎంతో చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. 13న తెల్లవారుమున 3 గంటల నుంచే బోనాలు సమర్పించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులు క్యూ లైన్‌లలో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నాం. శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాకుండా, వివిధ ప్రాంతాల నుంచి అదనపు పోలీసు బలగాలను రప్పిస్తున్నాం. భక్తులకు తాగునీరు అందించేందుకు జీహెచ్‌ఎంసీ వాటర్ వర్క్స్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు" అని చెప్పారు.

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన...** ఉజ్జయిని మహాకాళి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. బోనాల ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన తలసాని.. మాజీ ఎమ్మెల్యే ప్రసూనతో మాట్లాడారు.

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కాసేపు సరదాగా మాట్లాడారు.

## ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో సీఎం అబద్ధాలు: హరీశ్‌రావు



హైదరాబాద్: జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అదనపు సమాచారం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి 6 సార్లు క్యాబినెట్ నిర్ణయాలు జరిగాయి. 6 సార్లు క్యాబినెట్‌లో ఆమోదం పొందిన పత్రాలన్నీ కమిషన్‌కు అందించాం. 3 సార్లు జరిగిన శాసనసభలోని అప్రూవల్ వివరాలు ఇచ్చాం. ఇంతకు మించి వివరాలు కూడా ఉన్నాయి. కానీ ప్రభుత్వం వాటిని మాకు ఇవ్వట్లేదు. కమిషన్‌కు ప్రభుత్వం పూర్తిస్థాయి సమాచారం అందజేయలేదని మాకు అనుమానాలున్నాయి. మా పార్టీ తరఫున పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తాం. నీటి వినియోగం, నీటి పంపకం మధ్య తేడా సీఎంకు తెలియడంలేదు. నీటి పంపకాలపై ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో సీఎం అబద్ధాలు చెప్పారు. కేంద్రంతో పోరాడి సెక్షన్ 3ని కేసీఆర్ సాధించారు. తెలంగాణకు 299 టీఎంసీల కృష్ణా నీటి కేటాయింపు కాంగ్రెస్ పాపమే.





## హెచ్‌సీఏ స్కాం.. సీఐడీ దూకుడు

హైదరాబాద్, జులై 11: హెచ్‌సీఏ స్కాంలో సీఐడీ స్పీడ్ పెంచింది. ఈ కేసులో అరెస్ట్ అయిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు, కోశాధికారి శ్రీనివాస్‌రావు, సీఈఓ సునీల్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ కార్యదర్శి రాజేందర్ యాదవ్ చర్లపల్లి జైలులో ఉండగా.. చంచల్ గూడ మహిళా జైలులో శ్రీచక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు కవిత ఉన్నారు. వీరందరినీ రిమాండ్‌కు తరలించింది సీఐడీ. అలాగే రిమాండ్ రిపోర్టులో నిందితులపై సీఐడీ సంచలన అభియోగాలు మోపింది. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జగన్మోహన్ రావు నియామకాన్నే తప్పుబట్టింది. మరింత దర్యాప్తు చేసేందుకు ఈరోజు సీఐడీ అధికారులు కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేయనున్నారు. మరోవైపు నిందితులు కూడా బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేయనున్నారు. ఈ ఐదుగురిని కస్టడీలోకి తీసుకుంటే హెచ్‌సీఏకు సంబంధించిన అవకతవకలు, హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జగన్మోహన్ రావు ఎన్నికపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు సీఐడీ అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈరోజు సీఐడీ కస్టడీ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. మరోవైపు ఈ స్కాంలో సీఐడీ అధికారులు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు ప్రస్తావించారు. గౌలిపుర క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు సి.కృష్ణ యాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి జగన్మోహన్ రావు, రాజేందర్ యాదవ్, కవిత కలిసి శ్రీచక్ర క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించి.. ఆ క్రికెట్ క్లబ్‌కు జగన్మోహన్ రావు అధ్యక్షుడిగా వ్యవహరించినట్లు సీఐడీ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది.

# గ్రామీణాభివృద్ధికి ఊతం - నాబార్డ్ స్థాపక దినోత్సవం

## - జూలై 12... నాబార్డ్ స్థాపక దినోత్సవం




జూలై 12 భారత దేశానికి ఒక ప్రత్యేకమైన ప్రాముఖ్యత కలిగిన రోజు. 1982లో ఈ తేదీన నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ు నాబార్డ్‌ను భారత ప్రభుత్వం స్థాపించింది. ఇది వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు నిధులు సమకూర్చే ప్రత్యేక ఆర్థిక సంస్థ. నాబార్డ్ స్థాపనతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఒక బలమైన పునాది వేయబడింది. కేవలం బ్యాంకింగ్ పరంగా కాక, సమగ్ర గ్రామీణాభివృద్ధికి మార్గదర్శిగా, పాలసీ ఆవిష్కర్తగా, సామాజిక పునరుజ్జీవానికి ఆధారంగా నాబార్డ్ తన పాత్రను నిరూపించుకుంది. భారత గ్రామీణ వ్యవస్థకు ఆధారమైన వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడం, మహిళల ఆర్థిక సాధికారతను చాటి చూపించడం వంటి లక్ష్యాలతో నాబార్డ్ ఆవిర్భవించింది. అప్పటి దాకా వ్యవసాయ రుణాలు, గ్రామీణ అభివృద్ధికి సంబంధిత నిధుల పంపిణీ వంటివి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అగ్రికల్చరల్ రీఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థల పరిధిలో ఉండేవి. కానీ సమగ్ర విధానాన్ని అమలు చేయాలన్న దృష్టితో, బి. శివరామన్ కమిటీ సిఫార్సుల మేరకు నాబార్డ్‌ను ఒక ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. ఈ సంస్థ స్థాపనతో వ్యవసాయ, గ్రామీణ రుణ విధానాలన్నీ ఒకే కట్టడి లోకి వచ్చాయి. నాబార్డ్ ప్రధానంగా వ్యవసాయ రంగానికి మాత్రమే కాక, గ్రామీణ జీవితంపై ప్రభావం చూపే అన్ని రంగాలకు మద్దతు అందిస్తోంది. రైతులకు రుణాలు అందించే బ్యాంకులకు రీఫైనాన్స్ చేయడం, గ్రామీణ మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ సంస్థలకు నిధులు సమకూర్చడం, స్వయం సహాయక సంఘాలను బ్యాంకులతో అనుసంధానించడం, వ్యవసాయేతర ఉపాధిని ప్రోత్సహించడం వంటి విభిన్న రంగాల్లో నాబార్డ్ ప్రత్యేకంగా పని చేస్తోంది. రాష్ట్ర స్థాయి సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులనూ సమర్థ వంతంగా సమన్వయం చేస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తోంది.

నాబార్డ్ పాలసీ మద్దతుతో ఏర్పడిన రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ( ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వంతెనలు, రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టులు, నిల్వ కేంద్రాలు వంటి మౌలిక సదుపాయాలకు వందలాది ప్రాజెక్టులకు నిధులు అందాయి. మరోవైపు, స్వయం సహాయక మహిళా సంఘాలు, బ్యాంకుల అనుసంధాన కార్యక్రమం ద్వారా లక్షలాది గ్రామీణ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేసే అవకాశాన్ని పొందారు. నాబార్డ్ శిక్షణా సంస్థల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు, చిన్న పరిశ్రమల అభివృద్ధి, వ్యవసాయ పద్ధతుల నవీకరణకు అవసరమైన నైపుణ్యాలు లభిస్తున్నాయి. ఇటీవలి గణాంకాల ప్రకారం, నాబార్డ్ ద్వారా ఇప్పటివరకు సుమారు రూ. 20 లక్షల కోట్ల రీఫైనాన్స్ సదుపాయాలు అందించ బడ్డాయి. కోటిన్నర స్వయం సహాయక సంఘాలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా గ్రామీణ ఆర్థిక చేరికలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. 6 లక్షల కిలోమీటర్లకు పైగా గ్రామీణ రహదారుల అభివృద్ధి, వేల వంతెనల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టుల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలతో కోట్లాది గ్రామీణుల జీవితాల్లో ప్రత్యక్షంగా ప్రభావం చూపిన అరుదైన సంస్థగా నాబార్డ్ నిలిచింది. గ్రామీణ యువతకు శిక్షణ, మహిళలకు ఆర్థిక సాధికారత, పర్యావరణ అనుకూల వ్యవసాయం, ప్రకృతి ఆధారిత జీవనశైలికి మద్దతు వంటి అంశాల్లోనూ నాబార్డ్ కొత్త దారులు చూపుతోంది. స్టార్టప్‌లు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు, డిజిటల్ ఆర్థిక సేవలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు నూతన ఆవిష్కరణలతో మద్దతు ఇచ్చే స్థాయికి ఇది ఎదిగింది. పథకాల అమలులో పారదర్శకత, ప్రాభవ వంతమైన మూల్యాంకనం, సామాజిక న్యాయం పట్ల నిబద్ధత వంటి విలువలతో నాబార్డ్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. నాబార్డ్ స్థాపక దినోత్సవం కేవలం ఒక జ్ఞాపక దినం కాదు. ఇది గ్రామీణ జీవిత నూతన రూపునకు బలమైన ఆధారంగా నిలిచిన సంస్థకు మన కృతజ్ఞతా రూపం. గ్రామాలు బలపడితేనే దేశం బలపడుతుంది అనే తత్వాన్ని కార్య రూపంలో నిలిపిన నాబార్డ్, గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగు పరిచే మార్గంలో యథాశక్తి కృషి చేస్తోంది. గ్రామీణ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు నాబార్డ్ ఒక దిక్సూచిగా నిలుస్తోంది. భవిష్యత్తులో మారుతున్న ఆర్థిక, పర్యావరణ, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా నాబార్డ్ తన ప్రణాళికలను విస్తరించుకుంటూ, గ్రామీణ భారత అభివృద్ధికి మరింత గాఢంగా సహకరిస్తుందని ఆశిద్దాం. జూలై 12 ు ఒక ఆర్థిక సంస్థకు పుట్టినరోజు మాత్రమే కాదు, గ్రామీణ జీవన వికాసానికి దేశం వేసిన బలమైన అడుగు గుర్తుగా నిలిచే రోజు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# మలాలా దినోత్సవం: బాలికల విద్యకు స్ఫూర్తిదాయకం

## జూలై 12 -మలాలా యూసఫ్‌జై పుట్టిన దినం




జూలై 12 – మలాలా యూసఫ్‌జై పుట్టిన రోజు. ఈ యువతీ పేరు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా బాలికల హక్కుల కోసం నిబద్ధతకు ప్రతీకగా మారింది. 2013లో ఐక్యరాజ్య సమితి, ఆమె పుట్టిన రోజున 'మలాలా డే'గా ప్రకటించడం, విద్యపై విశ్వ వ్యాప్త చర్చకు దోహద పడింది. ప్రపంచం మొత్తం బాలికల విద్యపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ, ఈ రోజు ప్రతి సంవత్సరం విద్యా హక్కు, లింగ సమానత్వం, సామాజిక మానవీయతకు సంకేతంగా నిలుస్తోంది. పాకిస్తాన్‌లో స్వాత్ లోయలో 1997లో జన్మించిన మలాలా, తాలిబాన్ కఠిన ఆంక్షల మధ్య బాలికల విద్యకు వ్యతిరేకంగా ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కొంటూ, పదేళ్ల వయసులోనే విద్య హక్కుపై బ్లాగులు రాయడం ప్రారంభించింది. "విద్య మా హక్కు" అన్న నినాదాన్ని నిశ్చయంగా ముందుకు తీసుకు వెళ్లిన ఆమెపై 2012లో తాలిబాన్ తీవ్రవాదులు కాల్పులు జరిపారు. కానీ ఈ ఘటన ఆమె గొంతును నిస్సత్తువ చేయలేదుప్రపంచాన్ని ఆలోచింప జేసింది. 2014లో మలాలా యూసఫ్‌జై నోబెల్ శాంతి బహుమతిని అందుకుంది. అతి చిన్న వయసులో ఈ ప్రతిష్ఠాత్మక బహుమతిని అందుకున్న ఆమె విద్యకు జీవితాన్ని అంకిత మిచ్చిన యువ నాయకురాలిగా నిలిచింది. భారత దేశంలో బాలికల విద్య మీద ఆమె ప్రభావం గణనీయంగా కనిపిస్తోంది. దేశంలో విద్యను రాజ్యాంగం మౌలిక హక్కుగా ప్రకటించినప్పటికీ, బాలికలు అందులో పూర్తిగా పాలు పంచుకుంటున్నారని చెప్పలేం. గ్రామీణ నేపథ్యం, ఆర్థిక వెనుకంజ, సామాజిక ఆంక్షలు బాలికల విద్యార్థతను నిరుత్సాహ పరుస్తున్నాయి. మలాలా కథ వీటిని ఎదుర్కొనే ధైర్యానికి మార్గదర్శిగా మారింది. 2021–22 యూ డైస్ మరియు గణాంకాల ప్రకారం, బాలికల విద్యా నమోదు రేటు ప్రాథమిక స్థాయిలో 94.8% ఉన్నా, హైస్కూల్ స్థాయికి వస్తే ఇది 79.2%, సీనియర్ సెకండరీ స్థాయిలో 59.3%కి పడిపోతుంది. బాలికలపై నమ్మకం, భద్రతా భయం, బాల్య వివాహాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులు విద్యను మానేందుకు కారణాలు అవుతున్నాయి. అదే గణాంకాల్లో మాధ్యమిక స్థాయిలో బాలికల డ్రాప్ అవుట్ రేటు 16.1%గా నమోదైంది. నేషనల్ ఫామిలీ హెల్త్ సర్వే %– 5 (2019–21) ప్రకారం, దేశ వ్యాప్తంగా 18 ఏళ్ల లోపు పెళ్లయిన బాలికల శాతం 23.3%గా ఉంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఇది 29.3%, తెలంగాణలో 23.5%. ఇది బాల్య వివాహాలు ఇంకా బాలికల చదువుకు పెద్ద అడ్డంకిగా ఉన్నాయని చెబుతోంది. అక్షరాస్యత పరంగా చూస్తే – పురుషుల అక్షరాస్యత 84.7%, మహిళలది 70.3%గా ఉంది. ఈ 14.4% తేడా ఇంకా సమానత్వానికి దూరంగా ఉన్నవారికి గుర్తు. తెలుగు రాష్ట్రాల్లో బాలికల విద్యపై ప్రాధాన్యత ఉన్నా, ఇంకా చాలా చోట్ల సమస్యలు నిలిచే ఉన్నాయి. తెలంగాణలో బాలికల సెకండరీ విద్య నమోదు రేటు 82.5%, మహిళల అక్షరాస్యత 66.6%గా ఉంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ రేట్లు వరుసగా 79.8% మరియు 59.5%. ఇవి వాస్తవ పరిస్థితులే గాని, తగిన విధాన మార్పులు, సమర్థవంతమైన అమలు లేకపోతే కేవలం గణాంకాలుగా మిగిలి పోతాయి. మలాలా దినోత్సవం ఈ దుస్థితికి ప్రతిస్పందనగా మేలుకొలుపు రోజు. ఇది విద్యను ఆశయంగా భావించాల్సిన అవసరాన్ని తెలియ జేస్తుంది. ప్రతి బాలికకు %–% స్థితిగతులు ఏవైనా – విద్య, భద్రత, సమ్మేళన వాతావరణం లభించాలి. ఇందుకోసం ప్రభుత్వ కార్యక్రమాలు, స్వచ్ఛంద సంస్థల కృషి, తల్లిదండ్రుల ఆత్మ విశ్వాసం అత్యవసరం. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో బేటీ బచావో %–% బేటీ పడావో, సుకన్యా సమృద్ధి యోజన, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మిడ్డే మీల్స్, ఉపకరణాల పంపిణీ, సైకిల్ పథకాలు బాలికల విద్యలో చేరికను ప్రోత్సహిస్తున్నాయి. అయితే ఇవి సరైన భద్రతా వాతావరణం, ఆరోగ్య, పారిశుధ్య సదుపాయాలు లేకపోతే ఫలప్రద మవ్వవు. మలాలా "ఒక పుస్తకం, ఒక కలం, ఒక విద్యార్థి ప్రపంచాన్ని మార్చగలడు" అని చెప్పినట్లే, విద్యకు ప్రేరణ ఇవ్వడం అన్నది బాలికకు వ్యక్తిగతంగా కాక, సమాజానికి సైతం పెట్టుబడి. ప్రతి ఊరిలో, ప్రతి పాఠశాలలో బాలికకు ఒక వెలుగు రేఖలా మారేలా మన కృషి సాగాలి. జూలై 12ు మలాలా దినోత్సవం ఒక వ్యక్తి జయంతి మాత్రమే కాదు. ఇది ు నేటి బాలిక విద్యార్థ్వరాలు కావాలని కోరే సంకల్పానికి నిదర్శనం. బాలికకు విద్య అంటే – ఆమెకు భవిష్యత్తు, కుటుంబానికి ఆశ, సమాజానికి అభివృద్ధి. మలాలా చూపించిన మార్గం ు మన దేశపు 12 కోట్ల బాలికలందరికీ ఆశతో నిండిన బాటగా మారాలి. విద్యతో వెలుగొందే సమాజమే అసలైన అభివృద్ధి లక్ష్యం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# రేణుకా చౌదరికి ఖమ్మం కోర్టులో ఊరట

ఖమ్మం జిల్లా: మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి ఖమ్మం కోర్టులో ఊరట లభించింది. రేణుకా చౌదరిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుని న్యాయస్థానం కొట్టివేసింది. 2014 సంవత్సరంలో వైరా ఎమ్మెల్యే టికెట్ తమకు (భూక్య రాంజీ సతీమణి కళావతికి లేదా ఆమె భర్తకు) ఇప్పిస్తానని రేణుకా చౌదరి మోసం చేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు న్యాయస్థానాన్ని కళావతి ఆశ్రయించారు. ఈ కేసుపై ఖమ్మం జిల్లా కోర్టులోని ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో విచారణ కొనసాగింది. నేరం రుజువు కాకపోవడంతో ఇవాళ (జులై11, శుక్రవారం) కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. రేణుకా చౌదరి తరపున సీనియర్ న్యాయవాదులు ఎం.నిరంజన్ రెడ్డి, మద్ది శ్రీనివాస్ రెడ్డి ఈ కేసుని వాదించారు. జిల్లా కోర్టు వద్ద నుంచి భారీ ర్యాలీతో జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి రేణుకా చౌదరి చేరుకున్నారు. ఆమెకి అనుచరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేణుకా చౌదరి మాట్లాడారు. తన 62సంవత్సరాల రాజకీయ జీవితంలో ఈ కోర్టు కేసు మొదటిదని చెప్పుకొచ్చారు. నిజం అనేది ఎప్పటికైనా నిరూపితం అవుతుందని అన్నారు. నాలుగు రోజుల్లో తన గేమ్ స్టార్ట్ చేస్తానని.. ఒక్కొక్కరిని ఆటాడిస్తానని హెచ్చరించారు. అసలు తనపై ఈ కేసు వేయించిన వారు ఎవరో.. వారి సంగతి చెబుతానని వార్నింగ్ ఇచ్చారు రేణుకా చౌదరి.

# "సరళ జీవితం - శాశ్వత ఆనందం"

## జూలై 12 - జాతీయ సరళత దినోత్సవం:




ప్రపంచం అధిక వేగంతో ముందుకు సాగుతున్నప్పటికీ, జీవితంలో సమస్యలు నానాటికీ అధిక మవుతూ, మానసిక ప్రశాంతత కోల్పోతున్న యుగంలో మనకు నిశ్శబ్దత, స్పష్టత, సరళత అత్యవసరం. ప్రతి సంవత్సరం జూలై 12న జరుపుకునే జాతీయ సరళత దినోత్సవం మనల్ని ఈ నిజాల వైపు మళ్లిస్తుంది. అమెరికన్ తాత్వికుడు, రచయిత, ప్రకృతి ప్రేమికుడు అయిన హెన్రీ డేవిడ్ థోరో స్మారకార్థంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించడం విశేషం. థోరో ఈ రోజున, 1817లో జన్మించాడు. ఆయన జీవితం, రచనలు ప్రపంచానికి ఒక గొప్ప సందేశాన్ని ఇస్తున్నాయి ు "సరళతే సారవంతమైన జీవితం." థోరో జీవితం ఆత్మ నిర్వహణ, స్వాతంత్ర్యం, ప్రకృతి అనురక్తత అనే మూలాల చుట్టూ తిరిగింది. అత్యవసరమైనవి తప్ప అన్నిటినీ విడిచి పెట్టిన ఆయన, మసాచుసెట్స్ రాష్ట్రంలోని వాల్డెన్ సరస్సు ఒడ్డున ఒక చిన్న హట్టులో దాదాపు రెండు సంవత్సరాలు జీవించాడు. ఆయన అనుభవాలనంతా "వాల్డెన్" గ్రంథంలో ఆత్మీయంగా రాశాడు. జీవితాన్ని పరికించు కోవాలంటే, అవసరమైన దానికే పరిమితం కావాలన్న సంకల్పం ఆయన రచనల్లో ప్రతి పుటలో ప్రతిధ్వనిస్తుంది. ఈ ధ్యేయమే జాతీయ సరళత దినోత్సవానికి ఆధార సూత్రం. థోరో తాత్వికతకు భారతీయ తత్వ శాస్త్రాలతో సన్నిహిత సంబంధం ఉంది. ఆయన సరళ జీవన విధానం మహాత్మా గాంధీని ప్రేరేపించింది. "సివిల్ డిసొబీడియెన్స్" రచన గాంధీకి అహింసా సిద్ధాంతానికి ఆదర్శం గా మారింది. థోరో వాదించినట్టు, తక్కువతో తృప్తి పడటం ఒక పరిపక్వత లక్షణం, సామాజిక బాధ్యతగా కూడా పరిగణించాలి. ఈ ఆధునిక యాంత్రిక ప్రపంచంలో మనం మానసిక ఒత్తిళ్ల మధ్య బతుకుతూ, భౌతిక వాదపు కలల్లో మునిగి పోతున్నాం. అధిక సం పాదన, అధిక వినియోగం, అధిక వ్యయం అనేవి మన జీవన లక్ష్యాలు గా మారి పోయాయి. ఈ అర్థ రహిత దుశ్చక్రాన్ని ధ్వంసం చేసే శక్తి సరళతలో ఉంది. సరళ జీవితం అంటే తక్కువ వస్తువులతో జీవించడమే కాదు ు అది అంతర్గతంగా స్పష్టత, శాంతి, తృప్తి కలిగించే జీవన ధోరణి. ఇది ఒక తాత్విక ప్రకటన %–% "ఇవన్నీ లేకుండా కూడా నేను సంతృప్తిగా జీవించగలను." అనే ఆత్మ విశ్వాసం. జాతీయ సరళత దినోత్సవం ఈ సందేశాన్ని ప్రతి వ్యక్తికి గుర్తు చేస్తుంది. ఈ రోజున వ్యక్తులు తమ జీవితాలను పునర్ మూల్యాంకనం చేసుకుంటారు. డిజిటల్ డిటాక్స్ చేయడం, అనవసర వస్తువులను తొలగించడం, ప్రకృతిలో ఎక్కువ సమయం గడపడం వంటి చర్యలు మన ఆత్మను శుద్ధి చేస్తాయి. ఆత్మ శాంతి, ఆర్థిక నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రయోజనాల వైపు మనల్ని నడిపిస్తాయి. ఈ దినోత్సవం వ్యక్తిగత స్థాయిలో మాత్రమే కాదు, సామాజిక స్థాయిలోనూ ప్రాముఖ్యత కలిగి ఉంది. వ్యవస్థలు కూడా మిత వాదాన్ని అంగీకరించాల్సిన అవసరం ఉంది. తక్కువ వనరులతో ఎక్కువ నాణ్యత కలిగిన జీవితం ఎలా సాగించవచ్చో ఈ సందేశం చెప్పిస్తుంది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారంగా సరళ జీవన శైలి నిలవ గలదు. థోరో ఒక సందర్భంలో అన్నట్టు %–% "Our life is frittered away by detail. Simplify, simplify." అంటే "మన జీవితం అతి వివరాల వల్ల నశించిపోతోంది. సరళతను అలవాటు చేసుకోండి." ఈ మాటలు మనకు ఇప్పటికీ సందేశ ప్రాయంగా ఉన్నాయి. మన జీవితం విలువైనదైతే, దానిని మరింత సారవంతంగా, పరిమిత అవసరాలతో జీవించాలి. మన కోసం మాత్రమే కాదు ు భవిష్యత్తు తరాల కోసం కూడా. ఈ నేపథ్యంలో జూలై 12న జరుపుకునే జాతీయ సరళత దినోత్సవం ఒక ఆత్మపరిశీలన దినంగా మారుతుంది. ఇది మన అభ్యాసాలను, ఆశయాలను తిరిగి చూసుకునే అవకాశంగా మారాలి. మనకు నిజంగా ఏమి అవసరం? ఏది ఉండక పోయినా మన జీవితం నిండుగా ఉంటుంది? ఇవే ప్రశ్నలు మనల్ని ఒక నిజమైన, ప్రామాణిక జీవన దిశగా నడిపిస్తాయి. థోరో చూపిన మార్గం వ్యక్తిగత బలానికి, స్వాతంత్ర్యానికి, ఆత్మాన్వేషణకు మార్గదర్శకంగా నిలవాలి. ఈ దినోత్సవం కేవలం స్మారక దినం కాదు ు ఇది మన జీవితానికి మార్గాన్ని నిర్దేశించే స్ఫూర్తి. సరళతలోని సౌందర్యాన్ని మనం తెలుసుకుంటే, జీవితం మరింత నిగూఢంగా, నిండు కుంపటి లాగా అనిపిస్తుంది. అప్పుడు మనం జీవితాన్ని బతికే వాళ్లం కాదు %–% నిజంగా అనుభవించే వాళ్లం అవుతాం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# అమెరికా పౌరసత్వాన్ని కోల్పోయే ప్రమాదంలో గ్రీన్ కార్డ్ హోల్డర్లు?



అమెరికా ప్రభుత్వం ఇటీవల కాలంలో పౌరసత్వం పొందిన కొన్ని వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , అటార్నీ జనరల్ పామ్ బోండి ఆదేశాల మేరకు అమెరికా న్యాయ శాఖ పౌరసత్వాన్ని రద్దు చేసే (డీన్యాచురలైజేషన్) ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఈ చర్యలు గ్రీన్ కార్డ్ హోల్డర్లు, ముఖ్యంగా సహజీకృత పౌరులలో భవిష్యత్తుపై ఆందోళనలను పెంచుతున్నాయి.

**– డీన్యాచురలైజేషన్ అంటే ఏమిటి?...** డీన్యాచురలైజేషన్ అనేది ఒక వ్యక్తికి ఇప్పటికే ఇచ్చిన అమెరికా పౌరసత్వాన్ని చట్టబద్ధంగా రద్దు చేయడం. పౌరసత్వాన్ని ఏ విధంగా పొందారనే దానిపై ఆధారపడి, కొంతమంది వ్యక్తులు ఈ ప్రక్రియకు లోనయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా పౌరసత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. చట్టబద్ధంగా కాకుండా పౌరసత్వం పొందినవారని గుర్తిస్తున్నారు. మోసం, తప్పుడు సమాచారం లేదా ఇతర చట్టవిరుద్ధ పద్ధతుల ద్వారా పౌరసత్వం పొందినవారిని గుర్తించే ప్రక్రియ మొదలైంది. పౌరసత్వం పొందే సమయంలో ముఖ్యమైన విషయాలను గోప్యం చేసినవారు లేదా తప్పుడు సమాచారం ఇచ్చినవారు.. దరఖాస్తు ప్రక్రియలో కావాలని తప్పులు చెప్పడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటివి చేసినవారు అనర్హులే...

**– సహజీకృత పౌరులు ఎవరు?...** సహజీకృత పౌరులు అనేవారు విదేశాల్లో జన్మించి, అనంతరం అమెరికాలో చట్టబద్ధంగా నివసించి పౌరసత్వం పొందినవారు. వీరు సాధారణంగా పౌరసత్వాన్ని పొందుతారు. ముందుగా గ్రీన్ కార్డ్ పొందుతారు. ఐదు సంవత్సరాల పాటు అమెరికాలో నివసిస్తారు. మంచి నైతిక విలువలు కలిగి ఉండటం. ఇంగ్లీష్ భాష , అమెరికా పౌరసత్వ విషయాల్లో పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని సహజీకృత పౌరులుగా పేర్కొంటారు..

**–ఓత్ ఆఫ్ అలీజియన్స్ స్వీకరించడం....** వీరు సాధారణంగా జన్మస్థ పౌరులతో సమాన హక్కులను పొందుతారు. అయితే వారు పౌరసత్వాన్ని చట్టబద్ధంగా కాకుండా పొందితే దాన్ని తిరిగి తీసివేయవచ్చు.

**– న్యాయ శాఖ చర్యలు...** డీవోజే ఇటీవల తన సివిల్ డివిజన్ అధికారులకు డీన్యాచురలైజేషన్ కేసులను వేగవంతం చేయాలని సూచించింది. ముఖ్యంగా క్రిమినల్ నేపథ్యం ఉన్నవారు లేదా జాతీయ భద్రతకు ముప్పుగా ఉన్నవారిపై దృష్టి సారించారు. వారు తప్పుడు మార్గంలో పౌరసత్వం పొందినట్లు తేలితే వారి పౌరసత్వాన్ని రద్దు చేస్తారు. "చట్టబద్ధంగా పౌరసత్వం పొందిన వ్యవస్థను సమర్థంగా కాపాడటం కోసం ఇవి తీసుకుంటున్న చర్యలు" అని న్యాయ శాఖ పేర్కొంది.

**– చట్టాల ప్రభావం.. భవిష్యత్తుపై ఆందోళనలు...** ఈ విధంగా పౌరసత్వాన్ని తిరిగి తీసుకునే చర్యలు ఎంతవరకు న్యాయబద్ధంగా, పారదర్శకంగా ఉంటాయన్నదానిపై ప్రస్తుతం పెద్ద చర్చ జరుగుతోంది. ముఖ్యంగా గతంలో పౌరసత్వం పొందిన వారిలో చాలామంది గ్రీన్ కార్డ్ హోల్డర్లు , వలసదారులు ఉండటంతో వారు భవిష్యత్తులో ఈ చర్యలకు గురవుతారా అన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మారుతున్న విధానాలు అమెరికాలో సహజీకృత పౌరుల భద్రతపై ప్రశ్నలు పెంచుతున్నాయి. పౌరసత్వాన్ని కోల్పోకూడదంటే, పౌరులు తమ సమాచారం నిజాయితీగా ఇచ్చారా, ఎటువంటి మోసం చేయలేదా అన్న విషయాలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. మీరు సహజీకృత పౌరులైతే లేదా పౌరసత్వం పొందే ప్రక్రియలో ఉన్నట్లయితే, ఈ పరిణామాలు మీపై ఎలా ప్రభావం చూపుతాయో అన్న ఆందోళనలు పెరుగుతున్నాయి.

చురకలు

## సంపాదకీయం

# నకిలీ పరిశోధనల అడ్డాగా భారత్?

ప్రపంచంలో శాస్త్రీయ పరిశోధనలకు భారతదేశం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుంది.. అయితే ఇటీవల కాలంలో కొన్ని ఆందోళనకర పరిణామాలు భారతీయ అకడమిక్ రంగాన్ని దిగులుపరుస్తున్నాయి. కొత్తగా వెలుగులోకి వచ్చిన ఓ అంతర్జాతీయ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా పరిశోధనల్లో నాణ్యత కోల్పోతున్న టాప్ 15 యూనివర్సిటీల్లో 11 భారతదేశంలోనే ఉన్నాయని వెల్లడైంది. ఇది దేశ విద్యా రంగానికి ఎంతటి ప్రతిష్ఠా నష్టమో చెప్పనవసరం లేదు.

**– కృత్రిమ మేధతో పెరిగిన వేగం.. నాణ్యత మాత్రం ప్రశ్నార్థకం?...** కృత్రిమ మేధ ఆధారిత టూల్స్ అభివృద్ధి చెందిన తర్వాత పరిశోధన చేసే విధానాలు పూర్తిగా మారిపోయాయి. పెద్ద సంఖ్యలో పబ్లికేషన్లు వేగంగా ఉత్పత్తి అవుతున్నాయి. కానీ ఇందులో చాలావరకు నకిలీ, పునరావృత, ప్రామాణికత లేని పరిశోధనలే ఎక్కువగా ఉంటున్నాయి. AI ఆధారిత టూల్స్ ఉపయోగించి కొందరు పరిశోధకులు తక్కువ సమయంలో ఎక్కువ పేపర్లు రాసేస్తున్నారు. అయితే వాటిలో ఒరిజినాలిటీ కొరవడుతోంది. దీనితో పరిశోధన పత్రాలు వాస్తవ విశ్లేషణలు లేకుండా, కేవలం ప్రచురణ కోసం మాత్రమే ప్రచురితమవుతున్నాయి.

**–నకిలీ ప్రాజెక్టులు.. విద్యా సంస్థల పేరును మసకబార్చే కుట్ర...** అన్ని యూనివర్సిటీలకూ ఒకే లెక్క కాదు. అయితే కొన్ని ప్రైవేటు, కొద్దిపాటి గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలు AI ఆధారిత పబ్లికేషన్లను ప్రోత్సహిస్తూ, నకిలీ పత్రాలు పంపిస్తున్నాయన్న ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. విద్యార్థులకు లేదా అధ్యాపకులకు పబ్లిష్ చేయాలనే ఒత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల అసలు గమ్యం దారి తప్పుతోంది.

**–ఈ నింద మన యూనివర్సిటీలకే ఎందుకు?...** అందుబాటులో ఉండే టెక్నాలజీని సరిగ్గా వినియోగించాల్సిన అవసరం ఉన్నా, మన యూనివర్సిటీల్లో పరిశోధనకు గల మౌలిక వసతులు పరిమితంగానే ఉన్నాయి. దీంతో, విశ్వవిద్యాలయాలు కేవలం పబ్లికేషన్ల సంఖ్యను పెంచే పిచ్చి ప్రయత్నాల్లో పడుతున్నాయి. ఈ కోణంలో చూస్తే, నాణ్యత కంటే పరిమాణానికే ప్రాధాన్యత అనే తప్పిద దృక్పథం మన విద్యా రంగంలో అడుగులు పెడుతోంది.

**–పరిష్కారం ఏమిటి?...** ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడం అత్యవసరం. ఇందుకోసం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. పబ్లికేషన్ పద్ధతులపై కఠిన నిబంధనలు: నాణ్యమైన పరిశోధనలకే ప్రాధాన్యతనిచ్చేలా కఠినమైన నిబంధనలు రూపొందించాలి. నకిలీ లేదా తక్కువ ప్రమాణాలున్న ఆర్టికల్స్‌ను ముందే ఫిల్టర్ చేసేందుకు పీర్ రివ్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి. AI సాయంతో చేసే పనిలో మానవ విశ్లేషణ తప్పనిసరిగా ఉండేలా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. అధ్యాపకులు, పరిశోధకులకు ప్రామాణిక పరిశోధన పద్ధతులపై క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలి. పరిశోధన అంటే జ్ఞానాన్ని విస్తరించడమే కానీ, ఖాళీగా సంఖ్యలు నింపడం కాదు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి నాణ్యమైన పరిశోధన అత్యవసరం. ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠ పెరగాలంటే, రీసెర్చ్ నాణ్యత మీద దృష్టి పెట్టాల్సిందే. లేదంటే 'నకిలీ రీసెర్చ్ భారత్' అనే ముద్ర విడిపించుకోలేనిదిగా మారుతుంది. ఈ అంశంపై మీ అభిప్రాయాలు ఏమిటి?

# అలనాటి మేటి కుస్తీ వీరుడు దారా సింగ్ - జూలై 12...దారా సింగ్ వర్ధంతి



కుస్తీ వీరుడు దారాసింగ్. దశాబ్దాల క్రితం బాగా పేరున్న వ్యక్తి. ఒకనాడు యువతరానికి రోల్ మోడల్. ఆ రోజుల్లో ప్రతి యువకుడు దారాసింగ్ లా కండలు కలిగి ఆకర్షణీయంగా ఉండాలని కోరుకునే వారు. దారా సింగ్ గా సుపరిచితులు అయిన దారా సింగ్ రణ్‌ధావా 1928 నవంబరు 19 – 2012 జూలై 12) ఒక భారతీయ ప్రొఫెషనల్ రెజ్లర్, నటుడు, రాజకీయవేత్త . ఆయన 1952 లో నటించడం ప్రారంభించాడు. రాజ్యసభకు నామినేట్ అయిన మొదటి క్రీడాకారుడు. హిందీ, పంజాబీ చిత్ర నిర్మాత, దర్శకుడు, రచయితగా పనిచేశాడు. ఆయన సినిమాలతో పాటు, టెలివిజన్‌లో కూడా నటించాడు. బజరంగ్బలి (1976) చిత్రంలోను, రామానంద్ సాగర్ నిర్మించిన రామాయణంలోనూ హనుమంతుడి పాత్రతో అతడు ప్రాచుర్యం పొందాడు. పంజాబ్ మజా ప్రాంతంలోని ధర్మూచక్ గ్రామంలో, రణ్‌ధావా జాట్ సిక్కు కుటుంబంలో 1928 నవంబరు 19 న దీదార్ సింగ్ రాంధవాగా జన్మించాడు. ఆ సమయంలో భారతదేశం బ్రిటిషు వలస పాలనలో ఉంది. ఆయన 1947 లో సింగపూర్ వచ్చాడు. అక్కడ డ్రమ్–తయారీ మిల్లులో పనిచేశాడు. గ్రేట్ వరల్డ్ స్టేడియంలో హర్నాం సింగ్ ఆధ్వర్యంలో తన కుస్తీ శిక్షణను ప్రారంభించాడు. ఆయన ఎత్తు 6 అడుగుల 2 అంగుళాలు ఉండేవాడు. బరువు 127 కిలోలు, ఛాతీ కొలత 53 అంగుళాలు. అతని శరీరాకృతి కారణంగా, అతను భారతీయ కుస్తీ శైలి అయిన పెహల్వానీని చేపట్టమని ప్రోత్సహించాడు. ప్రొఫెషనల్ రెజ్లింగ్‌కు మారిన తరువాత, అతను బిల్ వెర్నా, ఫిర్పో జిబిస్కో, జాన్ డా సిల్వా, రికిడాజాన్, డానీ లించ్, స్కీ హాయ్ లీ వంటి ప్రత్యర్థులతో ప్రపంచవ్యాప్తంగా పోటీ పడ్డాడు. అతడు కింగ్ కాంగ్ ను మట్టికరిపించిన వైనం ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. 1954 లో దారా, రుస్తాం–ఎ–హింద్ (ఛాంపియన్ ఆఫ్ ఇండియా) టోర్నమెంట్‌లో పాల్గొన్నాడు. అక్కడ టైగర్ జోగిందర్ సింగ్‌ను ఓడించి ఫైనల్‌ను గెలుచు కున్నాడు. మహారాజా హరి సింగ్ నుండి వెండి కప్పును అందు కున్నాడు. 1959 లో, కలకత్తాలో జార్జ్ గోర్డింకోను ఓడించి కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచు కున్నాడు. 1968 మే 29 న బొంబాయిలో, లౌ థేస్‌పై విజయంతో అతను ప్రపంచ ఛాంపియన్‌షిప్ సాధించాడు. ఆయన విరమణ ప్రకటించక ముందు చివరి టోర్నమెంట్ 1983 జూన్ లో ఢిల్లీలో జరిగింది. దారా సింగ్ తన గ్రామాన్ని సింగపూర్ కోసం 1948 లో విడిచిపెట్టాడు. ఆయన 1952 లో సంగ్దిల్‌తో కలిసి నటుడిగా తన వృత్తిని ప్రారంభించాడు. చాలా సంవత్సరాలు స్టంట్ ఫిల్మ్ యాక్టరుగా నటించాడు. బాబుభాయ్ మిస్త్రీ చిత్రం కింగ్ కాంగ్ (1962) లో తన మొదటి ప్రధాన పాత్రను పోషించాడు. 1963 నుండి దారా ప్రముఖ హీరోయిన్ ముంతాజ్ తో కలిసి 16 హిందీ చిత్రాలలో నటించాడు. ఈ జంట అత్యధిక పారితోషికం పొందిన బి–గ్రేడ్ నటులు అయ్యారు. సింగ్ ఒక్కో చిత్రానికి దాదాపు నాలుగు లక్షల రూపాయలు అందుకున్నాడు. అతను 1980 ల చివరలో టెలివిజన్‌లో నటించేందుకు వెళ్ళాడు. భారతీయ ఇతిహాసం రామాయణం టెలివిజన్ సీరియల్లో హనుమంతుడి పాత్రను పోషించాడు. వీర్ భీమ్ సేన్, రామాయణం వంటి అనేక చిత్రాలలో, ఇతర టెలివిజన్ సీరియల్స్ లో కూడా ఆయన నటించాడు. అతను అనేక సార్లు మహా భారతంలో భీమ పాత్ర పోషించాడు. బలరాముడు, శివుడి పాత్రలు కూడా ధరించాడు. సింగ్ 1998 జనవరిలో భారతీయ జనతా పార్టీలో చేరారు. రాజ్యసభకు నామినేట్ అయిన తొలి క్రీడాకారుడు దారా సింగ్. ఆయన 2003 – 2009 కాలంలో రాజ్యసభ సభ్యుడిగా పని చేసాడు. జాట్ మహాసభ అధ్యక్షుడిగా కూడా ఉన్నాడు. భారీ గుండెపోటుతో దారా సింగ్‌ను 2012 జూలై 7 న కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చేర్చారు. రెండు రోజుల తరువాత, రక్త ప్రవాహం లేకపోవడం వల్ల అతనికి మెదడు దెబ్బతిన్నట్లు నిర్ధారించారు. దారా 2012 జూలై 11 న ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యాడు. మరుసటి రోజే ముంబైలోని తన ఇంటిలో మరణించాడు. జుహు శ్మశానవాటికలో దహనం చేశారు.

**రామ కిష్టయ్య సంగణన భట్ల – 9440595494**

# తెలుగు సాహిత్యానికి ఇరివెంటి ఎనలేని సేవలు - జూలై 12... ఇరివెంటి కృష్ణమూర్తి జయంతి




డా. ఇరివెంటి కృష్ణమూర్తి

చుట్టూరా ఆవరించుకుని వున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది" అనే ధ్యేయంతో 1963లో విజయ దశమి అక్టోబరు 27 నాడు యువభారతి ఆవిర్భవించింది. యువభారతి సంస్థ "సమయపాలన మా క్రమశిక్షణ" నినాదంతో, సాహిత్య సభలను ఒక ప్రత్యేక ఒరవడి, శైలిలో నిర్వహించడం, అత్యధికస్థాయిలో సాహిత్య ప్రసంగాలను/ఉపన్యాసాలను పుస్తకరూపంలో తీసుకురావడం ద్వారా, సాహిత్యాసక్తపరులకు పఠనయోగం కల్పించడంలో అర్థ శతాబ్దకాలంగా, స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్న నేపథ్యంలో, అసామాన్య సేవలను అందించడం ప్రధాన ధ్యేయ లక్ష్యాలతో సంస్థ నిర్వహింప జేసుకోవడంలో తనదైన ప్రత్యేకతను సంతరించుకున్న సాహితీ సాంస్కృతిక సంస్థ. ఈ సాహితీ సంస్థకు స్థాపకులుగా, అధ్యక్షులుగా పనిచేశారు ఇరివెంటి కృష్ణమూర్తి. తెలంగాణ ప్రాంతానికి చెందిన తొలితరం కథకులలో ఇరివెంటి కృష్ణమూర్తి (1930 – 1989) ఒకరు. ఆయన 1966–67 నుండి ఆమరణాంతం యువభారతి అధ్యక్షులు. ఆయన చుట్టూరా చేరిన సాహిత్యాభిమానులు ఎందరో ఆయనతో స్ఫూర్తి పొందారు.

ఎంతటి సమస్యనైనా అందరి అభిప్రాయాలూ సావకాశంగా విని చిరునవ్వుతో పరిష్కరించి క్రియాశీలురను చేయడం ఆయన ప్రతిభ. ఆయన మహబూబ్నగర్ జిల్లాలో 1930 జూలై 12న జన్మించారు. 'యువభారతి' సాహిత్య సంస్థను తీర్చిదిద్ది 20 ఏళ్లపాటు నిర్వహించారు. ఈ సంస్థకు అధ్యక్షుడిగా పనిచేశారు. చిన్ననాడే నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసి జైలుకెళ్లారు. కారాగార శిక్ష అనుభవించారు. కృష్ణమూర్తి సికింద్రాబాదులోని యువభారతి సాహిత్య, సాంస్కృతిక సంస్థకు 1968 నుంచి 20 ఏళ్లపాటు నిర్వహించారు. యువభారతి సంస్థకు అధ్యక్షుడిగా ఉండి తెలంగాణలో సాహిత్య వికాసానికి కృషి సల్పినారు. 1979 నుంచి 1985 వరకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా, 1986 నుంచి ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యదర్శిగా ఉంటూ తెలుగు సాహిత్య లోకానికి ఎనలేని సేవలు చేశారు. సంస్కృతాంధ్ర భాషా సాహిత్యంలో కాకుండా ఉర్దూ భాషా సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేశారు. హిందీ, ఇంగ్లీషు భాషా నైపుణ్యాలు కూడా ఉండేవి. నిజాం కళాశాలలో డిగ్రీ చదువు కున్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి సి. నారాయణ రెడ్డి పర్యవేక్షణలో కవి సమయములు అనే అంశం మీద పరిశోధించి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి పి.హెచ్.డి పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ప్రొఫెసర్గా పనిచేసి రిటైర్ అయ్యారు. వెలుగు చూపే తెలుగు పద్యాలు, దేశమును ప్రేమించుమన్నా, లక్ష్మణుడు, వీచికలు, కవి సమయములు, దశరూపక సందర్శనం, భావన, ఇరివెంటి వ్యాసాలు తదితర రచనలు గావించారు. పఠనీయం శీర్షికతో 39 ఉత్తమ గ్రంథాల పరిచయాలు రాశారు. ఆయన పాలమూరు జిల్లా మాండలికంతోపాటు కరీంనగర్ జిల్లా మాండలికంలో కూడా కథలు రాశారు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక సంస్థల కార్యకలాపాలకు విశేష సేవలందించాడు. కథలు, కవితలు, వ్యాసాలు, పీఠికలు, సమీక్షలు రచించారు. 1989 ఏప్రిల్ 26వ తేదీన మరణించారు. **రామ కిష్టయ్య సంగణన భట్ల – 9440595494**

# తెలుగులో తొలి విజ్ఞాన సర్వస్వ సృష్టికర్త కొమర్రాజు - జూలై 12... కొమర్రాజు లక్ష్మణరావు వర్ధంతి





తెలుగు పాఠకులలో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని గురించి వినని వారుండరు. చారిత్రక గ్రంథ రచనకు అనేక మందిని ప్రోత్సహించిన, వెలువరించిన సంస్థ అది. ఆ సంస్థకు వ్యవస్థాపకుడు కొమర్రాజు వేంకట లక్ష్మణరావు. బహుభాషా పండిత్యానికి, మేథోనైశిత్యానికీ, చారిత్రక పరిశోధనకీ, పరిశీలనా దృష్టికీ ఆయన నిలువుటద్దం. యావజ్జీవితాన్ని చారిత్రక పరిశోధనకు ఆయన అంకితం చేసిన కృషీ వలుడు. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు (మే 18, 1877 – జూలై 12, 1923) తెలుగులో మొట్టమొదటి విజ్ఞాన సర్వస్వ సృష్టికర్త, విజ్ఞాన చంద్రికా మండలి స్థాపకుడు. తెలుగువారికి ఉన్నత ప్రమాణాలతో చరిత్ర, విజ్ఞాన రచనలను తెలుగులో అందించడానికి శ్రీకారం చుట్టిన విజ్ఞానవేత్త. ఎందరో సాహితీ మూర్తులకు ఆయన సహచరుడు, ప్రోత్సాహకుడు, స్ఫూర్తి ప్రదాత. నిద్రాణమైన తెలుగుజాతిని మేలుకొలిపిన గొప్ప వ్యక్తులలో లక్ష్మణరావు ఒకడు. లక్ష్మణరావు సంఘ సంస్కరణాభిలాషి, బాల్య వివాహాలను వ్యతిరేకించాడు. వితంతు వివాహం, భోగం మేళాల నిషేధం, అస్పృశ్యతా నివారణ, సముద్రయానం, అంతశ్శాఖా వివాహం వంటి వాటిని ప్రోత్సహించాడు. స్త్రీలలో విద్యాభివృద్ధికి తన సోదరి అచ్చమాంబతో కలసి ప్రయత్నించాడు. రాత్రిళ్ళు హరిజనులకు విద్య నేర్పే కార్యక్రమంలో పాల్గొన్నాడు. 1877 మే 18న కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలలో జన్మించిన ఆయన ప్రాథమిక విద్యను భువనగిరిలో పూర్తిచేశాడు. అక్కా, బావల వద్ద నాగపూరులో ఉంటూ మరాఠీ భాషను నేర్చుకున్నాడు. 1900 సంవత్సరంలో బి.ఎ. పట్టా పుచ్చుకొని, తరువాత ప్రైవేటుగా చదివి, 1902లో ఎమ్.ఏ.లో ఉత్తీర్ణుడ య్యాడు. మరాఠీ భాషలో వ్యాసాలు, పద్యాలు వ్రాసాడు. తెలుగు, మరాఠీ, ఆంగ్లం, సంస్కృతం, బెంగాలీ, ఉర్దూ, హిందీ భాషలలోనూ ఆయన ప్రావీణ్య తను సంపాదించాడు. విద్యాభ్యాస మైనాక మునగాల రాజా నాయని వెంకట రంగారావు సంస్థానములో ఉద్యోగము లభించగా, రాజా ప్రోత్సాహం వల్ల సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తూ, ఆర్థిక సహాయాన్ని పొంది, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయ గలిగాడు. కొమర్రాజు లక్ష్మణరావు, నాయని వెంకటరంగారావు, రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహ శాస్త్రి వంటివారితో కలసి హైదరాబాదు లోని నాటి రెసిడెన్సీ బజారులో రావిచెట్టు రంగారావు స్వగృహంలో 1901 సెప్టెంబర్ 1 న శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయమును స్థాపించారు. తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష స్థితిని మెరుగుపరచడమే ముఖ్యోద్దేశ్యంగా అధునాతన పద్ధతులలో ప్రారంభమైన మొదటి గ్రంథాలయం ఇదే. అలాగే లక్ష్మణరావు, నాయని వేంకటరంగారావు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యదేవర కాళేశ్వరరావు, రావిచెట్టు రంగారావు వంటివారు 1906 లో హైదరాబాదులో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపించారు. తద్వారా 1906 – 1910 మధ్యకాలంలో మండలి 30 పైగా గ్రంథాలను ప్రచురించడం జరిగింది. గ్రంథాలన్నింటిలోనూ సంపాదకునిగా లక్ష్మణరావు పాత్ర మరువ లేనిది. 1922 డిసెంబర్ 27 న హైదరాబాదులో లక్ష్మణరావు, ఆదిరాజు వీరభద్రరావు మొదలైనవారు కలసి ఆంధ్ర పరిశోధక మండలి స్థాపించారు. తెలంగాణ శాసనాలు, షితాబుఖాను చరిత్ర మొదలైన గ్రంథాలను ఈ సంస్థ ప్రచురించింది. తరువాత దీనిని లక్ష్మణరాయ పరిశోధక మండలిగా మార్చారు. 1916 కొవ్వూరులో ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపించినవారిలో లక్ష్మణరావు ఒకడు. మొదటినుండి యావజ్జీవ సభ్యుడుగా ఉండడమే కాకుండా, కొంతకాలం దానికి కార్యదర్శిగా కూడా ఉన్నాడు. లక్ష్మణరావు సాహితీ జీవితంలో మిగిలినవన్నీ ఒకయెత్తు, విజ్ఞాన సర్వస్వం ఒక్కటీ ఒకయెత్తు. బ్రిటిష్ ఎన్సైక్లోపీడియా తరహాలో ప్రపంచ విజ్ఞానాన్ని తెలుగువారికి పంచాలని, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని వెలువరించాలనేది ఆయన ప్రబల వాంఛ. 1912–13 కాలంలో ఈ బృహత్కార్యానికి పూనుకొన్నాడు. తాను ప్రధాన సంపాదకునిగానే కాదు, ప్రధాన రచయితగా కూడా పనిచేశాడు. లక్ష్మణరావే ఒక విజ్ఞాన సర్వస్వం. ప్రతివిషయాన్ని కూలంకషంగా పరిశోధించి, సమగ్రమైన స్వతంత్ర వ్యాసంగా వ్రాసేవాడు. మొదట 'అ'కారాదిగా నెలకు నూరు పేజీల చొప్పున దీనిని వెలువరించారు. రేయింబవళ్ళు శ్రమించి, మూడు సంపుటములు ప్రచురించారు. ఇందులో విజ్ఞాన శాస్త్రము, భాష, ఖగోళ శాస్త్రము, చరిత్ర, కళ వంటి వివిధ విషయాలపై ఉన్న నూరు వ్యాసాలలో ఆయన స్వయంగా 40 వ్యాసాలను కూర్చాడు. అధర్వవేదం, అద్వైతం, అభిజ్ఞాన శాకుంతలం, అలంకారాలు, అష్టాదశ మహాపురాణాలు, అట్ట బైండు, అష్టాధ్యాయి వంటి ఎన్నో వైవిధ్యమైన విషయాలపై ఆయన వ్యాసాలు వ్రాశాడు. "అ"కారంతో మూడు సంపుటాలు పూర్తిచేసిన తరువాత "ఆంధ్ర" సంపుటాన్ని తయారు చేసే పనిలో లక్ష్మణరావు రాత్రింబవళ్ళు శిలాశాసనాలు, ఇతర గ్రంథాల పరిశోధనలో గడిపాడు. ఆ సమయంలో ఆయనకు ఉబ్బసం వ్యాధి ఉధృతమై, మదనపల్లెలో కొంతకాలం విశ్రాంతి తీసుకొని మళ్ళీ మద్రాసు వచ్చాడు. ఆంధ్ర సంపుటం వ్రాయడానికి శాసనాలు పరిశీలిస్తూనే 1923 జూలై 12 న 46 యేళ్ళ వయసులోనే కొమర్రాజు లక్ష్మణరావు మరణించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు మరణించిన ఇంటిలో, అదే గదిలో లక్ష్మణరావు కూడా మరణించడం గమనార్హం.

**రామ కిష్టయ్య సంగణన భట్ల – 9440595494**

# ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం - ప్లాస్టిక్ నుండి ప్రకృతి పరిరక్షణ వైపు పయనం

## ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం - పర్యావరణ పరిరక్షణకు సంచుల విప్లవం - జూలై 12...ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం




ప్రకృతి పట్ల మన బాధ్యతను గుర్తు చేయడంలో ముఖ్యమైన తేదీ జూలై 12. ఈ రోజును ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవంగా జరుపుకోవడం వెనుక ఉన్న సందేశం స్పష్టమైనది ః ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి, పర్యావరణాన్ని కాపాడాలి. ఈ దినోత్సవం ద్వారా మనం ప్రజలలో అవగాహన పెంపొందించాలి, పర్యావరణ అనుకూలమైన ప్రత్యామ్నాయాల వైపు వారి దృష్టిని మళ్లించాలి. ఇది కేవలం సంబరంగా గడిపే రోజే అయినప్పటికీ, దీని వెనుక ఉన్న సందేశం విశ్వ వ్యాప్తి చెందాల్సినదిగా ఉంది. ప్లాస్టిక్ సంచుల వల్ల ఏర్పడుతున్న అపారమైన పర్యావరణ నష్టాన్ని గుర్తుచేస్తూ, దానికి ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఈ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. ఆధునిక జీవన శైలిలో వేగవంతమైన వినియోగదారుల సంస్కృతి పర్యావరణాన్ని ఆపద లోకి నెట్టిన తరుణంలో, ప్రతి చిన్న మార్పు గొప్ప మార్పును కలిగించ గలదని ఈ దినోత్సవం మనకు తెలియ జేస్తోంది. ప్లాస్టిక్ అనేది ఆవిష్కరణగా కనిపించినా, కాలక్రమంలో అది విధ్వంసకరంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 30 కోట్ల టన్నులకు పైగా ప్లాస్టిక్ తయారవుతోంది. అందులో సుమారు 50% ఒక్కసారి మాత్రమే ఉపయోగించబడి పారేసే విధంగా ఉంటుంది. వీటిలో కేవలం 9 శాతం మాత్రమే రీసైకిల్ అవుతుండగా, మిగిలినవి నేలలో, సముద్రాలలో శాశ్వతంగా పేరుకు పోతున్నాయి. భారత దేశంలో ప్రతి ఏడాది సుమారు 34 లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థం ఉత్పత్తి అవుతోంది. ఇందులో దాదాపు 60 శాతం మాత్రమే సేకరించ బడుతుంది. మిగిలిన వాటిని వ్యవస్థాపితంగా నిర్వహించక పోవడం వల్ల అవి నేల, నీరు, గాలి తదితర మూలాలను కలుషితం చేస్తున్నాయి. ప్లాస్టిక్ సంచులు సముద్ర జీవులకు మరణ ఘంటికలుగా మారాయి. ప్లాస్టిక్ తిన్న మత్స్యాలు, తాబేళ్లు, సముద్ర పక్షులు కోట్ల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, 2050 నాటికి సముద్రాల్లో చేపల కంటే ఎక్కువ ప్లాస్టిక్ ఉండే ప్రమాదం ఉన్నదని యూఎన్ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ప్లాస్టిక్ మిగతా జీవజాలంతో పాటు మానవ ఆరోగ్యం పైనా కీడు చేస్తోంది. ప్లాస్టిక్ సంచుల తయారీలో ఉపయోగించే కెమికల్స్ గాలి ద్వారా, నీటి ద్వారా మన శరీరం లోకి చేరి అనేక జీర్ణ, హార్మోనల్ సమస్యలకు దారి తీస్తున్నాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో పేపర్ సంచులు ప్రకృతి మిత్రంగా, సమాజానికి మేలు చేసే మార్గంగా అభివృద్ధి చెందుతున్నాయి. పేపర్ బ్యాగులు పూర్తిగా బయో డిగ్రేడబుల్, అంటే తక్కువ వ్యవధిలోనే మట్టిలో కలిసి పోతాయి. కొన్ని వారాల వ్యవధిలో అవి పూర్తిగా కరిగిపోయే సామర్థ్యం కలిగి ఉంటాయి. ఇది ప్లాస్టిక్‌కు వేల రెట్లు మంచిదని చెప్పవచ్చు. పేపర్ బ్యాగులు పునర్వినియోగ పరచదగినవే కాకుండా, పునరుత్పత్తి సామర్థ్యంతో కూడుకున్నవిగా కూడా ఉన్నందున వనరుల దుర్వినియోగం నివారించవచ్చు. ఇవి పాత కాగితాలతో తయారయ్యే అవకాశం ఉండడం వల్ల చెట్ల నరికివేతను కూడా తక్కువ చేస్తుంది. పేపర్ సంచుల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఉత్సాహం కలుగుతుంది. స్వయం సహాయక బృందాలు, గృహ పరిశ్రమలు, చిన్న తరహా సంస్థలు పేపర్ బ్యాగుల తయారీలో పాల్గొనడం ద్వారా ఉపాధిని పొందుతున్నాయి. ప్రత్యేకంగా గ్రామీణ మహిళలకు ఇది ఆదాయ మార్గంగా మారుతోంది. పేపర్ బ్యాగుల రంగం స్వయం ఉపాధికి అనువైనదిగా నిరూపిత మవుతోంది. ప్రస్తుతం దేశంలో పలు రాష్ట్రాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించాయి. కానీ నిషేధం అమలులో ఖచ్చితత్వం ఉండాలి. ప్రజల్లో పర్యావరణ అవగాహన పెరిగితేనే ఈ ప్రయత్నాలు ఫలిస్తాయి. వినియోగ దారులు దుకాణాలకు వెళ్తున్నప్పుడు తమతో పేపర్ బ్యాగులు లేదా జ్యూట్ సంచులు తీసుకెళ్లడం అలవాటుగా మార్చు కోవాలి. వ్యాపారులు కూడా పర్యావరణ హితం కోసం ప్రయత్నించి, ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్ సంచులనే అందించాలి. స్కూళ్లు, కాలేజీలు, సేవా సంస్థలు ఈ విషయంపై విద్యా సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి చైతన్యం కలిగించాలి. పర్యావరణ పరిరక్షణలో వ్యక్తిగత బాధ్యత ఎంతో ముఖ్యమైనది. ప్రతి ఒక్కరి మార్పే ప్రపంచం మారడానికి తొలి మెట్టు. ఒక పేపర్ బ్యాగ్ ఉపయోగించడం చిన్న విషయంగా అనిపించవచ్చు. కానీ అదే సంచి ఒక చేపను, ఒక చెట్టును, ఒక ఊపిరి తిత్తును కాపాడే పరిణామంగా మారవచ్చు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడమంటే నిషేధించే ప్రయత్నం కాదు. అది మన భవిష్యత్తును నిర్మించేందుకు తీసుకునే చైతన్య బద్ధమైన నిర్ణయం. ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం ప్రతి మనిషికీ ఒక ప్రశ్న వేస్తుంది – మనం భూమికి మిత్రులమా? లేక శత్రువులమా లేక ముప్పులమా? ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పి పేపర్ బ్యాగ్‌ను స్వీకరించడం ద్వారా మనం ప్రకృతి పక్షంలో నిలబడి, భూమిని భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించ గలమని ఈ దినోత్సవం స్పష్టంగా తెలియ జేస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ఆర్టీసీ కార్గో బుకింగ్ సేవలు ప్రైవేటుపరమా?

కరీంనగర్ : ఒకప్పుడు పార్సిళ్లు పంపించడానికి అందరూ తపాలా శాఖను ఆశ్రయించేవారు. తరువాత కొరియర్ సంస్థలు వెలిశాయి. ఇదే బాటలో ఆర్టీసీ కూడా అడుగేసి, పార్సిల్ బుకింగ్ (లాజిస్టిక్) సేవలు అందిస్తోంది. రాష్ట్రం లోపలే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా సర్వీసులు నడపడంతో గంటల వ్యవధిలోనే పార్సిళ్లు ఆయా గమ్యస్థానాలకు చేరుతున్నాయి. వినియోగదారుల నుంచి కూడా మంచి ఆదరణ లభిస్తోంది. అయితే ఇటీవల బుకింగ్ కేంద్రాల సంఖ్య తగ్గిపోవడం, సంస్థ సిబ్బందిని కుదించడంతో కార్గోను ప్రైవేట్‌పరం చేస్తున్నారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రీజియన్‌లోని లాజిస్టిక్ కేంద్రాలపై కథనం.

**రోజుకు రూ.3 లక్షల ఆదాయం**

కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలో 47 కార్గో బుకింగ్ కేంద్రాలున్నాయి. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, గోదావరిఖని స్టేషన్లలో మాత్రం వీటిని ఆర్టీసీ నిర్వహిస్తుండగా మిగిలిన 43 కేంద్రాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. కేవలం కరీంనగర్ బుకింగ్ కేంద్రం నుంచే రోజుకు రూ.1.50 లక్షలు, రీజియన్ వ్యాప్తంగా దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

ఆర్టీసీ ఉద్యోగులు మాత్రమే కౌంటర్లలో పార్సిళ్లను బుకింగ్ చేసి




డబ్బులు తీసుకునేవారు. జులై 1 నుంచి పొరుగు సేవల సిబ్బంది ద్వారా మాత్రమే బుకింగ్ ప్రక్రియ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ సిబ్బంది డబ్బును సంబంధిత శాఖకు జమచేసే విధులు మాత్రమే నిర్వహిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**కారణమేంటో..?**

కార్గో కేంద్రాల్లో పార్సిల్, బుకింగ్ బాధ్యతను పొరుగు సేవల సిబ్బంది నిర్వహిస్తుండటంతో ఆర్టీసీ సిబ్బందిని ఆయా డిపోలకు తిరిగి పంపించారు. బుకింగ్ కేంద్రాల్లో పని చేస్తున్న వారంతా కండక్టర్లు కావడం, సంస్థలో గత కొంతకాలంగా నియామకాలు లేకపోవడంతో సిబ్బంది కొరత ఉంది. సంస్థ ఉద్యోగులను తగ్గించారా? లేక కార్గోను పూర్తిగా ప్రైవేట్‌పరం చేయనున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో బుకింగ్ సేవలను ప్రైవేట్‌కు అప్పగించినట్లు సమాచారం.

రీజియన్‌లో బుకింగ్ కేంద్రాలు : 47

ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించేవి : 4

# చెరువుల్లోకి చేప చేరేనా!

పెద్దపల్లి : మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఉచిత చేపల పిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి జులై సమీపిస్తున్నప్పటికీ టెండర్ల ప్రక్రియ ఊసే లేదు. గతేడాది నాణ్యత లేని చిన్న చేప పిల్లలు పంపిణీ చేయగా.. మత్స్యకారులు అడ్డుకోవడంతో ఈ ప్రక్రియ నిలిపి వేశారు. ఈ ఏడాదైనా పంపిణీ చేస్తారా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతుండగా.. మత్స్యశాఖ మంత్రి శ్రీహరి ప్రకటన కాస్త ఊరటనిచ్చింది.

**పంపిణీ సాధ్యమయ్యేనా**

జిల్లాలో 1,073 చెరువులు, కుంటల్లో 79.31 లక్షలు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించారు. చెరువులు, కుంటలతోపాటు శ్రీపాద జలాశయంలో చేపలు, రొయ్యలు విడుదల చేస్తున్నారు. గతంలో సుందిళ్ల జలాశయంలో చేపల పెంపకం చేసేవారు. గతేడాది నుంచి గేట్లు ఎత్తేయడంతో ఇక్కడి మత్స్యకారులకు ఉపాధి కరవైంది. గతేడాది టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు చేప పిల్లలు సరఫరా చేశారు. సుల్తానాబాద్, అంతర్గాం మండలాల్లో 1.30 లక్షల పిల్లలను చెరువుల్లో ప్రజాప్రతినిధులు వదిలారు. నాణ్యత లేకపోవడంతో గతేడాదికి సంబంధించి పంపిణీ ప్రక్రియ మధ్యలోనే పూర్తిగా నిలిచిపోయింది. కాగా ప్రస్తుతం ఇప్పటికే టెండర్లు పూర్తి చేసి నీటి వనరుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉంది. తక్కువ సమయంలో టెండర్లు ఖరారు చేసి పంపిణీ చేస్తారా లేదా అనే సందిగ్ధం నెలకొంది.

**సమస్యలు ఇలా..**

ప్రతి సీజన్‌లో పిల్లల పరిమాణం, మోతాదు విషయంలోనూ కచ్చితమైన ప్రామాణికత పాటించడం లేదు.

పెద్ద సైజు(80 నుంచి 100 ఎంఎం) పిల్లలు, చిన్న సైజు(35-40



ఎంఎం) పిల్లలను చెరువుల్లో వదలాలి. పోషకాహారలోపంతో రెండు కిలోలు ఉండాల్సిన చేప అర కిలోకే పరిమితమవుతోంది.

కల్తీ విత్తన పిల్లల పంపిణీ చేయడంతో రవ్వ, బొచ్చ రకాల ఉత్పత్తి పెరగకపోవడంతో నష్టం వస్తుంది.

ఆదేశాల కోసం చూస్తున్నాం

జిల్లాలో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఇప్పటికే టెండర్లు నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం.

నరేష్‌నాయుడు, జిల్లా మత్స్యశాఖ అధికారి

జిల్లాలో ఉచిత చేప పిల్లల వివరాలు

సొసైటీలు : 281

సభ్యులు : 13,450

చేపలు వదిలే వనరులు : 1,073

ఈ ఏడాది లక్ష్యం : 79.31 లక్షలు

శ్రీపాద జలాశయం : 6,10,500

# అందని సహకారం.. వ్యాపారుల ఇష్టారాజ్యం



పరిగి : రైతుల సేవకు జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ (డీసీఎమ్మెఎస్) సంఘం మంగళం పలికింది. దాదాపు ఏడాదిన్నరగా అన్నదాతలకు ఎరువులు, విత్తనాలు అందించడం లేదు. దీంతో బహిరంగ విపణిలో వ్యాపారులు వద్ద అధిక ధరలకు కొంటున్నారు. డీసీఎమ్మెఎస్‌లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అందుతుండేవి. ఏటా సుమారు రూ.8 కోట్ల లావాదేవీలతో సంస్థకు అదనపు ఆదాయం వచ్చేది. మార్కెట్లో అధిక ధరలకు కళ్లెం పడేది. నాలుగు పంట కాలాల నుంచి చేతులెత్తేయడంతో రైతుల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది.

**జిల్లాలోని పలు ప్రాంతాల్లో శాఖలు..**

జిల్లా శాఖ పోను పరిగి, తాండూరు, వికారాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మేడ్చెల్, ఇబ్రహీంపట్నం, పాల్మాకుల ప్రాంతాల్లో శాఖలున్నాయి. వాటి పరిధిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 34 రైతు సేవా కేంద్రాలున్నాయి. పాలకవర్గ పదవీకాలం ఫిబ్రవరితో ముగిసింది. ఛార్జి ఎవరూ తీసుకోలేదు. పాత పాలకవర్గం కోర్టును ఆశ్రయించగా.. అనుకూల తీర్పు వచ్చింది. బాధ్యతల విషయంలో ఇంకా జాప్యమవుతోంది.

**ఖర్చులు ఎక్కువే..**

వాణిజ్య భవనాలు ఇతర వాటితో కలిపి డీసీఎమ్మెఎస్‌కు నెలకు రూ.10 లక్షల ఆదాయం వస్తోంది. ఉద్యోగుల జీతభత్యాలకు మాత్రం రూ.15 లక్షల దాకా వెచ్చించాల్సి వస్తోంది. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నుంచి రూ.4 కోట్ల కమీషన్ విడుదల కావాల్సి ఉంది. ఇదీ రైతుల ప్రగతికి ప్రతిబంధకంగా మారుతోంది.

**నష్టం వస్తోందని..**

మార్క్‌ఫెడ్ నుంచి లారీ యూరియా తెచ్చి విక్రయిస్తే రూ.10వేల వరకు నష్టం వస్తోందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. బస్తా యూరియా ధర రూ.274 కాగా.. మార్కెట్లో రూ.300 వరకు, డీఏపీ బస్తా రూ.100- 150 వరకు విక్రయిస్తున్నారు. నెల రోజులుగా కొరత ఉంది. రైతులు నష్టపోవాల్సి వస్తోంది. డీసీఎమ్మెఎస్‌లో ఉన్న ధరకే అమ్మాల్సి వస్తోందని, నష్టమే వాటిల్లుతోందని చెబుతున్నారు. వ్యాపారులపై నియంత్రణ లేకపోవడంతో అధిక ధరలకు అమ్ముతూ రైతులను నట్టేట ముంచుతున్నారు.

**సేవల కొనసాగింపునకు ప్రయత్నిస్తాం..**

ఆథరైజేషన్ లేకపోవడం, లారీకి రూ.10వేల చొప్పున నష్టం రావడంతో విక్రయాలకు ఇబ్బంది కలుగుతోంది. రైతులను దృష్టిలో ఉంచుకొని సేవలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తాం.

బి.వెంకటరమణారెడ్డి, జిల్లా మేనేజర్

వానాకాలం సాధారణ సాగు: 5,51,105 ఎకరాలు

ప్రస్తుత సాగు: 3,18,650 ,,

జిల్లాలో అన్నదాతలు: 3,18,462

ఏటా ఎరువుల వినియోగం: 84,031 మె.ట.

# చెప్పిందే మెనూ.. పెట్టిందే తిను!



పరిగి : ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం కొత్త పట్టిక(మెనూ) సరిగా అమలు కావడం లేదు. కొన్ని బడుల్లో కేవలం అన్నం, నీళ్లచారు వడ్డిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. నాణ్యత లేని భోజనం చేయలేక ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని మరికొందరు చెబుతున్నారు. వంట ఏజెన్సీ మహిళలకు వేతనం అందకపోవడంతో మెనూ ప్రకారం వడ్డించాలని ఒత్తిడి చేయలేకపోతున్నారు. చాలామంది పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 776 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 176 ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిలో 69,778 మంది విద్యార్థులు చదువుతున్నారు.

**మైల్వార్ బడిలో అన్నం.. నీళ్ల చారే..**

మండలంలోని మైల్వార్ ప్రాథమిక పాఠశాలలో వంట నిర్వాహకులు భోజనం వండ లేదు. అదేమిటని అడిగితే మూణ్నెల్లుగా బిల్లులు లేవని, సరకులు ఎవరూ అరువుకు ఇవ్వడం లేదని చెబుతున్నారు. 155 మంది విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనం చేయాల్సి వచ్చింది. పెద్దేముల్ మండలంలోని ఓ పాఠశాలలో బిల్లులు రావడం లేదనే సాకుతో మెనూ పాటించడం లేదని విద్యార్థులు వాపోయారు. రోజూ అన్నం, నీళ్లచారు వడ్డిస్తున్నారని, భోజనం చేయలేకపోతున్నామని ఉపాధ్యాయులకు చెప్పామంటున్నారు.

**ఒక రోజు మాత్రమే గుడ్డు..**

నియోజకవర్గంలోని బడుల్లో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులకు నాలుగు నెలలుగా బిల్లులు రావడం లేదు. ఒక్కో పాఠశాలకు రూ.1- 1.50 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. నిర్వాహకులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కూరలు వడ్డించడం లేదు. కేవలం సాంబారుతో సరిపెడుతున్నారు. వారంలో మూడ్రోజులకు బదులు ఒక రోజు మాత్రమే గుడ్డు ఇస్తున్నారు. బిల్లుల విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని తాండూరు ఎఈవో వెంకటయ్య తెలిపారు.

**అర్ధాకలితో అలమటిస్తూ..**

మూణ్నెల్లుగా మధ్యాహ్న భోజనం బిల్లులు రాకపోవడంతో ఏజెన్సీ వారు తోచింది వండి పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కొడంగల్ మండలంలో రూ.25 లక్షలు, దౌల్తాబాద్‌లో రూ.23 లక్షలు, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో రూ.21 లక్షలు రావాల్సి ఉంది. కొడంగల్ మండలం బుల్కాపూర్ పాఠశాలలో ఏడాదిగా మధ్యాహ్న భోజనం నిలిచింది.

**బకాయిలు రూ.50 లక్షలు**

నిర్వాహకులకు మధ్యాహ్న భోజన బిల్లులు సకాలంలో అందకపోవడంతో ఆ ప్రభావం విద్యార్థులపై పడుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.50 లక్షలు విడుదల కావాల్సి ఉంది. కొందరు విద్యార్థులు ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకొంటున్నారు. బిల్లుల చెల్లించకపోవడంతో అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

# డయాలసిస్ రోగులకు చేయూత

వికారాబాద్ : డయాలిసిస్ రోగులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. గతంలో కొందరికి రాగా.. చాలామంది ఎదురు చూశారు. వారి అభ్యర్థనలపై స్పందించిన ప్రభుత్వం కొత్తగా రూ.2,016 చొప్పున మంజూరు చేసింది. జిల్లాలో ఇప్పటికే 93 మంది పొందుతున్నారు. చాలామంది దరఖాస్తు చేశారు. కొత్తగా 88 మందికి చేయూత మంజూరైంది. పురపాలక పరిధిలోని వారికి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల వారికి తపాలా కార్యాలయాల ద్వారా ఇస్తున్నారు.

**నాలుగు చోట్ల రక్తశుద్ధి కేంద్రాలు..**

జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ బాధితులను గుర్తించిన ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక రక్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్‌లో కేంద్రాలున్నాయి. గతంలో హైదరాబాద్‌కు వెళ్లేవారు. ప్రస్తుతం వారికి ఆ శ్రమ తప్పింది. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను ప్రభుత్వ ఆస్పత్రిల్లో కల్పించి రోగులకు వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చారు.

**జిల్లావ్యాప్తంగా 23 పడకలు..**

తాండూరులో 8, వికారాబాద్, పరిగి, కొడంగల్ కేంద్రాల్లో 5 చొప్పున పడకలున్నాయి. అందుబాటులో ఉన్న పడకల ఆధారంగా తాండూరులో 8, మిగతా చోట్ల అయిదుగురికి ఒక్కో విడతలో రక్తశుద్ధి చేస్తున్నారు. రోగికి నాలుగు గంటలపాటు సేవలందిస్తున్నారు.



**40 మందికి చేస్తున్నాం..**

వికారాబాద్ కేంద్రంలో 40 మందికి రక్తశుద్ధి చేస్తున్నాం. ఒక్కొక్కరికి నెలకు 12 సార్లు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన నెలకు 500 సార్లు నిర్వహిస్తున్నాం. ఈ కేంద్రాన్ని 2018లో ప్రారంభించారు. వికారాబాద్ పరిసర మండలాల వారు ఇక్కడికి వస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చికిత్స చేస్తున్నాం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి.

మహ్మద్ రిజ్వాన్, రక్తశుద్ధి కేంద్రం ఇన్‌ఛార్జి, వికారాబాద్

# రైతు వెన్నంటి.. సేవల్లో మేటి

జగిత్యాల : పంటలపై పరిశోధన.. వంగడాల రూపకల్పన.. క్షేత్ర స్థాయి అవగాహన.. ఇలా బహుముఖ సేవలతో జగిత్యాల మండలం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) నాలుగు దశాబ్దాలుగా అన్నదాత సేవలో తరిస్తోంది. 1986 జులై 9న నాటి సీఎం ఎన్టీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన పరిశోధన స్థానం నేడు 40వ వసంతంలోకి అడుగు పెడుతోంది.

పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలో మొదట ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లాలుండేవి. అనంతరం వరంగల్‌లో ఆర్ఏఆర్ఎస్‌ను ఏర్పాటు చేసి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లాలను చేర్చారు. ప్రస్తుతం పొలాస పరిధిలో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని మొత్తం 10 జిల్లాల్లో పరిశోధన, విస్తరణ కార్యకలాపాలు సాగుతున్నాయి. 15 జిల్లాలకు ఇక్కడి నుంచే ప్రతి వారం రెండు సార్లు వాతావరణ బులెటిన్లు అందిస్తున్నారు. వ్యవసాయ అధికారులకు నిరంతర శిక్షణ, రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**భావి శాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతూ..**

పొలాస పరిధిలో కరీంనగర్, కూనారం, ముథోల్, ఆదిలాబాద్, రుద్రూరులలో పరిశోధన స్థానాలు, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జమ్మికుంట, రుద్రూరు, బెల్లంపల్లిల్లో ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రాలు, పొలాస, జమ్మికుంట, రుద్రూరుల్లో వ్యవసాయ



పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. పొలాసలో డిగ్రీ, పీజీ కళాశాలలు అనుబంధంగా కొనసాగుతున్నాయి. వరి, నువ్వుల్లో కొత్త వంగడాల రూపకల్పన, ఇతర పంటల్లో యాజమాన్యం, చీడపీడల నివారణ, నీటిపారుదల, ఎరువుల వాడకంపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు.

**సృష్టించిన వంగడాలు**

వరిలో పొలాసప్రభ, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, మానేరు సోన, జగిత్యాల మశూరి, కరీంనగర్ సాంబ, ప్రాణహిత, అంజన, ప్రత్యుమ్న, బతుకమ్మ, జగిత్యాల రైస్-1, జగిత్యాల వరి-2, జగిత్యాల వరి-3 రకాలను విడుదల చేశారు. పసుపులో సుగుణ, సుదర్శన, వేరుశనగలో జేసీసీ88, జగిత్యాల పల్లి-1, నువ్వుల్లో స్వేతా తిల్, రాజేశ్వరి, హిమ, చందన, జగిత్యాల తిల్-1, జగిత్యాల తిల్-2 రకాలను ఆవిష్కరించారు. రైతులు వరిలో సంకర రకాలపై మక్కువ చూపడంతో జేజీహెచ్131, జేజీహెచ్141 రకాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. వరి, నువ్వుల్లో శాస్త్రవేత్తలు రూపొందించిన మరిన్ని కొత్త రకాలు రైతుల క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల్లో ఉన్నాయి.

**దృష్టి సారిస్తే మేలు**

భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన మేరకు పొలాసలో ఆవాల పరిశోధన కేంద్రం, న్యూక్లియస్ విత్తన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. పరిశోధన స్థానం ఆవరణలో నిర్మించిన ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించాలి. మొత్తం 34 మంది శాస్త్రవేత్తలకు గాను 13 మంది మాత్రమే పని చేస్తుండగా శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. హరితగృహం, ఆధునిక ల్యాబ్‌ల ద్వారా వంగడాల రూపకల్పన సమయాన్ని 12-13 సంవత్సరాల నుంచి ఆరేడు సంవత్సరాలకు కుదించాలి. ఆధునిక యంత్రాల తమయారీ, సంకర రకం విత్తనాల రూపకల్పన, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల క్షేత్రాలకు చేరేలా విస్తరణ కార్యక్రమాలను అమలు చేస్తే పరిశోధన స్థానం సేవలు మరింత విస్తృతమవుతాయి.

# కబ్జా చేసినా కన్నెత్తి చూడరు

గంగాధర : ఉమ్మడి జిల్లాలో పలువురు వరదకాలువ స్థలాలను సైతం ఆక్రమించి సాగు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలువలు కుంచించుకుపోతున్నాయి. కొందరి నిర్వాకంతో చాలామంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని వందలాది గ్రామాల మీదుగా 137 కి.మీ మేర వరదకాలువ విస్తరించి ఉంది. ఇరువైపులా దారులకు వంద మీటర్ల చొప్పున స్థలాన్ని వదిలిపెట్టగా.. దానిపక్కనే గత ప్రభుత్వం ఒక టీఎంసీ నీటిని తరలించేందుకు అదనపు కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. అయితే చాలా గ్రామాల్లో వరదకాలువకు సంబంధించి మట్టి, రాళ్లను అక్రమార్కులు తవ్వుకొని తరలిస్తుండగా.. ఖాళీగా ఏర్పడిన స్థలాలను సమీపంలోని కొందరు తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. అంతకుముందే నష్టపరిహారం పొందినవారు సర్కారు భూములను కబ్జా చేశారు.

**పైపులైన్ల స్థలాన్ని సైతం..**

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, రాజన్న



సిరిసిల్ల జిల్లాల్లో ఆయా గ్రామాల చెరువులు నింపేందుకు 60 కి.మీ పొడవునా 40 మీటర్ల వెడల్పుతో రెండు పైపులైన్లు వేశారు. ఎల్లంపల్లి నుంచి ధర్మారం మండలం నందిమేడారం చెరువులోకి 11 కి.మీ, అక్కడి నుంచి గంగాధర, నారాయణపూర్ జలాశయాల్లోకి 25.50 కి.మీ, ఇక్కడి నుంచి 11 కి.మీ దూరంలో ఉన్న కొడిమ్యాలకు రెండు వరుసల పైపులైన్లు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఆయా గ్రామాల్లో పైపులైన్ల పైభాగంలో మట్టి తవ్వి పంటలు సాగు చేస్తున్నారు. కొందరైతే అక్రమ నిర్మాణాలు చేశారు.

**అదనంగా రైతు భరోసా**

కొన్ని చోట్లయితే రెవెన్యూ రికార్డుల్లో వివరాలు సరిచేయక రైతు భరోసా సాయం కూడా పొందుతున్నారు. కాలువ స్థలాన్ని ఆక్రమించి వరినార్లు పోశారు. కాలువల దారులను దున్ని పంటలు వేస్తుండడంతో అటువైపు అధికారుల వాహనాలే కాకుండా రైతులు తమ ట్రాక్టర్లను తోలుకుపోవడం ఇబ్బందిగా మారింది. దారులు లేక రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రజావాణిలో అధికారులకు కొందరు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

# సిబ్బంది కొంత.. ఇబ్బంది మరింత


భగత్‌నగర్ : ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ చేపట్టిన నూతన సంస్కరణలతో సిబ్బంది పనితీరు మెరుగుపడటంతోపాటు వినియోగదారులకు నిరంతరాయంగా కరెంటు సరఫరా అవుతోంది. ఏటికేడు ఆ సంస్థ సర్వీసులు పెరుగుతున్నా.. సిబ్బంది నియామకాలు మాత్రం చేపట్టడంలేదు. దీంతో ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై భారం పడుతోంది.

**కారణాలు అనేకం..**

కొత్తపల్లి సెక్షన్ కార్యాలయం పరిధిలో కొత్తపల్లి, రేకుర్తి, మల్కాపూర్, లక్ష్మీపూర్, సీతారాంపూర్‌తోపాటు శాతవాహన విశ్వవిద్యాలయం ముందు ప్రాంతం ఉంటుంది. సెక్షన్ పరిధిలో 22,815 సర్వీసులున్నాయి. సిబ్బంది 20 మంది అవసరం ఉండగా 12 మందే ఉన్నారు. వీరిలో ఒకరు అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. కొత్తపల్లిలో మరమగ్గాలు, రెడీమెడ్ క్లాత్ పరిశ్రమలు ఎక్కువ ఉండటంతో సుమారు 580 నాన్ స్లాబ్ సర్వీసులున్నాయి. నాన్ స్లాబ్ సర్వీసులను విద్యుత్తు సిబ్బందే నమోదు చేయాలి. ప్రైవేట్ సిబ్బంది తీయడానికి వీలులేదు.

**బోర్డు నిబంధన ఏం చెబుతుందంటే..**

ఏపీఎస్ఈబీ బోర్డు నిబంధనలను ప్రకారం.. ప్రతి వెయ్యి మందికి ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్లను నియమించాలి. క్షేత్రస్థాయిలో పది వేల సర్వీసులకు ఆ



స్థాయిలో సిబ్బంది లేరు. సేవల సిబ్బంది స్లాబ్, నాన్‌స్లాబ్ రీడింగ్ ప్రతినెలా తీయాలి. ఒకటో తేదీ నుంచి 10 వరకు స్లాబ్ రీడింగ్ (గృహ, వాణిజ్య) తీయాల్సి ఉంటుంది. సెక్షన్‌లో 10 వేల సర్వీసులుంటే అందులో 1/3 అంటే 2,500 సర్వీసుల రీడింగ్ నమోదు చేయాలి. ఈనెల 10 నుంచి 15 వరకు రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న చెట్లకొమ్మలు నరికేయాలి. 15 నుంచి 25 వరకు బకాయి వసూళ్లను రాబట్టాలి. కొత్త మీటర్ల పరిశీలన, బిగింపుతోపాటు ఫ్యూజ్ ఆఫ్‌కాల్, రాత్రి విధులు చేయాలి. ఇలా నిరంతర పనులతో అధికారులు, సిబ్బందిపై పని భారం పడుతోంది. కింది స్థాయి జూనియర్ లైన్‌మెన్ల ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి.

**పనిభారం తగ్గించొచ్చు ఇలా..**

ప్రైవేట్ వ్యక్తులు తీసే మీటర్ రీడింగ్‌లో అవకతవకల నివారణకు సిబ్బందితో మూడో వంతు రీడింగ్ తీయిస్తున్నారు. ప్రస్తుతం అత్యాధునిక మీటర్లు బిగించారు. పరికరాన్ని మీటర్ వద్దకు తీసుకెళ్తే అదే రీడింగ్ సేకరిస్తుంది. ప్రైవేట్ వ్యక్తి తప్పుడు లెక్కలు నమోదు చేసే అవకాశం ఉండదు. రీడింగ్ తీయడం నుంచి సిబ్బందిని మినహాయిస్తే ఇతర పనులు కేటాయించే అవకాశముంది.

# విలీన గ్రామాలను వీడని సమస్యలు

హుజూరాబాద్ : హుజూరాబాద్‌లోని విలీన, శివారు కాలనీల ప్రజలు కనీస మౌలిక వసతులకు నోచుకోవటం లేదు. రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్తు దీపాలు లేక ఏటా వానాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ కాలనీల్లో డ్రైనేజీ నిర్మాణాలు సక్రమంగా లేక రహదారుల వెంట మురుగు నిల్వలు దర్శనమిస్తున్నాయి. రోడ్లు, మురుగు కాలువలు ఉన్నచోటనే నిర్మాణాలు జరుపుతూ... పూర్తిస్థాయిలో లేని ప్రాంతాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దమ్మక్కపేట్, ఇప్పల్ నర్సింగాపూర్, బోర్నపల్లి, కొత్తపల్లి గ్రామాలను 2019లో పురపాలికలో విలీనం చేశారు. కరీంనగర్ రోడ్డులోని బృందావన్‌కాలనీ, ఇప్పల్‌నర్సింగాపూర్, దమ్మక్కపేట, బోర్నపల్లి సమీపంలోని అహల్యనగర్ కాలనీలలో 50 శాతం వరకు రహదారులే లేవు. విద్యుత్తు స్తంభాలు ఉన్నప్పటికీ వెలుగులు కనిపించటం లేదు. ముళ్లపొదలతో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గ్రామాలుగా ఉన్నప్పుడు చేసిన పనులు తప్పితే.. విలీనం అనంతరం ఎలాంటి కనీస సౌకర్యాలు కల్పించటం లేదు.

**రోడ్డుపై భారీ గుంతలు**


ఇప్పల్ నర్సింగాపూర్ నుంచి హుజూరాబాద్‌కు సుమారు 3కి.మీల రోడ్డుపై కిలో మీటరున్నర భారీ గుంతలే ఉన్నాయి. ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో అయితే రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా యారవుతోంది. దారి వెంట విద్యుత్తు దీపాలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.గోవిందుల సతీశ్

**నిధులు రాగానే పనులు చేపడతాం**

విలీన గ్రామాలు, సంబంధిత కాలనీలను సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్‌డీఎఫ్ నిధులు రాగానే కావాల్సిన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడతాం. ప్రస్తుతం వందరోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం, కాలానుగుణ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. తమ దృష్టికి వచ్చిన సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటాం. సమ్మయ్య, పుర కమిషనర్

# ఉప్పల్.. స్టేడియంలోకి వెళ్లేందుకు తిప్పల్

ఉప్పల్: రాజధాని నగరం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం గేట్ల వద్ద విచిత్ర పరిస్థితి నెలకొంది. స్టేడియం గేట్ల బయట గోడను నిర్మిస్తుండటంతో ప్రవేశాలకు అవకాశమే లేకుండా పోతోంది. స్టేడియం గేట్లు



నం.5 నుంచి 10 వరకు రహదారుల వైపు కాకుండా ఓ స్థలానికి పక్కన ఉన్నాయి. గతంలో ఇదే స్థలం టీజీఐఐసీకి సంబంధించింది అంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. దాని కంటే ముందే పెంగ్విన్ టెక్స్‌టైల్స్ స్థలంగా బోర్డులు ఉన్నాయి. ఆ తర్వాత ఓ బ్యాంకు సైతం ఈ స్థలం తమదేనంటూ పేర్కొంది. వివాదాస్పదంగా ఉన్న ఈ ఖాళీ స్థలం వైపు హైదరాబాద్ క్రికెట్ సంఘం స్టేడియానికి సంబంధించిన గేట్లను ఏర్పాటు చేసింది. స్టేడియం ఏర్పాటు చేసిన రెండు దశాబ్దాల తర్వాత గేట్లను మూసివేసే పరిస్థితి ఏర్పడింది. వివాదాస్పద స్థలాన్ని ఓ ప్రైవేటు సంస్థ ఇటీవల దక్కించుకున్నట్టుగా తెలిసింది. ఆ సంస్థే స్థలం చుట్టూ ప్రీకాస్టింగ్ గోడ ఏర్పాటు చేస్తున్నారు. స్టేడియం గేట్ల బయట గోడ ఏర్పాటును క్రీడాభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# భద్రత..'దారి'కి తెచ్చేలా



హైదరాబాద్ : గ్రేటర్ రహదారి వ్యవస్థలో అనేక లోపాలున్నాయి. ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా బల్దియా రంగంలోకి దిగింది. కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో ఇంజినీరింగ్ విభాగం క్షేత్రస్థాయి సర్వేకు నడుం బిగించింది. రహదారులపై గుంతలు, లేన్ మార్కింగ్‌లలోని లోపాలు, దెబ్బతిన్న పైవంతెనలు, ప్రమాదకర కల్వర్టులను గుర్తిస్తోంది. గుంతలను పూడ్చే చర్యలు మొదలయ్యాయి. పూర్తవగానే లేన్ మార్కింగ్, సైన్ బోర్డులు లేకపోవడం, కూడళ్ల సుందరీకరణ, పైవంతెనలు, కల్వర్టుల సర్వే మొదలవనుంది.

**ప్రధాన సమస్యలివీ..**

ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు తప్ప సైన్ బోర్డులు లేవు. లేన్ మార్కింగ్‌లు లేవు. స్టాప్ లైన్లు, ఫ్రీలెఫ్ట్‌లపై దృష్టి పెట్టలేదు. బీఆర్‌కే భవన్ వద్ద 90 డిగ్రీల రోడ్డుతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతోన్న అశాస్త్రీయ యూటర్న్‌లను కూడా గుర్తిస్తామని ఇంజినీర్లు అంటున్నారు.

**పగులుతున్న పైవంతెనలు..**

నిర్వహణ లోపాలతో ఖైరతాబాద్, తెలుగు తల్లి పైవంతెనలు అధ్వానంగా మారుతున్నాయి. ఇటీవల ఖైరతాబాద్ పైవంతెనపై ముగ్గురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. స్లాబుల మధ్య పగుళ్లు, హెచ్చుతగ్గులతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలు, ఆస్పత్రుల వద్ద ప్రత్యేక లేన్ మార్కింగ్, బారికేడ్ల వ్యవస్థ ఉండాలి. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని ఇంజినీర్లు కొన్నేళ్లుగా చెబుతున్నారు. కమిషనర్ల వరుస బదిలీలు, ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల అశ్రద్ధ కారణంగా కార్యరూపం దాల్చట్లేదు. గ్రేటర్ పరిధిలో 980 కల్వర్టులున్నాయి. అవన్నీ దాదాపు వరద నాలాలపై నిర్మితమైనవే. నాలాల పొడవునా రహదారులను సర్వే చేసి ఎవరూ నాలాల్లో పడకుండా అడ్డుగోడ లేదా జాలీలు నిర్మించాలని ఇంజినీర్లను కమిషనర్ ఆదేశించారు. బాక్స్ డ్రెయిన్‌లు, వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) పనులు జరుగుతోన్న ప్రాంతాల్లో రహదారి పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు.

# క్రమబద్ధీకరణలో తిర'కాసు'!



హైదరాబాద్: నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి గతంలో అబ్దుల్‌పూర్‌మెట్‌లోని పంచాయతీ లేఅవుట్‌లో 400 గజాల స్థలం కొనుగోలు చేశారు. ఇటీవల ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. హెచ్ఎండీఏ రుసుం చెల్లించాలని తాఖీదు పంపింది. దీంతో ఆయన రూ.90 వేలు చెల్లించారు. అనంతరం అధికారులు ఎల్1 తనిఖీల్లో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి లేఅవుట్ నుంచి మాస్టర్‌ప్లాన్ ప్రకారం 100 అడుగుల రోడ్లు వెళుతున్నట్లు తేల్చారు. ఎల్ఆర్ఎస్ సాధ్యం కాదని దరఖాస్తు తిరస్కరించారు. చెల్లించిన ఫీజులో 10 శాతం ప్రాసెసింగ్ ఛార్జీలు పోను, మిగతా మొత్తం రీఫండ్ చేస్తామని తెలిపారు. రెండు నెలలు గడుస్తున్నా హెచ్ఎండీఏ నుంచి స్పందన లేదు. అధికారులను అడిగినా సరైన సమాధానం ఇవ్వడం లేదు. ఇలా వందల మంది రీఫండ్ కోసం ఎదురు చూస్తున్నారు..

**అనర్హమైనవిగా గుర్తించి...**

అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు హెచ్ఎండీఏకు 2.71 లక్షల దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే రుసుం చెల్లించాలంటూ హెచ్ఎండీఏ తాఖీదులు జారీ చేయడంతో దాదాపు 74 వేల మంది చెల్లించారు. తర్వాత దరఖాస్తులు తిరస్కరిస్తున్నారు. నాలాలు, చెరువుల ఎఫ్‌టీఎల్, వివాదాస్పద భూముల్లో వేసిన లేఅవుట్లు, మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డు కోసం కేటాయించిన స్థలాల్లో లేఅవుట్లకు సంబంధించిన దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తిస్తున్నారు. అయితే, తాము చెల్లించిన రుసుములో 10 శాతం కోత వేయడమే కాకుండా, సకాలంలో ఇవ్వడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

**ఇదీ పరిస్థితి...**

ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులు: 2,71,352
రుసుం చెల్లించాలని తాఖీదులు: 2,07,501
ఫీజు చెల్లించిన వారు – 74,928
చెల్లించని దరఖాస్తుదారులు: 1,32,973
ఆదాయం: రూ.230.38 కోట్లు

# ఊరిస్తున్న ఉపాధి అవకాశాలు



హైదరాబాద్ : ఇంజినీరింగ్, మెడిసిన్‌కు ప్రత్యామ్నాయంగా ఫార్మా, బయోటెక్నాలజీ రంగాలను ఎంచుకుంటున్న సైన్స్ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. రాష్ట్రంలో ఫార్మా కంపెనీలతో పాటు ఫార్మా విలేజ్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీలో 16 ఫార్మా కంపెనీలు కొత్తగా వస్తుండటం, ప్రాంతీయ రింగ్ రోడ్‌కు సమీపంలో అంతర్జాతీయ ఫార్మా సంస్థలు పెట్టుబడులు పెడుతుండటంతో బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీ–ఫార్మా, ఎం–ఫార్మా విద్యార్థులకు వేల సంఖ్యలో ఉద్యోగాలు రానున్నాయి. ఆసక్తి కలిగినవారు పరిశోధనలను ఎంచుకుంటే.. శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వాల సహకారంతో అంకుర సంస్థలను ప్రారంభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మందులు, టీకాల తయారీ, ఆసుపత్రుల్లో రోగ నిర్ధారణ పరీక్షల పర్యవేక్షకుల ఉద్యోగాలు రానున్నాయని వివరిస్తున్నారు.

**ఫార్మా అభివృద్ధి ఇలా...**

రాష్ట్రంలో 2050 వరకు రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఫార్మా గ్రామాలు ఏర్పాటు కానున్నాయి. తొలిదశలో వికారాబాద్, నల్గొండ, మెదక్, రెండో దశలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, సిద్దిపేట్, యాదాద్రి – భువనగిరి జిల్లాల్లో ప్రారంభమవనున్నాయి. తద్వారా సుమారు 5 లక్షల మందికి ఉపాధి లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 600లకు పైగా ఫార్మా కంపెనీలు, దాదాపు 200 బయోటెక్నాలజీ సంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వీటి వార్షిక టర్నోవర్ 50 బిలియన్ డాలర్లు. ఇంతేకాదు... దేశంలోని ఫార్మా, బయోటెక్ ఉత్పత్తుల్లో 35 శాతం తెలంగాణలోనే ఉత్పత్తి కావటం విశేషం.

**హైదరాబాద్ కేంద్రంగా..**

నగరంలో 17 ప్రపంచ ప్రసిద్ధ పరిశోధన కేంద్రాలున్నాయి. జాతీయ స్థాయిలో పేరొందిన 20 పరిశోధన సంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఏటా లక్ష మంది విద్యార్థులు బీఎస్సీ, ఎమ్మెస్సీలో చేరుతున్నారు. ఇందులో ఐదు శాతం మంది ఐఐసీటీ, నైపర్, రెడ్డీస్ ల్యాబ్స్, గ్రాన్యూల్స్ వంటి సంస్థల్లో జూనియర్ శాస్త్రవేత్తలుగా ఉద్యోగాలు పొందుతున్నారు.

రాష్ట్రంలోని బయోటెక్నాలజీ సంస్థలు, బయో ఇంజినీరింగ్ ఆధారిత అంకుర సంస్థల్లో పరిశోధకులుగా చేరుతున్నారు. కొందరు సొంతంగా అంకుర సంస్థలు నెలకొల్పుతున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఆస్పైర్ బయోనెస్ట్ కేంద్రం అంకుర సంస్థల స్థాపనను ప్రోత్సహిస్తోంది. **నిపుణులకు భారీ డిమాండ్..**

రాష్ట్రంలో ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో నిపుణులకు భారీగా డిమాండ్ ఏర్పడుతోంది. బయో టెక్నాలజీతో పోలిస్తే బీ–ఫార్మసీ, ఎం–ఫార్మసీ, బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. వీరిలో పరిశోధనలపై ఆసక్తి చూపే వారికి మంచి వేతనాలు లభిస్తున్నాయి. సైన్స్ విద్యార్థులకు ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నాం. కొత్త ఉద్యోగులు, ట్రైనీలకు నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రొ.పల్లు రెడ్డన్న, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, ఆసియా బయోటెక్ సంఘాల సమాఖ్య

# పట్టణ హరితం.. పట్టని ఫలితం

కోరుట్ల : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో లక్ష్యాలు ఘనంగా ఉంటున్నా అమలు అంతంతమాత్రంగానే ఉంటోంది. పట్టణాల్లో పచ్చదనం పెంపునకు రూ.లక్షలు వెచ్చించి నర్సరీలు ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. ప్రధాన రహదారులు, కాలనీ రోడ్లు, ప్రభుత్వ స్థలాల్లో, పాఠశాలలు, కార్యాలయాల్లో స్థలాలు గుర్తిస్తున్నారు. లక్ష్యం పూర్తి చేసినట్లు లెక్కల్లో చూపుతున్నా క్షేత్ర స్థాయిలో మొక్కలు కనిపించడం లేదు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని అయిదు పురపాలికల పరిధిలో 7.73 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈసారైనా జాగ్రత్తలు తీసుకుంటేనే పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరియనుంది.

**నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ**

బల్దియా అధికారులు అయిదేళ్లుగా పట్టణ ప్రగతి నర్సరీలు ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. ప్రభుత్వ, ఖాళీ స్థలాలు, ఇళ్లలో నాటేందుకు పూలు, పండ్ల మొక్కల అవసరంపై ముందస్తుగా అంచనాలు వేసి నర్సరీల్లో నాటుతున్నారు. ఇందుకోసం పట్టణ ప్రగతి నిధులతో శాశ్వత పట్టణ నర్సరీలు ఏర్పాటు చేశారు. ఏటా



నవంబరులోనే మొక్కలు నాటి నీడ వసతి కల్పించారు. మొక్కల పెంపకానికి నాణ్యమైన మట్టిని, విత్తనాలు తెప్పించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. మొక్కలు త్వరగా పెరిగేందుకు సేంద్రియ ఎరువుల వాడకంతో పాటు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూలు, పండ్లు, నీడనిచ్చేవి 15–20 రకాల మొక్కలు పెంచుతూ ఒక్కోటి మీటరు పొడవు ఎదిగేలా సంరక్షిస్తున్నారు.

**సామాజిక స్పృహ కరవు** పట్టణాల్లో దాదాపు అంతర్గత రహదారులన్నింటిపైనా సిమెంటు, తారు నిర్మాణాలే ఉన్నాయి. సీసీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాల్సి ఉండగా నామమాత్రంగా నాటి సంరక్షణ మరిచిపోవడంతో కొన్ని వారాలకే కనిపించకుండా పోతున్నాయి. సీసీ రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు పురపాలికల ఆధ్వర్యంలో కొంతమేర మట్టి దారిని వదిలిపెడుతుండగా ఇళ్ల యజమానులు సిమెంటుతో పూర్తిగా చదును చేసుకుంటున్నారు. ఇళ్ల ముందు మొక్కలు నాటితే ఆకులు రాలతాయని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతింటున్నాయని స్థానికులు తొలగిస్తున్నారు. రోడ్ల పక్కన విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటి ఏపుగా పెరిగిన తర్వాత కొట్టివేస్తున్నారు. గృహావరణల్లో నాటడానికి ఇంటింటికీ 3–4 మొక్కలు పంపిణీ చేస్తున్నా సంరక్షణపై ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. సంరక్షణ కరవైంది.

# నిధులు ఇచ్చినా ప్రగతి అంతంతే!

సిరిసిల్ల : "ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో 2021–22లో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు రూ.కోటి మంజూరు చేశారు. దీనిలో కొంతమేరకు ఉపాధి హామీలో చేశారు. రన్నింగ్ ట్రాక్, గ్యాలరీ తదితర పనులు అసంపూర్తి దశలో ఉన్నాయి."

"చొప్పదండి, సిరిసిల్ల నియోజకవర్గాలకు 2023–24లో ఎంపీ లాడ్స్ కింద రూ.1.94 కోట్లతో 49 పనులు మంజూరయ్యాయి. వీటిలో మూడు మాత్రమే పూర్తయ్యాయి. ఆరు వివిధ దశలో ఉన్నాయి. 40 పనులు ప్రారంభం కాలేదు. పూర్తయినవాటికి గుత్తేదారులకు రూ.27.24 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి."

జిల్లాలో పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీ ల్యాడ్స్) పనుల ప్రగతి అంతంత మాత్రంగా ఉంది. ఏటా నిధుల కేటాయింపు జరుగుతున్నా.. గుత్తేదారులు వాటిని పూర్తి చేయడంలోనే జాప్యం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల మరిమడ్ల ఏకలవ్య రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఆర్టికల్ 275లో భాగంగా 'మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్' (మోటా) నుంచి రూ.5.14 కోట్లతో చేపట్టే అధ్యాపకుల వసతిగృహాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. వసతి గృహ సమస్యలను అధ్యాపకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటికి తన ఎంపీ నిధుల నుంచి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో వాటిని సద్వినియోగం చేసుకోవడంలో



వెనుకబాటు తప్పడం లేదు.

**అభివృద్ధిపై ఆశలు**

ఎంపీ ప్రతి ఆర్థిక సంవత్సరానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు కేటాయిస్తారు. వీటిలో జిల్లాకు జరిగే కేటాయింపుల్లో నిరాశే ఎదురవుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లాకు మంజూరైన నిధుల్లో ఇంకా స్పష్టత రాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో భాజపా కార్యకర్తలు ఎంపీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపైనే ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రతిపక్షంలో ఉండటంతో ఈ సమస్య ఉంది. భాజపాకు బలమైన క్యాడర్ ఉండటంతో అభివృద్ధి మార్కును చూపించుకోవాలని ఎంపీ నిధులకు డిమాండ్ ఏర్పడుతోంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అంతర్గత రహదారుల నిర్మాణాలకు ఈ నిధులను ఎక్కువగా వెచ్చించే అవకాశం ఉంది. పనులు పూర్తయి బిల్లులు సమర్పించిన వాటికి వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

**అదనపు నిధుల కేటాయింపు**

మంజూరైన పనులు కలెక్టర్ పర్యవేక్షణలో త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తున్నాం. ఎంపీ ల్యాడ్స్‌తోపాటు, సీఎస్ఆర్, ఉపాధి హామీలో అదనపు నిధులు కేటాయించేలా ప్రణాళికలు చేస్తున్నాం. జిల్లాలోని ప్రతి గ్రామానికి ఏటా రూ.5 లక్షలతో అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. బండి సంజయ్, ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి

చురకలు



## కేజీబీవీలో కొత్త మెనూ

సారంగాపూర్: నిరుపేద బాలికలకు అందుబాటులో నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం కొత్త మెనూను అమల్లోకి తెచ్చింది. కస్తూర్బాల్లో చదివే బాలికలు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనతతో బాధపడుతుంటారు. గురుకులాల్లో అమలయ్యే ఆహార మెనూ కేజీబీవీలలో లేకపోవడంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకేరకమైన మెనూ అందించేందుకు నిర్ణయించి అమలు చేస్తోంది. విద్యాలయాలు ప్రారంభం నుంచే మెనూ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలోని 14 మండలాల్లో ఆరు నుంచి పదోతరగతి వరకు కొనసాగుతుండగా, ఒక్కో విద్యాలయంలో పదోతరగతి వరకే 200 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. నూతనంగా బీర్పూర్, బుగ్గారం మండలాల్లో కేజీబీవీలు ఏర్పాటు చేశారు. అక్కడ ప్రస్తుతం ఆరు నుంచి ఎనిమిది వరకు మాత్రమే విద్యనందిస్తున్నారు. రెండేళ్ల కిందట జిల్లాలోని సారంగాపూర్, రాయికల్, పెగడపల్లి, జగిత్యాల, కోరుట్ల ఇబ్రహీంపట్నం, వెల్గటూర్ మండలాల్లో, ఈ ఏడాది మేడిపల్లి, మల్యాల, మల్లాపూర్, ధర్మపురి, కథలాపూర్ మండలాల్లో ఇంటర్ వరకు పెంచారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలలో 3700 మంది బాలికలు చేరడంతో వసతులు కల్పించడం కష్టంగా మారుతోంది. ప్రస్తుత వసతులతోపాటు కొత్త మెనూ అమలు చేయాలని ఆదేశించారు.



ప్రస్తుతం పదోతరగతి వరకు కొనసాగుతున్న విద్యాలయాల్లోనే ఇంటర్ వరకు ఉన్నతీకరించడంతో బాలికల సంఖ్య పెరిగి మౌలిక వసతులు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. తరగతి గదులు, భోజనం, పడుకోవడం ఇబ్బందిగా మారుతోంది. కొత్తగా బీర్పూర్, బుగ్గారం మండలాల్లో కస్తూర్బా విద్యాలయాలను ఏర్పాటు చేయగా, బీర్పూర్ మండలంలోని తుంగూర్‌లో ఓ అద్దె భవనంలో కొనసాగిస్తుండగా, బుగ్గారం కేజీబీవీని ధర్మపురి విద్యాలయంలోనే ఉంచారు.

ఉదయం: టమాట కిచిడి, రాగి జావ, సాంబారు, బూస్టు, ఉప్మా, పూరి, పులిహోర, బోండా, వడ, చపాతి, జీరా రైస్, అరటి పండు

మధ్యాహ్నం: టమాట పప్పుతో అన్నం, నెయ్యి రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్

సాయంత్రం: ఉడకబెట్టిన శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లం-పల్లీలు, అల్లం ఛాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడీ

రాత్రి: వివిధ రకాల కూరలతో అన్నం, సాంబారు, మజ్జిగ అందించాల్సి ఉంటుంది. నెలలో రెండు సార్లు మాంసాహారం, అయిదు సార్లు గుడ్డు, ప్రతి రోజు నెయ్యి

**వసతుల కల్పనకు చర్యలు- అనుపమ, జిల్లా కోఆర్డినేటర్, కేజీబీవీ**

ప్రభుత్వం నూతన మెనూ అమలు చేయాలని ఆదేశించడంతో విద్యాలయాల ప్రారంభం నుంచే అమలు చేస్తున్నాం. విద్యాలయాల మరమ్మతు, పెయింటింగ్ ప్రారంభించాం. పెగడపల్లి, సారంగాపూర్ మండలాల్లోని కేజీబీవీలకు అదనంగా భవనాలు అవసరముందని ప్రతిపాదనలు పంపడంతో ఈ ఏడాది నిధులు మంజూరు కానున్నాయి. పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

## అంగన్‌వాడీలు.. ఇక మరింత మెరుగు

ధర్మపురి: అంగన్‌వాడీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రణాళికలు రూపొందించడంతోపాటు తాజాగా టీచర్లు, ఆయాల ఉద్యోగ విరమణ వయస్సు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో జిల్లాలోని 1638 మంది సిబ్బందికి ప్రయోజనం కలగనుంది.

**ప్రోత్సాహకాలు రెండింతలు**

ఈ నిర్ణయంతో ఉద్యోగ విరమణ సమయంలో వారికి అందించే ప్రోత్సాహకాలు సైతం రెట్టింపు చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయురాలికి రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష అందించనున్నారు. ప్రస్తుతం టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేల చొప్పున అందిస్తున్నారు.

**పోస్టుల భర్తీకి సన్నాహాలు** జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయా పోస్టుల భర్తీకి సన్నాహాలు మొదలుపెట్టింది. ఇదివరకే ఉద్యోగ విరమణ చేసినవారికి ప్రోత్సాహకాలు అందించగా.. ఇక ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్ణయించినట్లు



ప్రాథమికంగా తెలుస్తోంది. నూతన విధానంతో బోధనలు, నిత్యం కేంద్రాల నిర్వహణను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తూ ఐసీడీఎస్‌లో సంస్కరణలు చేపడుతున్నారు. పోస్టుల భర్తీతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడనుంది.

**బలోపేతానికి కృషి చేస్తాం**

– నరేష్, జిల్లా సంక్షేమశాఖాధికారి, జగిత్యాల

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం కృషి చేస్తాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తాం. ఉద్యోగ విరమణ ప్రోత్సాహకాలు రెట్టింపు చేయడంతో వారికి మరింత ప్రయోజనం చేకూరనుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ మహిళా, శిశు సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో కేంద్రాల వివరాలు

ప్రాజెక్టుల సంఖ్య: 4

అంగన్‌వాడీ కేంద్రాలు: 1065

విధులు నిర్వహించే టీచర్లు: 988

టీచర్ల పోస్టుల ఖాళీలు: 63

ఆయాలు: 650

ఖాళీగా ఉన్న ఆయా పోస్టులు: 318

# నకిలీ.. నమ్మితే ఖాతా ఖాళీ!




హైదరాబాద్ : "ఆధార్ దుర్వినియోగమంటూ భయపెట్టి విశ్రాంత శాస్త్రవేత్త నుంచి రూ. 1.34 కోట్లు కాజేశారు. విదేశాలకు మానవ అక్రమ రవాణా కేసులో డిజిటల్ అరెస్ట్ పేరిట ఇల్లు కదలకుండా చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి విచారణ చేస్తున్నట్లు వాట్సప్ కాల్‌తో చుక్కలు చూపారు. మూడు రోజుల పాటు వృద్ధ దంపతులు తీవ్ర మనోవేదన అనుభవించేలా చేశారు."

" మిత్రుడు కస్టమ్స్ అధికారులకు చిక్కాడని కానిస్టేబుల్‌కు ఫోన్ చేశారు. మిత్రుడి వాయిస్‌తో మాట్లాడించారు. లండన్ నుంచి హైదరాబాద్ వస్తుండగా దిల్లీ ఎయిర్ పోర్టులో ఆదాయపన్ను శాఖ అధికారులకు క్లియరెన్స్, ట్యాక్స్ చెల్లించాలంటూ రూ. 2.05 లక్షలు తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు."

ఉన్నత విద్యావంతులు సైబర్ మోసాల బారిన పడి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రాజస్థాన్‌లోని భరత్‌పూర్, డీగ్, నూహ్, మెహత్ జిల్లాల్లో పలు గ్రామాలు సైబర్ మాయగాళ్లకు అడ్డాగా మారాయి. పాఠశాల స్థాయిలోనే చదువు ఆపేసిన, పదో తరగతి తప్పిన వారంతా మోసాలను ఉపాధిగా ఎంచుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ యాప్‌లు వినియోగం, ఇంటర్నెట్ కాల్స్, కృత్రిమ మేధ సహాయంతో మార్ఫింగ్ వీడియోలు, వాయిస్ కాల్స్‌తో ఏ విధంగా మోసం చేయాలనే అంశాల పై తర్ఫీదు పొంది.. నేరాలకు పాల్పడుతున్నారు. వివిధ వెబ్‌సైట్లల నుంచి, ఏజెంట్ల సాయంతో వివిధ వర్గాలకు చెందిన వారి డేటా కొనుగోలు చేస్తున్నారు. తమ వద్ద ఉన్న జాబితా ఆధారంగా రోజుకు 20 నుంచి 30 మందికి వాట్సప్ వీడియో కాల్స్ చేస్తారు. అటు నుంచి వచ్చిన స్పందనకు తగినట్టుగా ఆయా శాఖలు, అధికారుల పేర్లు ప్రయోగించి భయ పెడతారు. తమ ఖాతాల్లో జమ చేసిన నగదు లావాదేవీలను పరిశీలించి తిరిగి ఇస్తామంటూ చెబుతుండటంతో వారి వలలో చిక్కి మోసపోతున్నారు. ఇలా రూ.కోట్లు నష్టపోయిన వారిలో న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, వైద్యనిపుణులు, ఉన్నత విద్యావంతులు, పోలీసులు ఉన్నారు.

**స్పందించకపోవడమే పరిష్కార మార్గం**

ప్రసాదరావు, ఇన్‌స్పెక్టర్, నగర సైబర్‌క్రైమ్

గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు. అట్నుంచి రికార్డ్ చేసిన వీడియో కాల్‌ను మార్ఫింగ్ చేసి బెదిరించి డబ్బులు గుంజుతారని గ్రహించాలి. ప్లస్(౦)తో మొదలయ్యే కాల్ వస్తే పట్టించుకోవద్దు. అనుమానాస్పదంగా అనిపించినా, మోసపోయి నట్టు గ్రహించినా 1930కు ఫిర్యాదు చేయండి.

# నిలిచిన ప్రోత్సాహకాలు.. తగ్గుతున్న ప్రసవాలు



వికారాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవమైన గర్భిణులకు అందించే ప్రోత్సాహకాలు నిలిచిపోయాయి. గతేడాదితో పోల్చితే సర్కారు దవాఖానాల్లో కొంతమేర ప్రసవాలు తగ్గాయి. గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే.. ఏదో ఒక కారణంతో వారిని ఆందోళనకు గురిచేసి.. శస్త్ర చికిత్సలతో కాన్పులు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరముంది.

**గతంలో ప్రత్యేక దృష్టి**

మూడేళ్ల కిందటి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేసింది. ముఖ్యంగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలోనూ సాధారణ ప్రసవాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టింది. దీంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటులో ప్రసవాలపై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఏయే దవాఖానాల్లో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయో గుర్తించింది. నిఘాపెట్టి కోతల కాన్పులకు చెక్ పెట్టింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం సాధారణ ప్రసవాల్లో గతంలో రాష్ట్రంలో తృతీయ స్థానం సాధించింది.

**ప్రధాన కారణాలివి..**సర్కారు దవాఖానాల్లో ప్రసవమైన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం.ప్రజలకు అందుబాటులో ఉండే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గడం. క్షేత్రస్థాయిలో యంత్రాంగం పర్యవేక్షణ లోపం.ప్రాంతీయ, బోధనాసుపత్రులతో పాటు మాతా శిశుసంరక్షణ కేంద్రాల్లోనే ప్రసవాలు జరుగుతున్నాయి. దీంతో వీటిలో విధులు నిర్వహించే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది.వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గతంలో మాదిరిగానే ఉన్నాయని వివరిస్తున్నారు. **క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డి జిల్లాలో గతేడాది ప్రభుత్వ ఆసుపత్రుల్లో 20,729, ప్రైవేటులో 5743 ప్రసవాలు జరిగాయి. మెదక్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 8697 ప్రసవాలు జరగగా.. ప్రైవేటులో 2535 ప్రసవాలయ్యాయి. ఈ ఏడాది సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల్లో పెద్దగా మార్పులేనప్పటికీ.. సిద్దిపేట, మెదక్‌లో కొంతమేర తగ్గాయి. సిద్దిపేట జిల్లాలో ప్రైవేటు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వైద్యారోగ్యశాఖ గణాంకాల ప్రకారం గడిచిన నాలుగేళ్లలో సర్కారు దవాఖానాల్లో 70 శాతం కాన్పులు కాగా.. ప్రైవేటులో 30 శాతం మాత్రమే జరిగాయి. ఈ ఏడాది ప్రభుత్వ దవాఖానాల్లో 55 శాతం ప్రసవాలైతే.. ప్రైవేటులో 45 శాతానికి పెరిగాయని వైద్యారోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

# ఎరువు కరవు రావొద్దు!




కరీంనగర్ : జగిత్యాల జిల్లా మేడిపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అందుబాటులో ఉన్న ఎరువులు ఇవి. సీజన్ ప్రారంభ దశలో ఉండటంతో రైతులు ఎరువుల కోసం వెంపర్లాడటం లేదు. ముమ్మందు డిమాండ్ అధికంగా ఉండనుంది. గతంలో ఎదురైన అనుభవాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఈ సారి వ్యవసాయ, సహకార శాఖలను అప్రమత్తం చేశారు. వచ్చే నెల 15వ తేదీ వరకు 7 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని గుర్తించి ఆ మేరకు సిద్ధంగా ఉంచారు. ఈ నెలలో మరింత తెప్పించి సమృద్ధిగా బస్తాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కోసం రైతులు రోడ్లపై నిలబడొద్దు. ఆయా జిల్లాల వారీగా అవసరమైనన్ని నిల్వలు ముందుగానే తెప్పించండి. నల్ల బజారుకు తరలడం, కృత్రిమ కొరత సృష్టించడం లాంటి చర్యలను ఉపేక్షించొద్దు. గత నెలలో కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షలో కలెక్టర్లకు అప్పటి ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశంగతేడాది పలుచోట్ల ఎరువుల బస్తాల కోసం అన్నదాతలు అగచాట్లు పడ్డారు. జులై మాసంలో ఒక్కసారిగా రైతులంతా దుకాణాల వద్దకు ఎగబడ్డారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో కొన్నిచోట్ల అగచాట్లు తప్పలేదు. కొరత ఏర్పడుతుందనే ఉద్దేశంతో తీసుకున్నవారే అధికంగా తీసుకుని నిల్వలు పెట్టుకోవడం కూడా పంపిణీ విషయంలో ప్రతిబంధకంగా మారింది. ఈ సీజన్‌లోనూ పాతకథ పునరావృతం కావొద్దంటే..యంత్రాంగం మరింత పకడ్బందీగా క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఇప్పటి నుంచే అంచనా వేయాలి. సజావుగా సరఫరా అయ్యే విధంగా కార్యాచరణ రూపొందించాలి.

**వచ్చే నెల నుంచే!**జులై నుంచి ఎరువుల అవసరాలు మొదలవుతాయి. ముఖ్యంగా యూరియా కోసం అన్నిచోట్లా డిమాండ్ ఉండనుంది. డీఏపీ ఇతర కాంప్లెక్స్ ఎరువుల వాడకం తక్కువగానే ఉంటుంది. ఓ వైపు కేంద్ర ప్రభుత్వం ఈ సారి తక్కువ మొత్తంలో వీటిని వినియోగించాలని విస్తృత ప్రచారం చేస్తోంది. సరఫరా కూడా తక్కువగా ఉంటుందనే సంకేతాల్నిస్తోంది. అయినా ఉమ్మడి జిల్లాలో మాత్రం మోతాదును మించి వినియోగం అలవాటుగా మారింది. పంట దిగుబడికి పోషకాలన్నీ వీటితోనే అందుతాయనే భావనలో అన్నదాతలు వీటివైపే మొగ్గుచూపుతున్నారు. అందుకనే వీటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.**కృత్రిమ కొరత..**జిల్లాల్లో ఎరువుల విషయంలో గతంలో కొందరు కృత్రిమ కొరతను సృష్టించారు. ఈ-పాస్ విధానంలో ఆన్‌లైన్‌లోనే ప్రతి రైతు ఆధార్‌కార్డు ద్వారా విక్రయాలు చేపట్టాలని నిర్ణయించినా చాలామంది డీలర్లు ఇందుకు ఆసక్తిని చూపించలేదు. దీంతో అసలు వీటి విక్రయాల్లో గందరగోళమనే పరిస్థితి ప్రతి సీజన్‌లో నెలకొంటు ంది. పారదర్శకమైన విధానం లేకపోవడంతో బడా భూస్వాములు ముందుగానే పెద్దఎత్తున వీటిని కొంటూ నిల్వ ఉంచుకుంటున్నారు. దీంతో సన్న చిన్నకారు రైతులు తన పంటకవసరమైన ఎరువుల కోసం తంటాలు పడాల్సి వస్తోంది. మరోవైపు వ్యాపారులు కూడా నిర్ణీత ధరకన్నా అధికంగా అమ్ముకునేందుకు వీలుగా కృత్రిమ కొరత సృష్టిస్తూ అందినకాడికి దండుకునే యత్నాలు చేస్తారు.

# కాలువలు శిథిలం.. చివరికి గగనం

జగిత్యాల : జగిత్యాల మండలం నర్సింగాపూర్ వద్ద దెబ్బతిన్న కాకతీయ కాలువ లైనింగ్. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీటిని పలు జిల్లాలకు తరలించే ప్రధాన కాకతీయ కాలువకు చాలాచోట్ల లైనింగ్ చెడిపోయింది. కాకతీయ కాలువ లైనింగ్, కట్టలు దెబ్బతిని జగిత్యాల, మల్యాల, గొల్లపల్లి, పెగడపల్లి తదితర మండలాల్లో గండ్లుపడి తీవ్రనష్టం వాటిల్లింది. 9 వేల క్యూసెక్కుల నీటితరలింపు సామర్థ్యం కలిగిన ఈ కాలువలో ప్రస్తుతం 6,500 క్యూసెక్కుల నీటినే విడుదల చేస్తుండటం కాలువ మరమ్మతు ఆవశ్యకతను కళ్లకు కడుతోంది.సారంగాపూర్ మండలం అర్పపల్లి వద్ద కోతకు గురైన డి-53 కాలువ. ప్రధాన డిస్ట్రిబ్యూటరీ కాలువ అర్పపల్లి డ్రాపువద్ద కోతకుగురై గండిపడి ఊరిలోకి నీరువచ్చే ప్రమాదం నెలకొంది. చాలా డిస్ట్రిబ్యూటరీలు, ఉపకాలువలకు లైనింగ్ చెడిపోవటంతో ఇలాంటి పరిస్థితే తలెత్తి నీటిని తరలించకపోగా ప్రమాదకరంగా మారాయి.

జగిత్యాల జిల్లా మీదుగా పారే కాకతీయ ప్రధాన కాలువతో పాటు, డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితరాలతో కాలువల్లో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. అన్ని కాలువల ప్రాంత యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు దెబ్బతినటంతో గరిష్ఠస్థాయిలో నీటిని తరలించలేని పరిస్థితి తలెత్తింది. కాలువల్లో నిండుగా నీటిని వదలకపోగా పారే కొద్దిపాటి నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోయటంతో 35 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది.

బీర్‌పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, బుగ్గారం, సారంగాపూర్,



కోరుట్ల, మల్యాల, గొల్లపల్లి, ఎండపల్లి, పెగడపల్లి తదితర మండలాల్లో చివరి ఆయకట్టు గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరందటంలేదు. ఏప్రిల్ వరకు ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయటం, మరమ్మతులకు ఆశించినట్లుగా నిధులు విడుదల చేయకపోవటం, టెండర్ల దశనుదాటి పనులను ఆలస్యంగా ప్రారంభించటంతో చాలా పనులు పూర్తికాలేదు. భారీ వర్షాలు వచ్చేలోపు కాలువల్లో ఉపాధిహామీ కూలీల ద్వారా పూడికతీత, చెట్ల తొలగింపు చేపట్టాలి. కాకతీయ, ఇతర కాలువల లైనింగ్‌కు నిధులు కేటాయించాలి. కాకతీయ కాలువ, వరదకాలువ నుంచి చెరువుల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జలమట్టం పెరిగి పంపుసెట్లద్వారానూ నీటిని పారించవచ్చు. దెబ్బతిన్న నిర్మాణాలకు మరమ్మతుల ద్వారా చివరిభూముల వరకు నీటిని తరలించేలా చర్యలు చేపట్టాలి.

జిల్లాలో మొత్తం ఆయకట్టు : 1.65 లక్షల ఎకరాలు

ప్రస్తుతం సాగునీరందుతున్నది: 1.30 లక్షల ఎకరాలు

చివరికి నీరందని ఆయకట్టు: 35 వేల ఎకరాలు

డిస్ట్రిబ్యూటరీ కాలువల పొడవు: 136 కి.మీలు

పంట కాలువల పొడవు: 401 కి.మీలు

మరమ్మతు పూర్తయినవి: 75 శాతం

ఇంకా అవసరమున్న పనులు: 32 పనులు

శ్రీరామసాగర్ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం: 112 టీఎంసీలు

పూడిక పేరుకొని ప్రస్తుతం నిల్వచేస్తున్న నీరు: 80.501 టీఎంసీలు

మొత్తం మరమ్మతులకు అవసరమున్న నిధులు: రూ.190.09 కోట్లు

ఇటీవల మరమ్మతులకు వెచ్చింపు: రూ.105 కోట్లు

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

నర్సాపూర్: నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ దామెరచెరువులో కొన్ని రోజులుగా అనుమతి లేకుండా శివ్వంపేట మండలం కొత్తపేట, రూప్ల తండాలకు చెందిన పలు ఇటుక బట్టీల నిర్వాహకులు నల్లమట్టిని తరలిస్తున్నారు. విషయం తెలిసి నీటిపారుదలశాఖ సిబ్బంది నలుగురు అక్కడికి వెళ్లి అడ్డుకోగా అక్రమార్కులు వారిపై దాడి చేశారు. గుర్తింపు కార్డులు గుంజుకున్నారు. చరవాణుల్లో డేటా తొలగించారు. మట్టి తరలింపునకు అడ్డొస్తే.. ట్రాక్టరుతో తొక్కేస్తామంటూ బెదిరించారు. భయపడిన సిబ్బంది అదే రోజు నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. కొత్తపేట శివ్వంపేట మండలంలోకి వస్తుందని, అక్కడి ఠాణాకు వెళ్లాలని ఎస్ఐ సూచించడం గమనార్హం. దీంతో సిబ్బంది శివ్వంపేటకు వెళ్లి ఫిర్యాదు చేయగా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.కాసులు కురిపిస్తోంది..నీటితో కళకళలాడాల్సిన చెరువులు, కుంటలు గుంతలమయంగా మారుతున్నాయి. ఇటుక బట్టీల వ్యాపారులకు నల్లమట్టి కాసులు కురిపిస్తోంది. ఎలాంటి అనుమతి లేకుండానే తుజాల్‌పూర్‌లో దందా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. బట్టీలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్న అధికారులు వాటి నిర్వహణలో లొసుగులను మాత్రం గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తేలికపాటి ఇటుకల తయారీకి నల్లమట్టినే వాడుతుండటంతో డిమాండ్ పెరిగింది. మరోవైపు పలు చోట్ల అనధికారికంగా ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి.

**దౌర్జన్యానికి పాల్పడుతూ..**

చేసేది అక్రమ వ్యాపారం.. పైగా ప్రభుత్వ సిబ్బందిపై దాడి చేయడం చూస్తే అక్రమార్కులు ఎంత దౌర్జన్యం చేస్తున్నారో ఇట్టే అర్థమైపోతుంది. తుజాల్‌పూర్‌లో మట్టి తవ్వకాలు సాగుతుండగా, సిబ్బందిపై దాడి చేస్తే తమ పరిధిలోనిది కాదంటూ శివ్వంపేటకు వెళ్లమని నర్సాపూర్ పోలీసులు సూచించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ స్టేషన్‌కు ఫిర్యాదుల స్వీకరణలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి దక్కడం గమనార్హం.

**నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..**

మట్టి ఉన్న చోట ఇటుక బట్టీ ఏర్పాటు చేసుకుంటే తరలించేందుకు అనుమతి అవసరం లేదు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తే మాత్రం నీటిపారుదల శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. క్యూబిక్ మీటరుకు కొంత సీనరేజ్ ఛార్జీ చెల్లించాల్సిందే. చెరువుల్లో తవ్వకాలకు యంత్రాలు ఉపయోగించొద్దు. కానీ ఇవేవీ పట్టని అక్రమార్కులు ఇష్టానుసారంగా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. నీటివనరుల్లో ప్రమాదకరంగా భారీ గుంతలు ఏర్పడ్డాయి.


రెండో చోట్ల ఫిర్యాదు:మణిభూషణ్, ఏఈ, నీటిపారుదల శాఖ

# మత్తు మాయలో.. మృత్యు మార్గంలో

విజయనగరం : గతేడాది పెద్దచెరువు రోడ్డులో 19 ఏళ్ల యువకుడు, 15 ఏళ్ల బాలుడు డివైడర్‌ను ఢీకొని మృతిచెందారు. మార్గమధ్యలో ఇద్దరూ మద్యం తాగి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వారం తరువాత ఫూల్‌బాగ్ కాలనీ సమీపంలో 17 ఏళ్ల బాలుడు బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి తాటి చెట్ల మధ్యలోకి దూరి ప్రాణాలు కోల్పోయాడు. మత్తు కారణంగా ఈ ఘటన జరిగినట్లు తేల్చారు. బొండపల్లి రోడ్డులో 32 ఏళ్ల యువకుడు బైక్‌తో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పూటుగా మద్యం తాగిన అతడిని వైద్యులు కాపాడలేకపోయారు.

ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చాలామంది మద్యం, గంజాయి మత్తులో ప్రాణాలు కోల్పోతున్నట్లు ఇటీవల పోలీసులు తెలిపారు. మృతుల్లో 15 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వారు ఎక్కువగా ఉంటున్నారని గుర్తించారు. నేరుగా ముందున్న వాహనాలు, చెట్లు, డివైడర్లను ఢీకొనడమో లేదా ఇతర ప్రయాణికులను క్షతగాత్రులుగా మారుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ని దాడులు చేస్తున్నా రోజురోజుకూ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

**తరచూ ప్రమాదాలు..** రెండు జిల్లాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో 25 శాతం వరకు మత్తులో ఉన్నవారి వల్లే చోటుచేసుకుంటున్నాయని పోలీసుశాఖ పేర్కొంటోంది. కొందరు గంజాయి, మద్యం తాగిన తరువాత శిరస్త్రాణాలు సైతం ధరించడం లేదని, ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ఇతర ప్రయాణికులను



భయాందోళనకు గురిచేస్తున్నట్లు గుర్తించింది. ఈ ఏడాది 255 ప్రమాదాల్లో 62 మంది మృతిచెందారు.

**అందుబాటులో కేంద్రాలు..**
తాగుడుకు దూరం కావాలనుకునే వారికి మహారాజా ప్రభుత్వాసుపత్రి, పార్వతీపురంలోని జిల్లా వైద్యాలయాల్లోని మత్తు వ్యసనపరుల విముక్తి కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఒక్కోచోట పది పడకల చొప్పున అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, కౌన్సెలర్లు, ఇతర సిబ్బందిని నియమించారు. బాధితుడితో పాటు అవసరం మేరకు అతడి కుటుంబ సభ్యులకు సైతం కౌన్సెలింగ్ అందిస్తారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 758 మంది చికిత్స పొందారు.

**భారీగా జరిమానాలు..**
డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడినా, బహిరంగ, నిషేధిత ప్రాంతాల్లో తాగినా పోలీసులు వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల కోర్టులకు తరలిస్తుండడంతో రూ.10 వేల చొప్పున జరిమానాలు విధిస్తున్నారు. ఈ ఏడాది 366 మందికి రూ.36.60 లక్షల జరిమానా పడింది. ఇటీవల నగరానికి చెందిన 10 మంది రూ.1.60 లక్షలు చెల్లించారు. వీరంతా 15 నుంచి 35 ఏళ్ల లోపు వారే.

**మెదడుపై ప్రభావం..**
'మద్యం తాగి వాహనం నడపడం గుండెకు మంచిది కాదు. మెదడుపై నేరుగా ప్రభావం పడుతుంది. ఈక్రమంలో పట్టు కోల్పోతారు. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. ఒకవేళ మద్యానికి బానిసైతే వైద్యులను సంప్రదించాలి' అని ప్రముఖ జనరల్ ఫిజీషియన్, ఎన్‌సీడీ సెల్ వైద్యుడు డా.మురళీకృష్ణ చెప్పారు. మందుబాబుల విషయంలో రాజీ పడడం లేదని, పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

# సన్నకారు రైతులకు సహకారం

ఒంగోలు : రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ పథకం రైతులకు ఆసరాగా నిలుస్తోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన యాంత్రీకరణ పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 50 శాతం రాయితీపై జిల్లాలోని 1,257 మంది రైతులకు రూ.275.62 లక్షల విలువైన వ్యవసాయ యంత్రాలు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే 70 శాతం పంపిణీ పూర్తయింది. వీటిలో ఎస్సీలు 65 మందికి రూ.12.29 లక్షలు, ఎస్టీలు 12 మందికి రూ.1.74 లక్షలు రాయితీగా చెల్లించారు. రోటావేటర్స్, గొర్రులు, లెవలింగ్ బ్లేడ్, పురుగుమందు పిచికారీ స్ప్రేయర్లు, రోబో పవర్ టిల్లర్, బ్రెష్ కట్టర్, పవర్ వీడర్ తదితర పరికరాలు అందజేశారు. రైతు తన 50 శాతం వాటా చెల్లించిన వెంటనే వారు కోరుకున్న కంపెనీల వారు నేరుగా రైతుల ఇళ్లకు పరికరాలు సరఫరా చేస్తున్నారు.

2014-19 తెలుగుదేశం ప్రభుత్వంలో పథకం అమలులో ఉండగా, అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలో రద్దు చేశారు. ఒక ఏడాది అసలు ఏ పథకం అమలు కాలేదు. రెండో సంవత్సరంలో రైతులకు గ్రూపు రుణాలు కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాల పేరుతో మొత్తం 605 గ్రామాల్లో రూ.20.83 కోట్లతో పరికరాలు ఇచ్చారు. గ్రూపు సభ్యులు సొంతానికి వాడుకోవడంతోపాటు ఇతర రైతులకు ట్రాక్టరు, పరికరాలు అద్దెకు ఇవ్వడం దీని ఉద్దేశం. ఇది అమలులో ఫలితాలనివ్వలేదు. పెట్టుబడి పెట్టిన రైతులే వాటిని వినియోగించు కున్నారు. వీటి నిర్వాహణకు సంబంధించి భాగస్వాములైన గ్రూపు సభ్యులు సంతకాలు చేయాల్సి రావడంతో ఇతర రైతులకు సకాలంలో సేవలందలేదు. ఇప్పుడు అమలు చేసిన పథకంతో రైతులు 50 శాతం చెల్లిస్తే పరికరం తమ సొంతమవుతుంది.

# పల్లె ముంగిటకు గంగమ్మ



పాయకరావుపేట : పాయకరావుపేట నియోజకవర్గంలోని వందలాది గ్రామాల దాహం తీర్చే మెగా తాగునీటి ప్రాజెక్టుకు ఎట్టకేలకు గ్రహణం వీడింది. పుష్కర కాలం ఎదురుచూపులకు మరో ఆరు నెలల్లో ముగింపు పడనుంది. పైపులైను ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగడంతో వడివడిగా పనులు సాగుతున్నాయి.

నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లోని 130 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు మెగా ప్రాజెక్టు పనులకు 2012లో రూ. 35 కోట్లతో శ్రీకారం చుట్టారు. నాతవరం మండలం శరభవరంలోని ఏలేరు కాలువ నుంచి నీటిని తీసుకువచ్చేందుకు పైపులైను ఏర్పాటు చేశారు. గోపాలపట్నం ఆవలో ఏలేరు జలాలను నిల్వ చేసేందుకు 60 ఎకరాలు సిద్ధం చేశారు. నక్కపల్లి మండలంలోని ఉద్దండపురం వద్ద ఏరియేటర్ల ఏర్పాటు, నీటిని శుద్ధి చేసేందుకు అవసరమైన నిర్మాణాలు పూర్తి చేశారు. అనంతరం నిధుల కొరతతో పనులు అప్పట్లో మూలకు చేరాయి. 2014లో ప్రాజెక్టు పనులు నిలిచిన విషయాన్ని నారా లోకేశ్ దృష్టికి హోంమంత్రి వంగలపూడి అనిత తీసుకువెళ్లారు. దీనికోసం మరో రూ.51 కోట్లను కేటాయించారు. ఈ పనులకు 2017, మే 5న ఆయనే శంకుస్థాపన చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల్లో వేగం తగ్గింది. క్రమేణా పథకం పనులు నిలిచిపోయాయి.

**పనులకు రహదారి అడ్డంకి...**
కొంతకాలం తర్వాత పథకం పనుల నిమిత్తం మరో రూ. 80 కోట్లు నిధులు కేటాయించారు. పనులు మొదలైనప్పటికీ రహదారి పక్కన పైపులైను వేసేందుకు జాతీయ రహదారి అధికారులు ఒప్పుకోలేదు. మళ్లీ కథ మొదటికి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే మంత్రి అనిత దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో పలుమార్లు చర్చించారు. పైపులైను ఏర్పాటుకు అడ్డంకులు తొలగించారు. ప్రస్తుతం పాయకరావుపేట నుంచి ఉద్దండపురం వరకు పైపులు ఏర్పాటు చేశారు. త్వరలో ఉద్దండపురం నుంచి ఎస్.రాయవరం వరకు పనులు పైపులు వేసేందుకు రంగం సిద్ధం చేశారు.

**ఆరు నెలల్లో పనులు పూర్తి:** ప్రాజెక్టు పనులు మరో ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. పైపులైను వేసేందుకు శరవేగంగా పనులు చేయిస్తున్నాం. ఇప్పటికే ఉద్దండపురం, గొడిచెర్ల, డొంకాడ సహా మరో 8 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నాం. రానున్న రోజుల్లో పరిధిలోని అన్ని గ్రామాలకు రక్షిత నీరు అందిస్తాం.- ఆనంద్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

# 'తుక్కు'టమారాలు



నంద్యాల : 'తుక్కు' కొందరికి కాసులు కురిపిస్తోంది. పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. పలువురు అక్రమంగా రవాణా చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. వేబిల్లులు లేకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వీరి జీరో దందాకు వాణిజ్య పన్నుల శాఖలోని కిందిస్థాయి అధికారులు సహకరిస్తుండటం గమనార్హం. నెలకు రూ.కోట్ల విలువైన తుక్కు అక్రమంగా తరలిపోతున్నట్లు అంచనా. తాజాగా అనంతపురం జిల్లాలో పట్టుబడటం కలకలం సృష్టిస్తోంది.

**తనిఖీ కేంద్రాల్లేక..**
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు లేకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. సేకరించిన తుక్కును బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు అక్రమ మార్గంలో తీసుకెళుతున్నారు. ప్రత్యేకించి వేకువజామున అక్రమ రవాణా చేస్తుంటారు. వాహనాలు పట్టుబడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. తుక్కును తరలించే వాహనాల ముందు, వెనుక ఒక వాహనంలో వ్యాపారులు ఉంటారు. వారు చరవాణుల్లో వాహన డ్రైవర్లకు సమాచారం ఇస్తారు. అధికారులు ఎవరైనా రహదారులపై తిరుగుతుంటే వాహనాలను పక్కనే ఆపేస్తారు.

**పన్ను ఎగనామం**
తుక్కును ఇతర ప్రాంతాల్లో అమ్మాలన్నా.. రవాణా చేయాలన్నా తప్పనిసరిగా ఈ-వేబిల్లులు ఉండాలి. 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. ప్రతి రూ.100 కొనుగోలుకు సంబంధించి వాణిజ్య పన్నుల శాఖకు రూ.18 చెల్లించాలి. రెండు జిల్లాల పరిధిలో నెలకు లక్ష టన్నుల వరకు 'తుక్కు' సేకరణ జరుగుతోంది. బహిరంగ విపణిలో దీని విలువ రూ.30 కోట్ల వరకు ఉంటుంది. ఈ లెక్కన వాణిజ్య పన్నుల శాఖకు సుమారు రూ.5 కోట్ల వరకు జీఎస్టీ రూపంలో రావాల్సి ఉంది.

కర్నూలులోని మూడు కార్యాలయాలు, నంద్యాలలోని రెండు, ఆదోనిలో ఒక కార్యాలయం పరిధిలో తుక్కు ద్వారా వచ్చే ఆదాయం రూ.5 లక్షల లోపే ఉండటం గమనార్హం.

**ఆటోనగర్‌లో సేకరించి..**
కల్లూరు ఆటోనగర్, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల ఆటోనగర్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ పట్టణాల్లో పెద్దఎత్తున తుక్కు సేకరిస్తున్నారు. కిలో రూ.28-30 నుంచి తీసుకుంటారు. పోగైన సామగ్రిని గ్రేడింగ్ చేయించి లారీల్లో నేరుగా కంపెనీలకు తరలిస్తున్నారు. ఇందుకు కిలోకు అదనంగా రూ.10 నుంచి రూ.40 వరకు తీసుకుంటూ లాభాలు పొందుతున్నారు.

కర్నూలులో 30 మంది, నంద్యాలలో 15, ఆదోనిలో ఆరుగురు, ఆత్మకూరు ఐదుగురు, ఆళ్లగడ్డ, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో డీలర్లు ఉన్నారు. వీరికి ప్రతి నియోజకవర్గంలో సబ్ డీలర్లు ఉన్నారు. డీలర్ల వరకు అధికారికంగా గుర్తింపు పొందినా సబ్ డీలర్లు, పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేసే చిరు వ్యాపారులకు ఎలాంటి అధికారిక గుర్తింపు లేదు.

# పశువైద్య కళాశాల విద్యార్థులకు ఊరట



గరివిడి : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని గరివిడి పశువైద్య కళాశాలకు 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు ఎట్టకేలకు ప్రభుత్వం అనుమతులివ్వడంతో విద్యార్థులకు ఊరట లభించింది. కళాశాల శాశ్వత సభ్యత్వం కొనసాగించేందుకు ఆమోదం తెలిపారు. చివరి సంవత్సరం విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. చివరి ఏడాది విద్యార్థులను వేరే కళాశాలకు తరలించేందుకు అనుమతిచ్చారు.

గత తెదేపా హయాంలో 2016-17లో ఉత్తరాంధ్రకు ప్రాధాన్యతనిస్తూ గరివిడిలో పశువైద్య కళాశాలను మంజూరు చేశారు. రూ.81.72 కోట్ల నాబార్డు నిధులు కేటాయించారు. 2020లో ప్రవేశాలు ప్రారంభించారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలకు భారత పశు వైద్య మండలి (వీసీఐ) గుర్తింపు ఇచ్చింది. వైకాపా హయాంలో కళాశాల నిధులను మళ్లించడంతో ప్రధాన భవనాల నిర్మాణాలు పూర్తికాలేదు. సౌకర్యాలు లేక, బోధకులను నియమించక 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు వీసీఐ గుర్తింపు ఇవ్వలేదు. చదువు చెల్లుబాటు కావాలన్నా.. ఉద్యోగంలో చేరాలన్నా గుర్తింపు తప్పనిసరి. మొదటి బ్యాచ్ విద్యార్థుల బీవీఎస్సీ ఈ ఏడాది ఏప్రిల్‌లో పూర్తయ్యింది.

**కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**
వైకాపా ప్రభుత్వం నిర్వాకంతో కళాశాలలో నెలకొన్న గడ్డు పరిస్థితులను కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటిగా చక్కదిద్దుతోంది. రూ.16 కోట్లు పెండింగ్ బిల్లులను విడుదల చేయడంతో నిర్మాణాలు ప్రారంభించారు. ఇటీవల వీసీఐ బృందం కళాశాలకు వచ్చి సదుపాయాలు, మౌలిక వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, కె.అచ్చెన్నాయుడు కళాశాల సమస్యను కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి లలన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. మరికొద్ది రోజుల్లో కళాశాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ప్రస్తుతం చివరి ఏడాది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని తెలపడంతో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో ప్రవేశాలకు గుర్తింపునిస్తూ సోమవారం కేంద్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో పూర్తిస్థాయిలో వీసీఐ అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

**ఇంటర్న్‌షిప్‌కు పంపిస్తున్నాం..** విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం, విశ్వవిద్యాలయం చర్యలు తీసుకున్నాయి. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బీవీఎస్సీ మొదటి బ్యాచ్ 69 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కి పంపిస్తున్నాం. విద్యార్థులు జిల్లా కేంద్రాల్లో ఉన్న పశువైద్యశాలల్లో జూనియర్ వైద్యులుగా ఆరు నెలల పాటు పనిచేస్తారు. ఎం.శ్రీను, అసోసియేట్ డీన్, పశువైద్య కళాశాల, గరివిడి

# మిగులు భూములు మింగేస్తున్నారు!

త్రిపురాంతకం : త్రిపురాంతకం నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్‌ఎస్‌పీ) సబ్‌డివిజన్ పరిధిలోని మిగులు భూములను కొంతమంది అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారు. కొంతమంది పంటలు సాగు చేస్తుండగా, మరికొందరు ఏకంగా విక్రయించేస్తున్నారు. ఇక్కడ భూముల విలువ రెట్టింపు అవుతుండడంతో త్రిపురాంతకం పరిసరాల్లో ఎకరా రూ.2 కోట్ల వరకు పలుకుతోంది. దీంతో కొందరు అక్రమార్కుల కన్ను పడింది. నాగార్జున సాగర్ కాలువలు తవ్వేటప్పుడు అప్పట్లో రైతులకు పరిహారం చెల్లించి పుల్లలచెరువు మండలంలోని ప్రకాశం-గుంటూరు జిల్లా సరిహద్దు 85/3వ మైలురాయి నుంచి త్రిపురాంతకం మండలం దూపాడు వరకు 1,589 ఎకరాలు సేకరించారు. ఇందులో ప్రధాన కాలువ, మేజరు, మైనరు కాలువలు, గణపవరం, త్రిపురాంతకం, దూపాడు గ్రామాల్లో క్యాంపు నిర్మాణాలకు 707 ఎకరాలు వినియోగించారు. ఆ భూములు పోనూ 882 ఎకరాల వరకు మిగులు భూములున్నాయి. ఇప్పటికే అప్పట్లో భూములిచ్చిన కొంతమంది రైతుల వారసుల గుప్పిట్లో 106 ఎకరాలు ఉండగా, మరికొంతమంది ఆక్రమించుకున్నారు. దూపాడు, గొల్లపల్లిలో ఎన్‌ఎస్‌పీ కాలనీలుండగా, గొల్లపల్లిలో కొంత భాగాన్ని జగనన్న కాలనీకి కేటాయించారు.

త్రిపురాంతకం సబ్‌డివిజన్ పరిధిలోని ప్రధాన కాలువకిరువైపులా ఉన్న మిగులు భూములు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.



జాతీయ రహదారి వెంట త్రిపురాంతకం నుంచి దయ్యపువాగు వరకు గల మిగులు భూములను కొంతమంది రెండేళ్ల కిందట విక్రయానికి పెట్టారు. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు అడ్డుకున్నారు. మిరియంపల్లి మైనరు కాలువను ఆనుకుని ఉన్న మిగులు భూములను కొందరు రైతులు ఇటీవల స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించారు. ఇప్పటికే బ్రహ్మంగారి కాలనీ ప్రాంతంలో తారు రోడ్డుకు తూర్పు వైపు ఉన్న మిగులు భూములు కొన్నేళ్ల కిందటే కబ్జాకు గురి కావడం గమనార్హం. రెవెన్యూశాఖాధికారుల చేతివాటంతో ఆక్రమణదారుల పేరిట వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తుండటంతో మిగులు భూములు అన్యాక్రాంతమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫిర్యాదు చేశాం...:** ఆక్రమణలకు గురైన ఎన్‌ఎస్‌పీ మిగులు భూముల వివరాలు సేకరిస్తున్నాం. 128, 133 సర్వే నంబర్లలోని భూముల్లో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నట్లు తెలియడంతో రిజిస్ట్రేషన్లు నిలిపి వేయాలని యర్రగొండపాలెం సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశాం. హద్దు రాళ్లు వేసి భూములను అప్పగించాలని తహసీల్దారును కోరాం. ఆక్రమణదారులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నాం. విజయలక్ష్మి, డీఈఈ, ఎన్‌ఎస్‌పీ సబ్‌డివిజన్, త్రిపురాంతకం

# వారు చెప్పిందే ధర!

టంగుటూరు: జిల్లాలో జరుగుతున్న పొగాకు వేలం ప్రక్రియలో నిత్యం 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నా కొనుగోలులో 75 శాతం వాటా ప్రధానంగా మూడు కంపెనీలదే. ఇతర సంస్థల వారు హాజరవుతున్నా ఒకటి, రెండు బేళ్లు మాత్రమే కొనుగోలు చేసి మిన్నకుంటున్నారు. ఎందుకు కొనడం లేదంటే ఆ ధరలు తమకు గిట్టుబాటు కావడం లేదంటూ రైతుల ముఖం మీదే చెప్పేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోలు విషయంలో రైతులు, కంపెనీ ప్రతినిధులు, అధికారుల మధ్య నిత్యం వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**ఆశలు ఫలించక.. అప్పులు తీరక**
2024-25 పంట కాలంలో గతంలో మాదిరిగా ధరలు ఉంటాయనే ఆశతో రైతులు అధికంగా పొగాకు సాగు చేశారు. ఒక్క టంగుటూరు బోర్డు పరిధిలో 11.79 మిలియన్ కిలోల అనుమతికి గాను 16.50 మిలియన్ కిలోల పొగాకును పండించారు. పొలం కౌలు, కూలీల ధరలతో సాగు చేపట్టిన రైతులకు జోరు వర్షాలు దెబ్బతీశాయి. దీనికితోడు ఫిబ్రవరిలోనే ఎండలకు బెట్టకొచ్చిన తోటలకు నీరు పెట్టడంతో మేలిరకం దిగుబడులు రాలేదు. వీటన్నింటినీ ఆసరాగా చేసుకున్న కంపెనీలు రైతులను మభ్యపెట్టే పనిలో పడ్డాయి. మరోవైపు బోర్డులో కంపెనీలు మాయాజాలం ప్రదర్శిస్తున్నాయి. తక్కువ ధర పలికిన నాణ్యమైన గ్రేడ్‌లు మాత్రమే కొని, మిగిలినవి బోర్డుతో సంబంధం లేకుండా బయట కొనుగోలు చేద్దామని నిమ్మకుంటున్నారు. బోర్డులో విక్రయాలకు సెప్టెంబర్ వరకు సమయం పడుతుందని, ధరలు మరింత దిగజారుతాయని, అధిక పంటకు ఈ ఏడాది రుసుము



విధిస్తారని, వడ్డీలు పెరిగిపోతాయంటూ రైతులను భయాందోళనకు గురిచేస్తున్నారు. కొందరు రైతులు తమ అప్పులు, ఇతర అవసరాల దృష్ట్యా వచ్చిన మేరకు అమ్ముకుంటున్నారు. కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల పరిధిలో అధికంగా సాగుతోంది.

**తూతూమంత్రంగా విజిలెన్స్ దాడులు..**
ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలున్నాయి. అక్రమ పొగాకు రవాణాను అరికట్టేందుకు ఒక్కో కేంద్రానికి ఒక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందాలపై సెంట్రల్ విజిలెన్స్, ఆపై మొబైల్ విజిలెన్స్ బృందాలు ఉంటాయి. అయినప్పటికీ అక్రమ కొనుగోళ్లపై పర్యవేక్షణ కొరవడింది. నిత్యం వేల కిలోల పొగాకు అక్రమంగా తరలిపోతుంది. వేలం కేంద్రాల్లో ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది అంతా మహిళలే. వారే విజిలెన్స్ బృందాలుగా కొనసాగుతున్నారు. దీంతో రాత్రి వేళ మహిళా సిబ్బంది బయటకొచ్చి అడ్డుకోలేకపోవడంతో పొగాకు అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై గుంటూరు పొగాకు బోర్డు విజిలెన్స్ ఓఎస్డీ రవికాంత్‌ను వివరణ కోరగా.. విజిలెన్స్ బృందాలు ముమ్మరంగా తిరుగుతున్నాయని, ఇప్పటి వరకు 17 కేసులు నమోదు చేశామని, పొగాకు అక్రమ రవాణాపై పరిశీలిస్తామని తెలిపారు.

చురకలు

శనివారం 12 జూలై 2025

# కాలువ బలహీనం.. ప్రవాహం గగనం



అనంతపురం : సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంతకల్లు బ్రాంచి కెనాల్ మరమ్మతు పనులు మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురికావడంతో కాలువ బలహీనపడింది. కూటమి సర్కారు వచ్చాక కంపచెట్ల తొలగింపుతో పాటు అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతుకు నిధులు కేటాయించింది. పనులు నత్తనడకన సాగడంతో ఈసారి కూడా నీటి వృథా తప్పదనే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రధాన కాలువ పొడవు 59.5 కిలోమీటర్లు కాగా చాలాచోట్ల గట్టు దెబ్బతినడంతో ప్రవాహ సమయంలో గండ్లు పడే ప్రమాదం పొంచి ఉంది.

**పూర్తయినవి మూడే..**

ఒకటో కి.మీ. నుంచి 25 కి.మీ. వరకు అక్విడక్టు, అండర్ టన్నెళ్లల్లో చిన్నపాటి మరమ్మతులు చేస్తున్నారు. రూ.1.80 కోట్లతో 27 పనులు చేప ట్టగా3 మాత్రమే పూర్తయ్యాయి. ఎస్కేప్ ఛానళ్లకు సంబంధించిన షట్టర్లు తుప్పు పట్టి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. అండర్‌టన్నెళ్లు, అక్విడక్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. విడపనకల్లు మండల పరిధిలో ప్రధాన కాలువ లైనింగ్ చాలాచోట్ల దెబ్బతినడంతో నీరు వృథాగా పోతోంది. దీనికితోడు అక్విడక్టుల వద్ద కొందరు రైతులు గండ్లు పెడుతూ నీటిని మళ్లిస్తున్నారు. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరు అందడం ప్రశ్నార్థంగా మారింది.

**ఆధునికీకరణతోనే శాశ్వత పరిష్కారం**

2017లో జీబీసీ ఆధునికీకరణను రెండు ప్యాకేజీలుగా చేపట్టారు. ప్యాకేజీ-1లో రూ.120 కోట్లతో 28 కిలోమీటర్ల వరకు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. స్ట్రక్చర్లకు మరమ్మతులు చేయలేదు. ప్యాకేజీ-2లో 28వ కి.మీ. నుంచి 59వ కి.మీ. వరకు రూ.117 కోట్లతో పనులు మొదలుపెట్టారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక పనుల్ని పూర్తిగా నిలిపివేశారు. ఐదేళ్లలో నిర్వహణకు సైతం నిధులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం కెనాల్‌పై దృష్టి సారించి ఆధునికీకరణ పనుల్ని పునఃప్రారంభించి పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

**25 శాతం నీరు వృథా..**

గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు 6.89 టీఎంసీల కేటాయింపులున్నా ఆధునికీకరణ జరగకపోవడంతో 3 టీఎంసీలకు మించి తీసుకోవడం లేదు. అందులోనూ 25 శాతం వరకు వృథాగా పోతున్నాయి. జీబీసీ నుంచే గుత్తి సబ్ బాంచి కెనాల్, ఆలూరు బ్రాంచి కెనాల్‌కు నీరందించాల్సి ఉంది. జీబీసీకి సంబంధించి మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో రెండు కాలువలకు నీరివ్వడం కష్టంగా మారింది.

జీబీసీలోని మూడు సెక్షన్లలో 26 మంది లస్కర్లకు గాను ప్రస్తుతం ముగ్గురే ఉండటంతో కాలువ పర్యవేక్షణకు అగచాట్లు తప్పడం లేదు.

# సదరం.. నిరీక్షణమయం



హిందూపురం : సదరం శిబిరంలో వైకల్య ధ్రువపత్రం పొందేందుకు దరఖాస్తు చేసుకొన్న దివ్యాంగులు నాలుగు గంటలు వైద్యాధికారి కోసం నిరీక్షించి నీరసించారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి మాతాశిశు కేంద్రంలో సదరం శిబిరం ఏర్పాటు చేశారు. స్లాట్ నమోదు చేసుకొన్న దాదాపు 30మందిని ఉదయం 9గంటలకే శిబిరం వద్దకు చేరుకోవాలని పేర్కొనడంతో గోరంట్ల, పెనుకొండ, మడకశిర ప్రాంతాలకు చెందిన వారు అనేక ఇబ్బందులుపడి నిర్దీత సమయానికి శిబిరం వద్దకు చేరుకొన్నారు. ప్రమాదంలో అవయవ లోపం, పక్షవాతానికి గురైన వారు, మూత్రపిండాలు పాడై, వెన్నెముక దెబ్బతిన్న వారున్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవటానికి వైకల్య ధ్రువపత్రం పొందేందుకు వచ్చారు. శిబిరానికి పెనుకొండకు చెందిన వైద్యుడు మోహన్‌నాయక్‌ను అధికారులు నియమించగా కోర్టు వాయిదాతో హాజరు కాలేదు. ఆయన స్థానంలో మడకశిరకు చెందిన అభిలాష్‌ను నియమించటంతో అతను మడకశిరలో ఏర్పాటు చేసిన శిబిరానికి హాజరై మధ్యాహ్నం 1 గంటకు రావటంతో వచ్చినవారు తీవ్రనిరాశకు గురయ్యారు. ఇలాంటి పరిస్థితి మరెప్పుడు ఎదురుకాకుండా జిల్లాకలెక్టర్ చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

**జీవచ్ఛవంలా స్ట్రెచర్‌పై..**

ఈయన పేరు ఉమర్‌ఫరూక్, పది నెలల కిందట జరిగిన ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. కూర్చోవటానికి, కనీసం నిలబడటానికి అవకాశం లేదు. అలాంటి బాధితుడు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవటానికి వైకల్య ధ్రువపత్రం అవసరం కావడంతో స్లాట్ నమోదు చేసుకొని శిబిరానికి ఉదయం 8గంటలకే హాజరయ్యాడు. ఒంటిగంట వరకు స్ట్రెచర్‌పై జీవచ్ఛవంలా వైద్యుడికోసం ఎదురు చూశాడు.

**అద్దె కారు తీసుకొని..**

అమరాపురం మండలం హేమావతి నుంచి హిందూపురంలో ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి హాజరుకావటానికి బాధితుడు శివన్న రూ.3వేలు చెల్లించి అద్దెకారులో వచ్చాడు. అతనికి పక్షవాతం సోకి ఎడమకాలు, ఎడమ చెయ్యి పనిచేయక ఇతరుల సాయం లేనిదే కదలలేని పరిస్థితి. ఇలాంటి బాధితుడు నాలుగుచక్రాల కుర్చీపై దాదాపు నాలుగు గంటలు వైద్యుడికోసం ఇబ్బందులకు గురై ఎదురు చూశాడు.

**ఆక్సిజన్ లేకుంటే అంతే..**

గోరంట్లకు చెందిన షకీలాబానుకు కోవిడ్ సమయంలో రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. రాత్రీపగలు నాలుగు గంటలకు ఒకమారు ఆక్సిజన్ తీసుకొంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలాంటి బాధితురాలు సదరం ధ్రువపత్రానికి ఉదయం 8 గంటలకే శిబిరం వద్దకు హాజరైంది. మధ్యాహ్నం ఒంటి గంటవరకు వైద్యుడు రాకపోవటంతో నిరీక్షించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది.

# అన్నీ మోసాలే..!

తిరుపతి : స్థానిక లబ్ధిదారుల కోసం ఏర్పేడు మండలం చిందేపల్లిలో 10,500 పక్కా ఇళ్లకు స్థలాలు సిద్ధం చేశారు. ఇందులో శ్లాబ్‌లు పూర్తయినవి కేవలం 15 శాతం మాత్రమే. శ్రీకాళహస్తి పట్టణం, నియోజక వర్గ పేదల కోసం ఊరందూరు వద్ద 4,650 ఇళ్లతో కాలనీ ఏర్పాటు చేశారు. దీనికి అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పైలాన్ వేశారు. అయినా ఐదేళ్లల్లో ఒక్క గృహం కట్టలేదు. శ్లాబ్ వేసిన ఇళ్లకు రంగులేశారే తప్ప.. లబ్ధిదారులకు అందించలేదు. నవరత్నాల్లో ముఖ్యమైన పక్కా ఇళ్ల పేరుతో లబ్ధిదారులను వైకాపా ప్రభుత్వం నిలువునా ముంచేసింది. ప్రత్యేకించి శ్రీకాళహస్తి నియోజక వర్గంలో పట్టణానికి సమీపంలోని ఊరందూరు, ఏర్పేడు మండలం చిందేపల్లి సమీపంలో భారీగా పక్కా ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అప్పట్లో ఇవి కాలనీలు కాదు.. ఊర్లంటూ చెప్పుకొచ్చిన వైకాపా ఒక్కంటే ఒక్క గృహప్రవేశం చేసి లబ్ధిదారులకు అందించలేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా పనులు గాడిన పడకపోవడంతో కట్టిన నిర్మాణాలు అప్పుడే శిథిలమవుతున్నాయి. వైకాపా హయాంలో నిర్మించిన పక్కా ఇళ్ల లేఔట్ల విషయానికి వస్తే భూముల కొనుగోలు నుంచి లబ్ధిదారుల ఎంపిక, పట్టాలు మంజూరు, నిర్మాణాల్లో అక్రమాలు, గుత్తేదారుల ఆరగింపు ఇలా అన్నీ స్థాయిల్లో అక్రమాలు జరిగాయి. కేవలం కాగితాలపై లెక్కల కోసం.. లెక్కకు మిక్కిలిగా గృహాలు ప్రారంభించేశారు. గొప్పలకు పోయి పునాదులు వేసి వదిలేశారు.

**అభివృద్ధికి.. అవినీతి అడ్డు..**



ఇక్కడి కాలనీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ చేసింది. తవ్వేకొద్దీ మూలాల నుంచి అవినీతి పెచ్చుమీరడంతో పూర్తి స్థాయి విచారణ చేపట్టాక అభివృద్ధి పనులు కొనసాగించాలని నిర్ణయానికి వచ్చారు. ఊరందూరు కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల పట్టాల బహిరంగ విచారణ ఏర్పాటు చేస్తే కనీసం వంద మంది కూడా లబ్ధిదారులు రాకపోవడంతో అవినీతి, అక్రమాలు ఏ మేర జరిగాయో తెలుస్తుంది. నిర్మాణం పూర్తయిన ఇళ్లల్లోనూ పగుళ్లు రావడం, సిమెంటు పూతలు వేయకనే ఇళ్లకు వెలుపల రంగుల వేయడం, అంతర్గత వసతుల అభివృద్ధి చేపట్టకపోవడం పట్ల లబ్ధిదారులు ఇక్కడి ఇళ్లు పొందేందుకు ఆసక్తిని చూపడం లేదు. ఇప్పటికైనా అంతర్గత వసతుల కల్పనతో పాటు ఇళ్ల నివాసానికి వీలుగా చేసి అందుబాటులోకి తెచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ లబ్ధిదారులు కోరుతున్నారు.

# కన్నీళ్లే తడి..!

కుప్పం : ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనలతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వేరుసెనగ సాగు చేసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. కన్నీళ్లు మినహా జూన్‌లో వర్షపు జాడలు లేకపోవడంతో వేసిన పంట ఎక్కడిక్కడ ఎండిపోతోంది. కుప్పం నియోజకవర్గంలో వర్షపాతం ఏప్రిల్‌లో 110.7 శాతం, మేలో 125.2 శాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 84.1 శాతం కురవాల్సి ఉండగా... 26.1 శాతం మాత్రమే నమోదైంది. నియోజకవర్గంలో సాధారణ సాగు 5,714 హెక్టార్లు కాగా.. 30 శాతం పొలాల్లో వేరుసెనగ సాగుచేశారు. మొదట కురిసిన



వర్షాలకు కొందరు విత్తనాలు విత్తుకోగా... మరికొందరు విత్తనాలు వేసేందుకు పొలాల్లో తేమ లేక ఆకాశం వైపు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ విత్తనాలు మొలకెత్తినా... వర్షం పడకపోవడంతో పంట ఎండుముఖం పడుతోంది. అప్పులు చేసి సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే ఏం చేయాలో అర్థంకాక రైతన్నలు అయోమయంలో పడ్డారు. అదును దాటిపోతున్నా... కొందరు రైతులు విత్తనాలను సిద్ధం చేసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

# పూర్వ విద్యార్థుల దాతృత్వం

తిరుపతి : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రూ.16 కోట్లతో విద్యార్థినుల వసతిగృహ నిర్మాణం తలపెట్టగా ప్రస్తుతం రూ.6 కోట్లతో చేపట్టిన మొదటిదశ నిర్మాణాన్ని ఆగస్టు 15వ తేదీన ప్రారంభించనున్నారు. ఇందులో 28 గదులతో 112 మంది విద్యార్థినులకు వసతి కల్పిస్తున్నారు. ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులను మంగళవారం




సంఘం ప్రతినిధులు కలిశారు. 'శ్రీ పద్మావతి మహిళా హాస్టల్'గా నామకరణం చేయనున్నట్లు తెలిపారు. రూ.16 కోట్లతో 500 మంది విద్యార్థులు ఉండేలా వసతి సముదాయాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శ్రీనివాసులు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఆచార్య దామోదర్ రెడ్డి, ఆచార్య కె.ఎం.భాను, ఆచార్య హేమ తదితరులు ఆగస్టు 15న జరగనున్న కార్యక్రమ ఆహ్వాన పత్రికను వర్సిటీ అధికారులకు అందజేశారు.

# జడ్పీ ఆస్తులు పరాధీనం

విశాఖపట్నం : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రూ. కోట్ల విలువైన జిల్లాపరిషత్తు స్థలాలు, భూములు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుపోయాయి. ఉన్న అరకొర ఆస్తుల నుంచి ఆదాయం రాబట్టడంపై యంత్రాంగం విఫలమవుతోంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో జిల్లా పరిషత్తు ఆస్తుల సంరక్షణకు సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక కమిటీ పనిచేసింది. తర్వాత వచ్చిన ప్రభుత్వం కనీసం జడ్పీ ఆస్తుల గురించి కూడా పట్టించుకోలేదు. దీంతో ఉన్న కొద్దిపాటి ఆస్తులు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. ఇప్పటికైనా ఆస్తుల సంరక్షణపై దృష్టి సారించకుంటే.. గడ్డుపరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. బుధవారం విశాఖపట్నం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కీలక అంశాలతో పాటు భూములు, ఆస్తుల సంరక్షణపై చర్చించి.. కార్యాచరణ మొదలెట్టాల్సి ఉంది.

జిల్లా పరిషత్తుకు 330 పైగా ఆస్తులు ఉన్నాయి. వీటిలో 290 వరకు ఉన్నత పాఠశాలల స్థలాలే ఉన్నాయి. మిగతా వాటిలో కొన్ని ఖాళీ స్థలాలు, మరికొన్ని అతిథి గృహాలున్నాయి. గత కొన్నేళ్లుగా పాలక వర్గం పట్టించుకోకపోవడం.. కోర్టుల్లో కేసులు, ఆక్రమణలపై అధికారులు ఉదాసీనత చూపడంతో వీటిపై ఆక్రమణదారుల పట్టు పెరిగిపోయింది. విశాఖ మొదలుకొని అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఇప్పటికే రూ. వందకోట్లకు పైగా విలువైన ఆస్తులు చేజారిపోయాయి. అచ్యుతాపురం మండలం దోసూరులోని ఉన్నతపాఠశాల స్థలం గురించి



కొన్నేళ్లుగా కోర్టులో కేసులు నడుస్తున్నాయి. నేటికీ అవి తేలలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ, పాడేరు, చింతపల్లి వంటి పర్యాటక ప్రాంతాల్లో జడ్పీ అతిథి గృహాలున్నాయి. అప్పట్లో రూ. కోట్లు ఖర్చు చేసి వీటిని నిర్మించారు. వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా తయారయ్యాయి. వీటి నుంచి పైసా ఆదాయం లేదు.

**ఆదాయ వనరుగా మార్చుతాం**

జిల్లా పరిషత్తు ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నాం. జడ్పీ సమావేశంలో ఆస్తుల సంరక్షణ, అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు చేయనున్నాం. ఉమ్మడి జిల్లాలో 12 అతిథి గృహాలున్నాయి. వీటిని ఉన్నతంగా తీర్చిదిద్ది ఆదాయవనరులుగా మార్చుకుంటాం. నారాయణమూర్తి, జడ్పీ ముఖ్యకార్యనిర్వహణాధికారి

# అక్రమార్కుల 'పాక'పాచిక

విశాఖపట్నం : విశాఖలో కబ్జాలకు సరికొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. వైకాపా హయాంలో ఈ తరహా భూ దందాకు బీజం పడింది. 13వ వార్డు దారపాలెం, ఫైనాపిల్ కాలనీ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయి. సర్వే నెంబరు 15/12 లో ఉన్న 3.07 ఎకరాల్లో గత ఐదేళ్లలో రూ.కోట్ల విలువైన ఎకరా భూమిపైగా కబ్జాకు గురైంది. కూటమి ప్రభుత్వంలోనూ కొందరు ఇదే తరహా కబ్జాలకు అడుగులు వేస్తున్నారు. ఇటీవల యోగాంధ్ర నిర్వహణలో అధికారులు నిమగ్నమైన వేళ కొన్ని నిర్మాణాలు ఆగమేఘాలపై పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

**నాయకులు, రౌడీషీటర్లదే హవా:** పోరంబోకు స్థలంలో మొదట పశువుల కోసం ఎండుగడ్డి వేసి, అక్కడే వాటిని కట్టేస్తారు. కొన్ని రోజుల తర్వాత పశువుల రక్షణ పేరుతో పాకలు వేస్తారు. ఆ స్థలం ఇతరుల నుంచి కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించి చక్రం తిప్పుతున్నారన్న విమర్శలున్నాయి. ఆపై జీవీఎంసీ సిబ్బందితో లాలూచీ పడి పన్ను వేయించడం, ఆపై విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేయడం చకచకా జరిగిపోతున్నాయి. తరువాత కొన్ని రోజులకే రక్షణ గోడ నిర్మాణం చేపడతారు. ఎవరైనా ప్రశ్నిస్తే బీఆర్టీఎస్ రహదారిలో స్థలం



పోగొట్టుకున్నామని, ప్రతిగా ఇక్కడ స్థలం ఇచ్చారంటూ చెప్పుకొస్తుండటం గమనార్హం. ఈ వ్యవహారంలో నాయకులతోపాటు, కొందరు రౌడీషీటర్లు పావులు కదుపుతున్నారు. ఓ రౌడీషీటర్ ఆధ్వర్యంలో ఇటీవల కొన్ని నిర్మాణాలు సాగడంపై చర్చనీయాంశమైంది.

**అధికారుల 'భూ'చాట!:** ఇక్కడ విచిత్రం ఏమిటంటే కొందరు అధికారులే ప్రభుత్వ భూములు ఎలా కబ్జా చెయ్యాలో, ఆక్రమణదారులు ఏ విధంగా రక్షణ వలయంలో ఉండాలో సూచనలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆక్రమణదారులు భవన నిర్మాణం చేసేవరకు అటువైపు కన్నెత్తి చూడరు. ఫిర్యాదులొస్తే హడావుడి చేసి ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతి చేతులు దులిపేసుకుంటున్నారు. సృష్టించిన నకిలీ పత్రాలను వాస్తవమైనవా? నకిలీవా? అని అధికారులు తీరుబడిగా తేల్చేలోగా భవనాలు పూర్తిచేస్తున్నారు. ఈ భవనాలు కొన్ని చేతులు మారగా, మరికొందరు అద్దెలకిచ్చుకుంటున్నారు.

# దస్త్రాల్లో పేదలు.. పొలాల్లో పెత్తందార్లు


బొబ్బిలి : పేదల బతుకు తెరువు కోసం గతంలో ప్రభుత్వం అందజేసిన డి.పట్టా భూములు చేతులు మారుతున్నాయి. భూముల ధరలు పెరుగుదలతో లబ్ధిదారులను మోసగించి.. కారుచౌకగా వారి నుంచి లాగేస్తున్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతోనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దస్త్రాల్లో లబ్ధిదారులే ఉన్నా వందేళ్ల లీజు పేరుతో పత్రాలు సృష్టించి పెత్తందార్లు సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ అవసరాలకు ఈ భూములు సేకరిస్తే కొనుగోలు చేసిన వారికే లబ్ధి చేకూరుతోంది.

**ఇదీ పలుచోట్ల పరిస్థితి**

బొబ్బిలి పట్టణం మల్లంపేట, గున్నతోటవలస, గొల్లపల్లి, రామన్నదొరవలస, పుల్లేరువలస, పారిశ్రామికవాడ ప్రాంతం, విజయపురి ప్రాంతాల్లోని వందల ఎకరాలు బడాబాబుల చేతుల్లో ఉన్నాయి. గతంలో ఓ నాయకుడు రామన్నదొరవలస వద్ద గిరిజనుల డి.పట్టా భూములను కొనుగోలు చేసి జగనన్న కాలనీకి విక్రయించారు. రూ.లక్షలు లాభం పొందాడు. సీబీసీఐడీ అధికారులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు నిర్వహించారు. అధికారుల అండదండలతోనే ఇదంతా సాగింది. తెర్లాం మండలంలోని లోచర్ల, ఆమిటి, వెలగవలస, ఎం.ఆర్ అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల డి.పట్టా భూములను విశాఖకు చెందిన ఓ వైద్యుడు కొనుగోలు చేశారు. కొన్నాళ్లు సాగు చేశాక వివాదంలోకి వెళ్లడంతో స్థలాన్ని ఖాళీగా ఉంచారు. భూబందరవలస రెవెన్యూలో పేదలకు ఇచ్చిన భూములను తెలంగాణకు చెందిన భూస్వామి కొనుగోలు చేసి, దర్జాగా పంటలు పండించుకుంటున్నాడు.

దొంగురువలస రెవెన్యూలో డి.పట్టాలు పేదల పేరున ఉన్నప్పటికీ భూములు మాత్రం పెత్తందార్ల చేతిలో ఉన్నాయి.

చింతాడ సమీపంలోని డి.పట్టా భూములను వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుడు కొనుగోలు చేశాడు. ప్లాట్లు వేయడానికి



చదును చేసిన తర్వాత రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. రామభద్రపురం మండలం కొండకెంగువ, ఎనుబరువు, రావివలస గ్రామాల్లో డి.పట్టాల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

బొబ్బిలి మండలం కొయ్యకొండవలస గిరిజనులకు చాలా ఏళ్ల కిందట ఇచ్చిన భూములను సాలూరు మండలం బాగువలసకు చెందిన ఇద్దరు వ్యక్తులు కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారు. ఫిర్యాదు అందడంతో గతేడాది నవంబరులో తహసీల్దారు శ్రీను, వీఆర్వోలు స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అప్పగించారు.

**రెవెన్యూ సిబ్బంది సహకారంతో..**

కొంతమంది పెత్తందారులు వీఆర్‌వోలను చేతిలో పెట్టుకుని గుట్టుగా బేరాలు సాగిస్తున్నారు. అన్ని కుదిరిన తర్వాత పలుకుబడితో పక్కనే ఉన్న జిరాయితీ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.

**దృష్టి సారించాం..**

డి.పట్టా భూముల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాం. జగనన్న కాలనీలోని ఖాళీ భూమిలో ఇటీవల కొందరు నీలగిరి మొక్కలు వేస్తుంటే అడ్డుకున్నాం. డి.పట్టా క్రయవిక్రయాలు చెల్లవు. వీటిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం.రామ్మోహనరావు, ఆర్డీవో

# ముక్కంటి.. చూడవేంటి?

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కైలాసగిరుల్లో ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. రాత్రిళ్లు గుట్టుగా మట్టిని తరలించి జేబులు నింపుకొంటున్న అక్రమార్కులు తాజాగా దేవుడి బాటను ఆనుకుని వీలైనంత మేరకు ఆలయ స్థలాలను కబ్జా చేసేందుకు యత్నించడంతో ఈ భూముల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ముక్కంటి ఆలయానికి ఆనుకుని ఐదు వేల ఎకరాలకు పైగా కైలాసగిరులు విస్తరించి ఉన్నాయి. పట్టణం విస్తరించే కొద్దీ ఇక్కడి భూముల పరిరక్షణకు తూట్లు పడుతున్నాయి. ఆక్రమణలకు గురికాకుండా గతంలో హరితాభివృద్ధి పథకం ద్వారా ఈ భూములను సర్వే చేయించి రికార్డులు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఇక్కడి కైలాసగిరుల్లో మట్టి తవ్వకాలతో పాటు భూముల కబ్జా సర్వసాధారణంగా మారుతోంది.



**కొరవడిన పర్యవేక్షణ**

కైలాసగిరి ప్రదక్షిణ రోడ్డు ఏర్పాటయ్యాక రోడ్డుకు ఇరువైపులా భూములకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం సాగు భూములున్న కొందరు రైతులు రాత్రికి రాత్రి ఆలయ భూములు కలుపుకొని చదును చేయడం, సాగుకు యోగ్యంగా మార్చేందుకు యత్నిస్తున్నారు. ఇక్కడి భూముల నిరంతర పరిశీలనకు ప్రత్యేకించి సిబ్బంది లేకపోవడం కబ్జాదారులకు వరంగా మారింది. ఎవరైనా ఫిర్యాదు రూపంలో ఇస్తే సిబ్బంది వెళ్లి ఆక్రమణలను నిలువరిస్తున్నారు.

ఇటీవల గుగ్గిళ్లవ్వ వద్ద భూములను ఆక్రమించిన వారిని నిలువరించి స్వాధీనం చేసుకున్నారు. తాజాగా వేదాం వద్ద ఆలయ భూముల్లో పంట సాగు చేశాక సిబ్బందికి సమాచారం అందింది. ఈ విషయమై సంబంధిత ఆక్రమణదారులు ఆలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగడం గమనార్హం. సర్వే బృందాలను తీసుకెళ్లి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో అక్రమార్కులు రాకపోవడంతో సర్వే జరగలేదు. శుక్రవారం ఆక్రమణదారుల నేతృత్వంలో సర్వే చేసి ఆలయ భూములు స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శాశ్వత ప్రాతిపదికన ఇక్కడి భూములు సంరక్షించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంది.

# ముఖం చూపాల్సిందే..!

చిత్తూరు : స్వయం సహాయక సంఘాలు ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. ఈ సమావేశాలు నిర్వహించడంతో పాటు సభ్యులంతా హాజరయ్యారని నిర్ధారించుకునేందుకు సాంకేతికత జోడించింది.. కొన్ని సంఘాలు సమావేశాలు నిర్వహించక పోయినా రికార్డుల్లో చూపడం, సభ్యులు రాకున్నా హాజరైనట్లు నమోదు చేస్తున్నారు.. ఇకపై అలాంటి వాటికి చెక్ పెట్టేందుకు రంగం సిద్ధమైంది.

**అన్నీ యాప్‌లో నిక్షిప్తం..:** గ్రామైక్య సంఘాల సమావేశాలు, స్వయం



సహాయక సంఘాల సమావేశాలు నిర్వహించే సమయంలో కచ్చితంగా జియో ఫేస్ రిజిస్ట్రేషన్ ఫెన్సింగ్ యాప్‌లో సమావేశాలు నిర్వహించే స్థల వివరాలు తొలుత నమోదు చేయాలి. వంద మీటర్ల లోపే సమావేశం నిర్వహించాలి. లేకుంటే యాప్ లొకేషన్‌ను తీసుకోదు. ఒక్కో సభ్యురాలి ఫొటో మూడు కోణాల్లో ముఖం, పూర్తి ఫొటో తీసి యాప్‌లో పొందు పరచాలి. సభ్యులు సమావేశానికి వస్తేనే హాజరు నమోదవుతుంది. ఆయా సమావేశాలకు సీసీ లేదా ఏపీఎంలు హాజరు కావాలి. ఈ ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే ప్రారంభించారు. ఈ యాప్ ఎప్పట్నుంచో ఉన్నా సభ్యుల వివరాల నమోదు జరుగుతుండటంతో పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. త్వరలోనే పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# చి'వరి'కి నీరందేలా!

నర్సీపట్నం : అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని ఆరు మండలాలకు చెందిన 77 గ్రామాల్లో 51,465 ఎకరాల ఆయకట్టు ఉన్న తాండవ జలాశయం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వైకాపా సర్కారు ఐదేళ్ల పాలనలో మరమ్మతు పనులకు నిధులు విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే సభాపతి అయ్యన్నపాత్రుడు చొరవతో తొలుత 18 అత్యవసర పనులకు రూ. 2.10 కోట్లు విడుదలయ్యాయి. కుడి, ఎడమ కాలువలపై మూడు ఆక్విడక్టులను పునరుద్ధరించారు. నిమ్మకట్టులో పూడిక తొలగించి 50 మీటర్ల పొడవునా గట్టును బలోపేతం చేశారు. ఇప్పటికే 8 పనులు పూర్తికాగా మరో 10 పనులు వారం రోజుల్లో పూర్తికానున్నాయి. గత నెలలో 57 పనులకు రూ. 4.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆక్విడక్టులు, అండర్ టన్నెళ్ల మరమ్మతు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 20 నాటికి పనులన్నీ మొదలుకానున్నాయి. తాజాగా మరో 25 పనులకు రూ. 2.65 కోట్లు అవసరమని ప్రతిపాదనలు చేశారు. ఈ నిధులొస్తే స్పిల్‌వే గేట్ల నిర్వహణ, ప్రధాన గేట్ల మరమ్మతులు తదితర పనులకు ఖర్చు చేయనున్నారు. జలాశయం నుంచి ఖరీఫ్ వరికి ఆగస్టులో నీరిస్తుంటారు. ఆ లోగా పనులన్నీ పూర్తి చేయాలన్నదే లక్ష్యం. అనకాపల్లి జిల్లాలో నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, ప్రత్తిపాడు మండలాల్లో ఈ జలాశయం కింద ఆయకట్టు ఉంది. కాలువ చివరి భూముల వరకు ఈ ఏడాది నీరు ప్రవహించేలా చూడాలన్నది ప్రాజెక్టు కమిటీ లక్ష్యం.

**కమిటీ నిర్ణయం మేరకు నీళ్లు:** జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు. గత ఏడాది ఇదే సమయానికి 355.3 అడుగుల నీటిమట్టంతో వెయ్యి ఎంసీఎఫ్‌టీల నీరుంది. ప్రస్తుతం 366.3 అడుగుల నీటిమట్టంతో 2251.6 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉంది. ఈ నీరు రోజుకు 600 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తే 44 రోజుల వరకు సరిపోతుంది. వరినాట్లు వేసుకునే సమయంలో రైతులు నీళ్లు అడుగుతుంటారు. ప్రాజెక్టు కమిటీ నిర్ణయం మేరకు నీరు విడుదల జరుగుతుంది. – అనూరాధ, ప్రాజెక్టు డీఈఈ, నర్సీపట్నం

# వారంతే.. ప్రజాధనం కుమ్మరింతే!!



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజాధనం లెక్కలేకుండా ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు.. తీర్మానాల్లేకుండా, టెండర్లు లేకుండా కొన్ని పనులకు నిధులు కుమ్మరించారనే విమర్శలొస్తున్నాయి. వాటిలో ఈస్టరన్ ఘాట్స్ బయో డైవర్సిటీ సెంటర్ (తూర్పు కనుమల జీవ వైవిధ్యకేంద్రం) కూడా ఉంది. **అటవీశాఖకు జీవీఎంసీ నిధులా?:** జీవీఎంసీ ఎక్కడైనా నిధులు ఖర్చుచేయాలంటే ప్రతిపాదనలు, కౌన్సిల్ ఆమోదం, టెండర్లు వంటివి ఉంటాయి. అయితే...అటవీ శాఖ పర్యవేక్షణలో ఉండే తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రానికి ఏ అనుమతి లేకుండా ప్రజాధనం ఖర్చు చేయడం గమనార్హం. జీవీఎంసీ కమిషనర్‌గా సాయికాంత్‌వర్మ, డీఎఫ్‌వోగా అనంత్‌శంకర్ హయాంలో ఇవి జరిగాయి. ఈ కేంద్రంలో ఔషధ మొక్కల వనం, ప్రత్యేక వాతావరణంలో పెరిగే ఎడారి, కాక్టస్, ఆర్కిడ్స్ వంటి మొక్కలు, వన్యప్రాణులకు సంబంధించిన అవగాహన కేంద్రం ఉంటాయి. ప్రైవేటు కంపెనీల సీఎస్ఆర్ నిధుల సాయంతో ఈ కేంద్రం అభివృద్ధి చేశారు. ఈ కేంద్రానికి వెళ్లడానికి ప్రధాన గేటు గతంలో ఉంది. దీనికి వంద మీటర్ల దూరంలోనే కొత్తగా రెండో గేటు ఏర్పాటు చేసి, గతంలో ఉన్న గేటును పర్యాటకులు బయటకు వెళ్లేందుకు వీలుగా మార్చాలని ప్రణాళిక చేశారు. దీనికి జీవీఎంసీ నిధులు ఖర్చు చేశారు.

**పనులు తుదిదశలో:** ఆర్చి ప్రధాన ద్వారానికి రూ. 20లక్షలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి టైల్స్‌కు రూ. 13లక్షలు జీవీఎంసీ నిధులు ఖర్చు చేశారు. పనులు 90శాతం పూర్తయి తుది దశకు చేరుకున్న సమయంలో అటు డీఎఫ్‌వో, ఇటు జీవీఎంసీ కమిషనర్ ఇద్దరూ బదిలీపై వెళ్లిపోయారు. కొత్త డీఎఫ్‌వో వచ్చాక ఈ పనులపై ఆరా తీయగా, అనుమతులకు సంబంధించి ఎలాంటి పత్రాల్లేనట్లు తెలుస్తోంది.

**ఇలాగే...ఇంకా కొన్ని:** సాయికాంత్‌వర్మ జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న సమయంలో ముడసర్లోవలో రూ. 9కోట్లతో హార్స్ రైడింగ్ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విషయమేమంటే కౌన్సిల్‌లో సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా దీనిని చేపట్టారు. దీంతో కూటమి నేతలు నిలదీశారు. అప్పటికే ఈ ప్రాజెక్టు విషయంలో రూ. 3–4 కోట్లు ఖర్చు చేశారు. అదేవిధంగా ఆర్కేబీచ్ సమీపంలో ఈత కొలను పనులు కౌన్సిల్ ఆమోదం, టెండర్లు లేకుండానే రూ. 3 కోట్లతో చేపట్టారు. వైకాపా హయాంలో విశాఖ రాజధాని పేరుతో నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు ప్రజాధనం వృథా చేశారనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై జీవీఎంసీ జోన్–2 ఈఈ శాంతిరాజ్‌ను వివరణ కోరగా, అక్కడ పనులు జీవీఎంసీ నిధులతోనే చేసినట్లు తెలిపారు. అనుమతుల గురించి అడగ్గా ఎలాంటి పత్రాల్లేవని సమాధానమిచ్చారు. ఈ అంశంపై డీఎఫ్‌వో మంగమ్మను వివరణ కోరగా... తమ శాఖ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని పేర్కొన్నారు.

# బిల్లులు రాక.. పనులు కదలక!



అనకాపల్లి : అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన పల్లెలను గుర్తించి వాటికి రవాణా సదుపాయం మెరుగుపరిచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పల్లెపండగ పేరుతో రహదారులు నిర్మిస్తోంది. అభివృద్ధి పనులపై ప్రజలు సంతృప్తిగా ఉన్నా బకాయిల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పనులు పూర్తి చేసిన గుత్తేదారులు సొమ్ముకోసం నిరీక్షిస్తున్నారు. ఈ ప్రభావం మిగిలిన పనులతోపాటు భవిష్యత్తులో చేపట్టే కొత్త పనులపైనా ప్రభావం పడనుంది.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో చిందరవందరగా తయారైన రోడ్లను సక్రమంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం పల్లెపండగకు శ్రీకారం చుట్టింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1831 పనులు మంజూరు చేసింది. ఇందుకోసం రూ. 183.16 కోట్లు నిధులు కేటాయించారు. దీంట్లో ఇప్పటివరకు 1288 పనులు పూర్తి చేశారు. వీటికి కేవలం రూ. 10.68 కోట్ల బిల్లును మాత్రమే గుత్తేదారులకు చెల్లించారు. ఇంకా రూ. 70.44 కోట్ల బకాయిలున్నాయి. ప్రతి వారం బిల్లులు చెల్లిస్తామని అధికారులు మొదట్లో చెప్పడంతో.. గుత్తేదారులు చకచకా పనులు చేపట్టారు. పనుల ప్రారంభంలో బిల్లులు బాగానే జరిగినా.. జనవరి మొదట నుంచి నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

జిల్లాకు మంజూరైన 1831 పనుల్లో ఇంకా.. 543 పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. పాత బకాయిలు పేరుకుపోవడంతో.. గుత్తేదారుకు మిగిలిన పనులు పూర్తిచేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ పనులకు కేంద్రం 75 శాతం నిధులు మంజూరు చేస్తే.. రాష్ట్రం మిగిలిన 25 శాతం కలిపి బిల్లులు చెల్లిస్తారు. వైకాపా హయాంలో చేపట్టిన సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలు, ఇతర నిర్మాణాలకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. ప్రస్తుతం పల్లెపండగ నిధులు నుంచే వాటికి సైతం బిల్లులు చెల్లించాల్సిఉంది. ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులే ఇంకా పెండింగ్‌లో ఉండగా.. పాత బిల్లులు చెల్లించడం మరింత భారంగా మారనుంది.

**గుత్తేదారులకు త్వరలో చెల్లిస్తాం:** మెటీరియల్ నిధుల విడుదలలో జాప్యంతో చెల్లింపులు నిలిచాయి. పనులు పూర్తయిన వివరాలు పైస్థాయికి పంపించాం. త్వరలో నిధులు విడుదలయ్యే వీలుంది. నిధులు రాగానే.. బకాయిలు చెల్లిస్తాం. గుత్తేదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– పూర్ణిమాదేవి, డ్వామా పీడీ, అనకాపల్లి

# ఊపిరి తీసిన విషవాయువులు

విశాఖపట్నం : అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో జరిగిన ఓ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనకు సంబంధించి కర్మాగారాల శాఖ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎస్ఎస్(సాయి శ్రేయాస్) ఫార్మా కంపెనీ రెండో అంతస్థు టెర్రస్‌పై ఈటీపీ (ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)కు చెందిన నాలుగు ట్యాంకులు ఉన్నాయి. ఔషధ ఉత్పత్తుల తయారీలో భాగంగా ఏర్పడిన రసాయన వ్యర్థ జలాలు పైపులైన్ ద్వారా ఆ ట్యాంకులకు చేరుతాయి. కంపెనీ సేఫ్టీ అసిస్టెంట్ మేనేజర్ పరిమి చంద్రశేఖర్(32), షిఫ్టు సేఫ్టీ ఆఫీసర్ శరగడం కుమార్ (25), కాంట్రాక్టు కార్మికుడు బైడా బన్సాలీ (37) 10 గంటలకు సి షిఫ్టు విధులకు హాజరయ్యారు. అర్ధరాత్రి దాటాక 1.20 గంటల సమయంలో వీరు వ్యర్థ జలం ఏమేరకు ఉందో పరిశీలించేందుకు ఆ ట్యాంకుల వద్దకు వెళ్లారు. వాటి మూతలు తెరిచినపుడు వెలువడిన ప్రమాదకర హైడ్రోజన్ సల్ఫైడ్ విష వాయువు పీల్చి అపస్మారక స్థితికి చేరుకున్నారు. అప్పుడు టీ విరామ సమయం కావడం, వెళ్లిన ముగ్గురూ ఇంకా తిరిగి రాకపోవడంతో తోటి సిబ్బంది అక్కడకు వెళ్లి చూడగా కింద పడి ఉన్నారు. వారిని హుటాహుటిన షీలానగర్ కిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చంద్రశేఖర్, కుమార్ మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. దాంతో వారి మృతదేహాలను కేజీహెచ్ మార్చురీకి తరలించారు. హెల్పర్ పరిస్థితి విషమంగా ఉంది. ఆర్డీవో అయిషా, డీఎస్పీ విష్ణుస్వరూప్, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.పరమేశ్వరరావు, కాలుష్య నియంత్రణ విభాగం (పీసీబీ) ఈఈ ముకుందరావు, కార్మికశాఖ అధికారులు నరేంద్ర, వసంతరావు, పరిశ్రమలశాఖ జీఎం నాగరాజారావు, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ వీరభద్రరావు, రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలించి కారణాలు తెలుసుకున్నారు. సంబంధిత ట్యాంకుల్లో వ్యర్థజలాలు ఏమేరకు ఉందో తెలియజేసే ఇండికేటర్లు లేకపోవడం వల్లే వీరు వాటి మూతలు తెరిచి ప్రమాదానికి గురైనట్లు



ఓ అధికారి పేర్కొన్నారు. హైదరాబాద్ సురారం ప్రాంతానికి చెందిన మృతుడు చంద్రశేఖర్ గతేడాది మార్చిలో పరవాడ ఎస్ఎస్ ఫార్మా సంస్థలో చేరారు. స్వగ్రామం తాడేపల్లిగూడెం. బీఎస్సీ, డిప్లమో సేఫ్టీ కోర్సు చేసిన ఈయన గతంలో హైదరాబాద్‌లోని ఓ ఫార్మా సంస్థలో పని చేశారు. ఈయనకు 2021లో శ్రీకాకుళం జిల్లా పలాస సమీప చౌడుపల్లికి చెందిన అనూషతో వివాహం జరిగింది. ప్రస్తుతం భార్య, రెండేళ్ల కుమార్తెతో కలిసి అగనంపూడిలో నివాసం ఉంటున్నారు. ఇంటి నుంచి కంపెనీ విధులకు వెళ్లిన భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఇక తమకు దిక్కెవరంటూ భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు. అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన మృతుడు కుమార్ డిగ్రీ చదివి, సేఫ్టీ కోర్సు పూర్తి చేశారు. 8నెలల క్రితమే ఈ కంపెనీలో చేరారు. గతంలో అచ్యుతాపురంలోని ఓ కంపెనీలో పని చేశారు. ఈయనకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్య మాధురి, తమ్ముడు వంశీ ఉన్నారు. ఈయన తండ్రి మూడేళ్ల క్రితం, తల్లి 5నెలల క్రితం మృతి చెందారు. సొంత పని మీద బుధవారం కంపెనీ విధులకు సెలవు పెట్టగా, సంబంధిత అధికారులు కుదరదని చెప్పడంతో విధులకు వెళ్లి ఇలా మృత్యువు బారిన పడ్డారని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

# కలల గోకులం.. నెలలుగా వ్యాకులం

మద్దిపాడు : గోకులం పథకంలో షెడ్లు నిర్మించుకున్న పశు పోషకులు త్రిశంకు స్వర్గంలో విలవిల్లాడుతున్నారు. నిర్మాణాలు పూర్తిచేసి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు మంజూరు కాలేదు. పథకం ప్రారంభ సమయంలో రైతుల వెంటపడిన అధికారులు ఇప్పుడేమో ముఖం చాటేస్తున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా గోకులం షెడ్ల నిర్మాణానికి సుమారు నాలుగు వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. ప్రతి మండలం నుంచి దాదాపు 40 మంది రైతులకుషెడ్ల నిర్మాణ అనుమతులిచ్చారు. ఇలా జిల్లాలో 1075 వరకూ నిర్మించాలన్నది అధికారుల లక్ష్యం కాగా, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో 1242 షెడ్లకు అనుమతులు మంజూరు చేశారు. వాటిలో 1,116 నిర్మాణాలు ప్రారంభించి 821 పూర్తి చేశారు. పైకప్పు, పునాది దశల్లో 295 వరకూ ఉన్నాయి. వీటికి సంబంధించి సుమారు రూ. 13 కోట్ల నుంచి రూ. 15 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. కేంద్రం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఒక్క పశు పోషకుడికి కూడా నగదు చెల్లించలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. దీంతో తాము కాళ్లరిగేలా ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా



ప్రయోజనం ఉండటంలేదని వారు వాపోతున్నారు.

**పశువుల సంఖ్యకు అనుగుణంగా..**

గోకులం పథకంలో భాగంగా రైతులు షెడ్లు నిర్మించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. పశువుల సంఖ్యకు అనుగుణంగా లబ్ధిదారులకు నిధులు మంజూరు చేస్తారు. అందులో 10 శాతం రైతు వాటాగా చెల్లించాలి. పశు సంవర్ధక శాఖ, ఉపాధి హామీ అధికారులు సంయుక్తంగా ఎంపిక చేశారు. భారీగా రాయితీ వస్తుందని చెప్పడంతో చాలామంది అప్పులు చేసి మరీ నిర్మించుకున్నారు. పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి బిల్లుల కోసం వారు ఎదురుచూస్తున్నారు.

**అన్నిచోట్లా అదే దుస్థితి**జిల్లావ్యాప్తంగా గోకులం నిర్మాణాలు చేసిన వారందరి పరిస్థితి దయనీయంగా మారింది. ఒంగోలు పరిధిలో 55 షెడ్లను పూర్తి చేయగా, లబ్ధిదారులకు రూ. 98.75 లక్షల మేర చెల్లించాల్సి ఉంది. సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో 140 వరకూ నిర్మించగా, రూ. 2.53 కోట్ల మేర బిల్లులు ఇవ్వాల్సి ఉంది. దీనిపై డ్వామా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ గోకులాలకు సంబంధించిన బిల్లులు త్వరలో విడుదల చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పది నుంచి పదిహేను రోజుల్లో అవి విడుదలయ్యే అవకాశముందన్నారు.

# రాచ'బాట'లు పడుతున్నాయ్..

పామూరు : ఉమ్మడి జిల్లాలోని సి.ఎస్.పురం, కనిగిరి, మర్రిపూడి, చీమకుర్తి, తాళ్లూరు, అద్దంకి, పొదిలి, జె.పంగులూరు ప్రాంతాలు కొత్తకళను సంతరించుకోనున్నాయి. బెంగళూరు–కడప–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే 544జీ ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంతో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. అనంతపురం జిల్లా కొడికొండ నుంచి ప్రకాశం జిల్లా మీదుగా బాపట్ల జిల్లాలోని ముప్పవరం జాతీయ రహదారి 16లో కలుస్తుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే మార్గం జిల్లాలో 129 కిలోమీటర్ల పరిధిలో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే జాతీయ రహదారి గట్టు (ఎంబ్యాంక్‌మెంట్) పనులు చాలాచోట్ల పూర్తికాగా, పలుచోట్ల వేగంగా సాగుతున్నాయి. అండర్‌పాస్‌లు, వంతెనల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయవాడ నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం తగ్గించడంతో పాటు, పారిశ్రామికవాడలు, మెట్రో సిటీలను కలపడమే లక్ష్యంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. మొత్తంగా 13 చోట్ల మాత్రమే రోడ్డులోకి ప్రవేశించేలా ప్రణాళిక రూపొందించి ఆయాచోట్ల పనులు చేస్తున్నారు. 2026 జూన్ నెల చివరి నాటికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ పూర్తిచేయాలన్నది లక్ష్యం. జిల్లా రహదారుల చిత్రం మారుతోంది. జగన్ ప్రభుత్వ హయాంలో కొత్తవి నిర్మించక.. ఉన్న వాటికి మరమ్మతులు చేయక.. వదిలేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రహదారులను మెరుగుపర్చింది. అదే సమయంలో బెంగళూరు–కడప–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, మైదుకూరు – సింగరాయకొండ జాతీయ రహదారుల నిర్మాణం చురుగ్గా సాగుతోంది.

**పూర్తికావొస్తున్న 167బీ రహదారి**

కడప జిల్లా మైదుకూరు నుంచి జిల్లాలోని సింగరాయకొండ వరకు రెండు వరుసల జాతీయ రహదారి 167బి నిర్మాణ పనులు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో చాలా వరకు పూర్తయ్యింది. మైదుకూరు రహదారి పూర్తికావడంతో పశ్చిమ ప్రాంతవాసులకు ఎంతో మేలు చేకూరుతోంది. అదేవిధంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కూడా పూర్తయితే జిల్లాలో రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది.

# అన్నదాత సుఖీభవ!

తాళ్లూరు: నిత్యం సమస్యలతో పోరాడే రైతులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. సాధారణ ఎన్నికలకు ముందు తెదేపా రథసారథి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతులకు తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని, ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. గతేడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తదుపరి వీరికి సాయం అందించేందుకు ప్రయత్నాలు ఆరంభించారు.

**కేంద్ర, రాష్ట్రాల సమన్వయ సాయం**

కేంద్రం ద్వారా మూడు విడతల్లో రూ. 6 వేలు ఆర్థిక సాయం అందించనుండగా, రాష్ట్రం తరపున మరో రూ. 14 వేలు కలిపి మొత్తం రూ. 20 వేలు పెట్టుబడి నిధిగా 'అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్' పేరిట అందించనున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవ్వడం, ఇదే సమయంలో ఖరీఫ్ ఆరంభమవుతుండడంతో ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. అన్నదాత.. సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు ఏటా రూ. 20 వేలు మూడు విడతల్లో అందిస్తారు. తొలి విడతగా ఈ నెల 20న రూ. 7 వేలు వంతున సాయం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం తెలిపారు. అర్హులైనవారి వివరాలను ప్రభుత్వానికి పంపించినట్లు డీఏవో శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాకు తొలి విడత కింద రూ. 176.099 కోట్ల మేర సాయం అందనుంది. ఆయా రైతుల నుంచి త్వరితగతిన బయోమెట్రిక్ తీసుకోవాలని మండల అధికారులు, వీఏఏలను డీఏవో ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే సాయం అందిస్తామని తెలిపారు.

చురకలు



# క్రీడాకారుల ఆశలపై నీళ్లు

గుంతకల్లు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకులు క్రీడాకారుల భవిష్యత్తుపై నీళ్లు చల్లారు. అప్పటికి ముందున్న తెదేపా ప్రభుత్వ హయాంలో సజావుగా సాగిన ఇండోర్ స్టేడియం పనులు వైకాపా ప్రభుత్వం రాగానే ఆగిపోయాయి. ప్రైవేట్ క్రీడా ప్రాంగణాల్లో క్రీడాకారులు అధిక ఫీజులు చెల్లించలేని పరిస్థితి కొనసాగుతోంది. నాటి పాలకులు క్రీడాకారుల ఉన్నతికి ఏమాత్రం కృషి చేయలేదు.

**రూ.2 కోట్లు కేటాయించినా..**

గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు. భాగ్యనగర్‌లోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పనులు చేపట్టారు. ఆయా పనులను గుత్తేదారుకు 2018 సంవత్సరం జనవరి 29న అప్పగించారు. త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు నిబంధన పెట్టారు. గుత్తేదారు గోడలు నిర్మించి పైకప్పు ఏర్పాటు చేసే సమయంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి పాలకులు పనులు ఆపేయాలని ఆదేశించారు. దీనికి తోడు అప్పటి వరకు చేసిన పనులకూ బిల్లులు చెల్లించలేదు. ఆరేళ్లుగా పనులు ఆగిపోయాయి.

ఇండోర్ స్టేడియం కట్టాలనుకున్న ప్రాంతంలో ముళ్లకంపలు, చెట్లు



ఏపుగా పెరిగిపోయాయి. స్టేడియం గోడలన్నీ దెబ్బతిని, ఇతరత్రా సామగ్రి తుప్పు పట్టి అధ్వానంగా మారాయి.

ఎస్ఎస్‌ట్యాంకు వద్ద మున్సిపాలిటీకి సంబంధించిన స్థలం ఉంది. దాన్ని ఓపెన్ స్టేడియం ఏర్పాటుకు కేటాయించాలని క్రీడాకారులు కోరుతున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ తదితర ఆటలు ఆడేందుకు స్టేడియం నిర్మించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని గుత్తేదారుడు పనులు ఆపేశాడు. కూటమి ప్రభుత్వం ఇండోర్ స్టేడియం పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యే విధంగా చూస్తాం. నవీన్, సహాయ కార్యనిర్వాహక ఇంజినీరు, గృహనిర్మాణ సంస్థ

# గుహలకు గుర్తింపు

నంద్యాల : ప్రపంచంలో రెండోది.. దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలూం గుహలకు గుర్తింపు వచ్చింది. కొలిమిగుండ్ల మండలంలో కొలువుదీరిన వీటిని భౌగోళిక వారసత్వ ప్రదేశంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. సుమారు 23 ఎకరాల భూమి లోపల ఏర్పడిన వీటిని క్రీ.పూ.450 ఏళ్ల కిందట నివాస స్థలాలుగా వినియోగించినట్లు చరిత్ర చెబుతోంది. హెచ్‌బీ ఫూటే అనే ఆంగ్లేయుడు 1884లో వీటిని కనుగొన్నారు.. తర్వాత 1982-84లో హెచ్‌డీ గేబర్ అనే జర్మనీ దేశస్థుడు తన సహచరులతో కలిసి 3,225 మీటర్ల వరకు శోధించి పటాన్ని తయారు చేశారు. 1988లో ఆంధ్రప్రదేశ్ పురాతత్వ శాఖ రక్షిత స్థలంగా ప్రకటించింది. 1999లో పర్యాటక శాఖ తమ ఆధీనంలోకి తీసుకొని అభివృద్ధి చేస్తోంది.

**ఎన్నెన్నో వింతలు**

బెలూం గుహలో 40 మెట్లు దిగిన తర్వాత 10 మీటర్ల లోతులో మొదలై 30 మీటర్ల లోతు వరకు సొరంగాలు ఉన్నాయి. ఇక్కడ కొన్నిచోట్ల ఇరుకుగా, మరికొన్ని చోట్ల విశాలంగా గదుల మాదిరిగా ఉంటుంది. కొన్నిచోట్ల స్టాలిక్‌టైట్ లైట్లు, స్మాల్ గేట్లు అని పిలిచే స్పటికాకృతులు ఏర్పడి ఉన్నాయి. కృత్రిమ శిలల ఆకృతులను బట్టి కొన్ని ప్రదేశాలకు 1,000 పడగలు, కోటి లింగాలు, ఐరావతం, ఊడలమర్రి, మాయామందిరం వంటి పేర్లు పెట్టారు. గాన ధ్యాన మందిరం, మండపం ఉన్నాయి.

గుహల చివరి వరకు వెళ్తే పాతాళగంగ అనే నీటి మడుగుతోపాటు అక్కడే రాతిలో ఉన్న శివలింగం కన్పిస్తాయి.

**చల్లని ప్రాంతం** గుహల లోపల ఏడాది పొడవునా 33 డిగ్రీల స్థిరమైన ఉష్ణోగ్రత ఉండటమే కాకుండా గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉ



ంటుంది. ఈ గుహలోని నీటికి సమీప గ్రామంలోని శివాలయం పక్కనున్న రాతి బావిలోని నీటి మట్టానికి సంబంధం ఉంది. 30 కి.మీ. దూరంలో తాడిపత్రి వద్దనున్న పెన్నా నది నీటిమట్టం కూడా దీనిపై ప్రభావం చూపుతోంది.

1999లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ తమ ఆధీనంలోకి తీసుకుని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది.


గుహలోని సొరంగ మార్గంలో ఒకటిన్నర కి.మీ. పొడవునా మట్టిదిబ్బలను తొలగించి నాపరాళ్లను పరిచి నడక దారిని ఏర్పాటు చేశారు. 150 విద్యుద్దీపాలతో కాంతులీనేలా మార్చారు. గుహ లోపలకు గాలిని పంపే బ్లోయర్లు ఏర్పాటు చేశారు.

ఏడాది పొడవునా వందలాది మంది విదేశీయులతోపాటు రెండు లక్షల మంది వరకు పర్యాటకులు వస్తున్నారు. పర్యాటక శాఖకు ఏటా రూ.1.50 కోట్ల వరకు ఆదాయం వస్తోంది.

**అభివృద్ధికి దోహదం**

భౌగోళిక వారసత్వ ప్రదేశంగా బెలూం గుహల్ని గుర్తించిన క్రమంలో వెయ్యి మందితో గుహల ప్రాంగణంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. తద్వారా గుహలకు మరింత ప్రచారం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.

# నిధుల కొరత.. సాగు నీరు వృథా



అనంతపురం: ఉమ్మడి జిల్లా సాగు నీటి ప్రాజెక్టుల నిర్వహణ కరవైంది. ఫలితంగా కీలకమైన మిడ్‌పెన్నార్, పేరూరు, యోగివేమన రిజర్వాయర్లలో నీటి వృథా అధికంగా ఉంటోంది. గత వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లపాటు నిర్వహణకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. కనీసం గేట్లకు గ్రీజు పెట్టలేని దుస్థితి. దీంతో ప్రధాన ప్రాజెక్టుల్లో గేట్లు దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పలు డ్యాంల్లో తాత్కాలిక పనులు చేశారు. పేరూరు డ్యాంలో మాత్రం గేట్ల పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో యుద్ధప్రతిపాదికన మరమ్మతు చేపడితే తప్ప సాగు నీరు వృథా అరికట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి.

**ఎట్టకేలకు పేరూరులో మరమ్మతులు**

పేరూరు ప్రాజెక్టును 2022లో వరదలు ముంచెత్తాయి గేట్లు ఎత్తి నీటిని వదిలారు. వరద తగ్గాక గేట్లు కిందకు దింపే క్రమంలో మూడో గేటు మొరాయించింది. ఈ క్రమంలోనే గేటు క్రస్టు విరిగిపోవడంతో దింపలేకపోయారు. ఫలితంగా ఆ ఏడాది నీరు వృథాగా నదిలోకి వెళ్లిపోయింది. మరమ్మతులకు రూ.1.20 కోట్లకు ప్రతిపాదనలు పంపగా అప్పటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి సర్కారు రాగానే నిధులు విడుదల చేయడంతో ఆరు గేట్ల మరమ్మతులు పూర్తి చేశారు. 6, 8 గేట్లు మరమ్మతులు మిగిలి ఉన్నాయి. జులై 15 నాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి లీకేజీ అరికడతామని అధికారులు చెబుతున్నారు.

**మొరాయిస్తున్న గేట్లు**

తుపాను కారణంగా 2021, నవంబరులో యోగివేమన ప్రాజెక్టులో భారీగా వరద చేరింది. నీరు విడుదల చేసేందుకు ప్రయత్నించగా 5, 6, 7, 8 గేట్లు మొరాయించాయి. మిగిలినవి ఎత్తి నీటిని వదిలేశారు. గేట్ల పైనుంచి నీరు ప్రవహించింది. తర్వాత అధికారులు ఎంతో కష్టపడి అన్ని గేట్లు ఎత్తారు. అప్పటి నుంచి గేట్లు మరమ్మతుకు నోచుకోలేదు. గత వైకాపా ప్రభుత్వం నిర్వహణకు రూపాయి ఇవ్వలేదు. రూ.4 కోట్లకు ప్రతిపాదనలు పంపగా ఆమోదం పొందలేదు. ప్రాజెక్టు కింద 12 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.

**దక్షిణ కాలువ దుస్థితి పట్టదా?**

మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ దక్షిణ కాలువకు సంబంధించి మూడు షట్టర్లు ఉండగా.. రెండింటిలో రబ్బర్లు నాలుగేళ్ల కిందటే దెబ్బతిన్నాయి. మరమ్మతుల కోసం 2022లోనే అధికారులు అప్పటి ప్రభుత్వానికి రూ.3.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తాత్కాలిక మరమ్మతుకు రూ.20 లక్షలు అవసరమని తెలిపినా ఇవ్వలేదు. దీంతో డ్యాంలో డెడ్ స్టోరేజీ కంటే దిగువకు నీరు చేరింది. గతేడాది అధికారులే చిన్నపాటి మరమ్మతులు చేయించి లీకేజీలు అరికట్టారు. మూడో షట్టర్ రబ్బరు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. గేట్లు తరచూ మొరాయిస్తున్నాయి. ప్రాజెక్టు నిండితే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని.. మరమ్మతుల కోసం రూ.5 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ సురేంద్రరెడ్డి తెలిపారు. ఈ డ్యాం కింద ఆయకట్టు లక్ష ఎకరాలు ఉంది.

# సర్కారు బడులకు సన్నబియ్యం



అనంతపురం : కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలవుతున్న ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు సన్నబియ్యం సరఫరాకు చర్యలు తీసుకుంది. ఈ ఏడాది నుంచే ప్రభుత్వ బడులకు నేరుగా సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే పౌరసరఫరాల గోదాములకు బియ్యం ప్యాకెట్లు (25 కిలోలు) తరలించి సిద్ధం చేశారు. తక్షణమే అన్ని విద్యాలయాలకు బియ్యం చేరేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**పాత నిల్వలే..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు గోదాముల్లో నిల్వ చేసిన బియ్యం కార్డుదారులతోపాటు విద్యాలయాలకు సరఫరా చేసేవారు. వాటితో వండిన అన్నం విద్యార్థులు తినలేక పారేసేవారు. విద్యార్థులు చాలామంది ఇళ్లకు వెళ్లి తినేవారు. మధ్యాహ్న భోజనం పథకం పెద్ద ప్రయోజనం లేకపోయింది. గోదాముల నుంచి డీలర్లకు ఇచ్చేవారు. డీలర్ల నుంచి ఉపాధ్యాయులు పాఠశాలలకు తీసుకొచ్చేవారు. మధ్యలో డీలర్లు, గోదాము నిర్వాహకులే తూకాలు తక్కువ ఇచ్చేవారు. రవాణా ఖర్చులు కూడా భరించలేకపోయేవారు. ఈ లోపాలన్నీ గుర్తించిన ప్రభుత్వం బడులకు సన్నబియ్యాన్ని నేరుగా పాఠశాలలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈమేరకు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. క్యూఆర్ కోడ్, ట్యాగు వేసి 25 కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం సంచులు సరఫరా చేయనున్నారు. తద్వారా ప్రధానోపాధ్యాయులకు కష్టాలు తీరనున్నాయి.

**నెలకు 1,010 టన్నుల బియ్యం సరఫరా**

పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి నాణ్యమైన సన్నబియ్యాన్ని 25 కిలోలు సంచి ప్యాకింగ్ చేసి సరఫరా చేయనున్నారు. జిల్లాలో 1,715 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలున్నాయి. 183 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఈ నెలకు సరిపడా మొత్తం 25,259 ప్యాకెట్లు (1,010.36 టన్నులు అవసరమని లెక్కగట్టారు. అందులో ప్రభుత్వ పాఠశాలలకు 15,226 ప్యాకెట్లు (25 కిలోలు), వసతి గృహాలకు 10,033 ప్యాకెట్లు చొప్పున కేటాయించారు. వచ్చే నెల నుంచి కాస్త మరింత బియ్యం కోటా పెరిగే అవకాశం ఉందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్‌రెడ్డి, సహాయ మేనేజర్ జెన్నేప్రసాద్ తెలిపారు.

**సమగ్ర వివరాలు తెలుసుకునేలా..**

ప్రభుత్వ బడులకు సరఫరా చేసే సన్నబియ్యం ప్యాకెట్లు సంచులపై ఎక్కడా నాయకుల ఫొటోలు ముద్రించలేదు. సంచికి ఒకవైపున ప్రభుత్వ లోగో ముద్రించారు. విద్యార్థులు చిత్రాలు, జాతీయ పతాకం ఉన్న బడిని ముద్రించారు. మరోవైపు రైతు ఫొటోతోపాటు బియ్యంలో పోషక విలువలు, 1967 టోల్‌ఫ్రీ నంబరు, ఫోర్టిఫైడ్ బియ్యం బయట అమ్మితే శిక్షించడం జరుగుతుందని ముద్రించారు. 25 కిలో బస్తాను క్యూఆర్ కోడ్ జతచేశారు. ఈ కోడ్ స్కాన్ చేస్తే ధాన్యం పండించిన రైతుల వివరాలు, నాణ్యత పరిశీలించిన సిబ్బంది వివరాలు తెలిసేలా బియ్యం సంచులు ముద్రించారు.

# అనువుగాని స్థలాలు.. అటకెక్కిన పట్టాలు



పుట్టపర్తి: పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ ఎన్నికల ముందు హడావుడి చేసిన వైకాపా నాయకులు... జగన్ పుట్టినరోజు సందర్భంగా ఇచ్చిన సుమారు 2 వేల ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందకుండా అటకెక్కాయి. అందరికీ ఇల్లు అంటూ అప్పటి యంత్రాంగం అనువుగానిచోట స్థలాలు చూపి చేతులు దులుపుకొంది. 2023, డిసెంబరు 21న పట్టాలు పంపిణీ చేపట్టారు. కదిరి మున్సిపాలిటీ పరిధిలో ఐదు ప్రాంతాలను ఎంపిక చేసి.. అప్పటి వాలంటీర్లతో కొలతలు వేయించి.. హద్దురాళ్లు నాటించారు. అధికారులు, వైకాపా నాయకులు లబ్ధిదారుల ఎంపిక, భూసేకరణలో పారదర్శకతకు పాతరేశారన్న విమర్శలున్నాయి. ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూశాఖ సమాచారం ఇవ్వడం పరిపాటి. వచ్చిన దరఖాస్తులను సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేస్తారు. తరువాత అవసరమైన భూమి సేకరించి.. పట్టాలు పంపిణీ చేస్తారు. ఈ విధానంగా పాటించకుండా అప్పటి అధికార పార్టీ నాయకులు సిఫార్సు చేసిన వ్యక్తులనే లబ్ధిదారులుగా ఎంపిక చేసి స్థలాలు కట్టబెట్టారు.

**వివాదాల్లో..:** కుటాగుళ్ల రెవెన్యూ గ్రామంలోని సర్వేనంబరు 41 గుట్టలో దాదాపు 300 మందికి, మూర్తిపల్లిలో సర్వే నంబరు 21లోని యూఏడబ్ల్యూ భూమిలో 400 మందికి పట్టాలు సిద్ధం చేశారు. మరో మూడుచోట్ల వివాదాల్లో ఉన్న స్థలాలు ఇచ్చారు. ఇలాంటిచోట నివేశ స్థలాలు ఇవ్వకూడదన్న రెవెన్యూ నిబంధనను పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకులు నాటి ముఖ్యమంత్రి మెప్పు కోసం అలా చేశారు. **ఎన్నికల నియమావళి సాకుగా..**

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందంటూ 2024లో లబ్ధిదారుల నుంచి పట్టాలు వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుతం పట్టాలన్నీ రెవెన్యూ కార్యాలయాల్లోనే మగ్గుతున్నాయి. సొంత ఇంటి కలనెరవేరుతుందన్న ఆశలు అడియాసలయ్యాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం.. స్థలాలు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

మురళీకృష్ణ, తహసీల్దారు, కదిరి పట్టాలను లబ్ధిదారుల నుంచి ఎందుకు వెనక్కి తీసుకున్నారో పూర్తి సమాచారం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

# పేదల భూముల్లో 'భూ'తాలు

కర్నూలు : పేదల భూములు కొట్టేసిన వైకాపా 'భూ'తాలపై చర్యలు కానరావడం లేదు. 'కూటమి' ప్రభుత్వం వచ్చి ఏడాదైనా రెవెన్యూ శాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై నిజమైన యాజమాన్య హక్కులు కలిగిన రైతులు నష్టపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 2023లో ఎసైన్డ్ భూముల చట్టానికి సవరణలు జరిగాయి. పేదలకు ఎసైన్డు చేసిన భూముల కాలపరిమితి 20 ఏళ్లు దాటి ఉంటే వాటిని నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగించి శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించేలా చట్ట సవరణ చేశారు. ఈ జీవోను ప్రామాణికంగా తీసుకొని ఎసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేయాలి. ఆ తర్వాత ఆ భూములను రైతుల పేరున మార్చాలి. ఈ చట్ట సవరణను అడ్డుపెట్టుకొని జగన్ సర్కారులోని పెద్దలు భూ దందాకు పాల్పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా ఫ్రీహోల్డ్ చేశారు. కూటమి ప్రభుత్వం పది నెలల కిందట ఆ భూములపై పరిశీలన చేపట్టింది. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పేదల భూములను కొట్టేసిందెవరు.. సహకరించిన అధికారులెవరో తేలిపోయింది.

**రెవెన్యూ శాఖ అలసత్వం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం ఫ్రీహోల్డ్ భూముల్లో సుమారు 40 వేల ఎకరాలకు నిబంధనలను విరుద్ధంగా యాజమాన్య హక్కులు కల్పించారు. ఫ్రీ హోల్డ్ తర్వాత బినామీ, అక్రమ లావాదేవీలతో ముడిపడిన భూముల రిజిస్ట్రేషన్లు ఆపేయాలి. ఈ విషయంలో రెవెన్యూ శాఖ తీవ్ర తాత్సారం చేస్తోంది. మరోవైపు అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలకు ఉపక్రమించిన దాఖలాలు లేవు. ఇంతవరకు రెవెన్యూ శాఖ నుంచి ఏ ఒక్క చిన్న ప్రయత్నం చేయకపోగా.. మొత్తం ఎసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించారు. ఫలితంగా చట్టబద్ధంగా నిజమైన హక్కుదారుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎవరు తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకోకుండా అందరికీ నిషేధం వర్తింపజేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఆధారాల్లేకుండానే ఆన్‌లైన్**

ఎసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా కర్నూలు జిల్లాలో 2,033 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 14,212 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసి యాజమాన్య హక్కులు కల్పించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా 21,853.22 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు.

ఉమ్మడి జిల్లాలో సుమారు 63 వేల ఎకరాలను నిబంధనలకు లోబడి ఫ్రీహోల్డ్ చేశారని రెవెన్యూ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ భూముల్లో అత్యధిక శాతం ఎకరా, రెండు ఎకరాలున్న రైతులే ఉన్నారు. వారందరికీ చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేసే హక్కులున్నాయి. అక్రమార్కులున్నారనే పేరిట అందరికీ నిషేధం వర్తింపజేసి పది నెలలైంది. నిషేధం కారణంగా అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.

**తాఖీదులతో సరిపెట్టారు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4 వేల ఎకరాలకుపైగా రిజిస్ట్రేషన్లు జరగ్గా.. అందులో 3 వేల ఎకరాలు నిబంధనల మేరకు.. సుమారు వెయ్యి ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయి. ఫ్రీహోల్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు జారీ చేసిన జీవోను తుంగలో తొక్కి వైకాపా పెద్దలు సమారు 40 వేల ఎకరాలకు నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్య హక్కులు కల్పించుకున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 29 మండలాల తహసీల్దార్లు వైకాపా పెద్దలకు సహకరించినట్లు కూటమి ప్రభుత్వ పరిశీలనలో వెల్లడైంది. ఆ 29 మంది తహసీల్దార్లకు మూడు నెలల కిందట తాఖీదులతో సరిపెట్టారు.

# 'కే'ఛీ' దారి విస్తరణ

నందికొట్కూరు : కర్నూలు-గుంటూరు(కేజీ) రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. చేసిన పనుల్లో నాణ్యత తేలిపోయింది. కర్నూలు నుంచి గార్గేయపురం, బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరు మీదుగా ఆత్మకూరు.. దోర్నాల సెక్షన్ వరకు 66.115 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల 340సి జాతీయ రహదారి పనులు చేపట్టారు. 2023 నుంచి 2025 అక్టోబరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఫేస్-1 కింద రూ.587 కోట్లు, ఫేస్-2 కింద రూ.591 కోట్లు కలిపి రెండు ప్యాకేజీల్లో మొత్తం రూ.1,179 కోట్ల విలువైన పనులను గుత్తేదారులకు అప్పగించారు. రెండో ప్యాకేజీలో భాగంగా తర్తూరు అంచె నుంచి ఆత్మకూరు వరకు చేస్తున్న సుమారు 36 కి.మీ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

**కొన్నాళ్లకే కుంగింది**

మొదటి ప్యాకేజీ కింద ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా సమీపం నుంచి జూపాడుబంగ్లా మండలం తర్తూరు అంచె వరకు చేపట్టిన పూర్తయ్యాయి. కొన్నాళ్లకే పలుచోట్ల రోడ్డు కుంగింది. కోతకు గురైంది. ఇరువైపులా వర్షంనీళ్లు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీలు



చెదిరిపోయి ఛిద్రమయ్యాయి. ఇటీవల ఈ పనులను పరిశీలించిన ర.భ.శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆగ్రహ వ్యక్తం చేశారు.

**గడువు గడబిడ**

పనులన్నీ 2025 డిసెంబరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది. మిగిలిన పనులన్నీ ఆరు నెలల్లోగా పూర్తి చేయాల్సింది. ఇప్పటికే వర్షాలు మొదలయ్యాయి. నిర్మాణాలు పూర్తి చేసేందుకు తక్కువ సమయం ఉండటంతో హడావుడిగా చేస్తున్నారు. పనుల్లో ఏమాత్రం నాణ్యత ఉండటం లేదు. జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల్లో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ఎస్సార్బీసీ ఎర్రబిలుకు వాడుతున్నారు. ఆయా పనుల్లో నాణ్యతపై స్థానికులు, నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు

**వంతెనలు అంతేనా**

ప్రస్తుతం జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల్లో రెండో ప్యాకేజీ పనులు కొనసాగుతున్నాయి. ఆయా మండలాల్లో సుమారు 26 కి.మీ మేర రోడ్డు వేస్తున్నారు. జూపాడుబంగ్లా మండలంలో నాలుగు వరుసల రహదారి పనులు గ్రామాల వెలుపల చేపట్టారు. పాములపాడు మండలంలో మాత్రం రుద్రవరం, కృష్ణారావుపేట, ఎర్రగూడూరు గ్రామాల మీదుగా రహదారి వెళ్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో స్థానికులకు ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ వంతెనలు నిర్మిస్తున్నారు.

జూపాడుబంగ్లా మండలం పరిధిలో చేపట్టిన పనులు సుమారు 60 శాతం పూర్తయ్యాయి. తాటిపాడు గ్రామం సమీపాన కేసీ కాల్వపై వంతెన, 80-బన్నూరు గ్రామం సమీపంలో ఆరు వంతెనలు నిర్మించాల్సి ఉంది. పాములపాడు శివారులోని పోలీస్ క్వార్టర్స్ సమీపాన పనులు నిలిచిపోయాయి. రుద్రవరం, కృష్ణారావుపేట, ఎర్రగూడూరు గ్రామాల్లో ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించాల్సి ఉంది. పాములపాడు సమీపాన టోల్‌గేట్ ఏర్పాటు పనులు సాగుతున్నాయి.

## ఇక్కడ రిజెక్ట్ చేశారని ఆగిపోలేదు..

బాలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ హీరోయిన్లలో విద్యా బాలన్ కూడా ఒకరు. ఆమె రీసెంట్ లో ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కెరీర్ స్టార్టింగ్ లో సౌత్ సినీ ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను వివరించిన సంగతి తెలిసిందే. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తో తాను చేయాల్సిన చక్రం సినిమా పర్మినెంట్ గా ఆగిపోవడంతో అందరూ తనను అపశకునంగా భావించారని ఆమె తెలిపారు. దాని వల్ల రాత్రికి రాత్రే ఆమె తొమ్మిది సినిమాలను ఎలా కోల్పోయారో కూడా ఆ ఇంటర్వ్యూలో చెప్పారు. అలా తనపై అన్యాయంగా అపశకునం అని వేసిన ముద్ర తనకు తీవ్ర గాయాన్ని



మిగిల్చిందని, కానీ ఎలాగైనా సినిమాలు చేసి సక్సెస్ అవాలనే దృఢ సంకల్పం వల్ల తాను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నట్టు ఆమె తెలిపారు. ఆ దృఢ సంకల్పమే తనను ఇండియన్ సినిమాలో ఓ గొప్ప రూట్ ను ఏర్పరచుకోవడానికి ఉపయోగపడిందని ఆమె వెల్లడించారు. మొదటిగా విద్యా బాలన్ తన యాక్టింగ్ కెరీర్ ను సౌత్ లో మొదలుపెట్టారు. అప్పటివరకు తమిళ, మలయాళ సినిమాల్లో నటించిన విద్యా బాలన్ సైన్ చేసిన చక్రం సినిమా అనుకోకుండా ఆగిపోవడంతో సౌత్ ఇండస్ట్రీ ఆ నిందను ఆమెపై వేసి నిందించడంతో క్రమంగా విద్యాకు సౌత్ లో అవకాశాలు రావడం తగ్గిపోయాయి. విద్యాకు టాలెంట్ ఉన్నప్పటికీ ఆమె ప్రాజెక్టులోకి వస్తే ఆ దురదృష్టం తమకెక్కడ వస్తుందోననే భయంతో ఫిల్మ్ మేకర్స్ ఆమెను తీసుకోవడానికి వెనుకడుగేశారు. అయినా సరే విద్యా బాలన్ వెనుకడుగేయలేదు.

ఆ ఎదురుదెబ్బను తట్టుకుని తన ఫోకస్ ను బాలీవుడ్ వైపు మళ్లించారు. 2005లో పరిణీత అనే సినిమాతో బాలవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విద్యా బాలన్, ఆ సినిమాతో ఎన్నో గొప్ప ప్రశంసలు అందుకున్నారు. దాని తర్వాత కహానీ, తుమ్హారీ సులు, శకుంతలా దేవి లాంటి సినిమాల్లో ఎంతో పవర్‌ఫుర్ నటనతో నటిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. సౌత్ ఇండస్ట్రీ మొత్తం తనకు నో చెప్పినా బాలీవుడ్ కు వెళ్లి నటిగా తానేంటే ప్రూవ్ చేసుకుని టాలెంట్, హార్డ్ వర్క్ ఉంటే ఎప్పటికైనా కెరీర్ లో రాణిస్తారని తెలిపారు.

## అనుష్క ఇదేం కరెక్ట్ కాదమ్మీ..!

స్వీటీ అనుష్క ఘాటి సినిమా కోసం ఆమె ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా వెయిట్ చేస్తున్నారు. క్రిష్ డైరెక్షన్లో తెరకెక్కుతున్న ఈ సినిమా అసలైతే ఏప్రిల్ సెకండ్ హాఫ్ రిలీజ్ చేయాలని అనుకున్నారు కానీ సినిమా పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారు. యువి క్రియేషన్స్ బ్యానర్ లో రూపొందుతున్న ఘాటి సినిమా విషయంలో మేకర్స్ నుంచి కూడా ఎలాంటి అప్డేట్స్ రావట్లేదు. నిశ్శబ్ధం తర్వాత నాలుగేళ్లు గ్యాప్ ఇచ్చిన అనుష్క లాస్ట్ ఇయర్ మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టిలో నటించింది. ఆ సినిమా సక్సెస్ అయినా కూడా అనుష్క మళ్లీ వరుస సినిమాలు చేయట్లేదు. అనుష్క ఎందుకు ఇలా చేస్తుంది అనుకోవడం ఫ్యాన్స్ వంతు అయ్యింది. పోనీ కమిటైన క్రిష్ ఘాటి సినిమాకైనా అడిగిన డేట్స్ ఇస్తుందా అంటే సినిమా ఎప్పుడు పూర్తవుతుందా అన్నట్టుగా ఉందట. అనుష్క ఇంట్రెస్ట్ లేకుండానే



సినిమాలు చేస్తుందా అనుకుంటున్నారు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా అదరగొట్టిన అనుష్క కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ సినిమాలను చేస్తూ వచ్చింది. అరుంధతి, రుద్రమదేవి లాంటి సినిమాలు చేయాలంటే అనుష్క వల్లే అవుతుందని ప్రూవ్ చేసుకుంది. ఐతే బాహుబలిలో కూడా ఆమె తన అందంతో మెప్పించింది. ఐతే తన లుక్స్ వైజ్ ఇంకా ఇదివరకులా లేదన్న కారణం చేతనే అనుష్క సినిమాలు చేయట్లేదు. ఐతే క్రిష్ సినిమా ఎలాగు చివరి దశకు వచ్చింది కాబట్టి దాన్ని పూర్తి చేసి నెక్స్ట్ ఏం చేయాలి అన్నది చూస్తుందట. ఘాటితో పాటు అనుష్క ఒక మలయాళ సినిమాకు కూడా సైన్ చేసింది. ఆ సినిమా ఎంతవరకు వచ్చిందో కూడా తెలియాల్సి ఉంది. అనుష్క ఎందుకు ఇలా చేస్తుంది.. ఆమె కెరీర్ గ్యాప్ కి అసలు రీజన్స్ ఏంటన్నది తెలియాల్సి ఉంది. ఘాటి సినిమా టీజర్ తో సర్ ప్రైజ్ చేసిన అనుష్క మళ్లీ తిరిగి ఫాంలోకి వస్తుందని అనుకున్నారు. కానీ సినిమాని లేట్ చేస్తూ ఆడియన్స్ లో ఉన్న ఇంట్రెస్ట్ ని కోల్పోయేలా చేస్తున్నారు. ఘాటి పూర్తైతే కానీ అనుష్క నెక్స్ట్ సినిమాల గురించి అప్డేట్ వచ్చే ఛాన్స్ ఉంటుంది. తెర మీద అనుష్కని మిస్ అవుతున్న ఆమె ఫ్యాన్స్ మాత్రం ఎప్పుడొచ్చినా ఆమెను ఎంకరేజ్ చేసేందుకు రెడీగా ఉన్నారు. ఘాటి తర్వాత అనుష్క సినిమాలు చేసినా కాస్త స్పీడ్ గా చేస్తే బాగుంటుందని అంటున్నారు.




## ప్రభాస్.. ఇంతకంటే ఏం కావాలి!



పాన్ ఇండియా స్టార్‌గా ప్రభాస్ క్రేజ్ రోజు రోజుకీ పెరిగిపోతుంది. దేశవ్యాప్తంగా ఫ్యాన్ బేస్ కలిగిన ఈ రెబల్ స్టార్ సినిమా ఎంపికలో హై లెవెల్ ను చూపిస్తూనే.. ప్రతిసారి కొత్తగా ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. బాహుబలి తర్వాత ప్రభాస్ ఫేమ్ మరో లెవెల్‌కి వెళ్లినా.. సినిమాల రిజల్ట్, లుక్స్ విషయంలో మాత్రం కొంత విమర్శలు ఎదురయ్యాయి. కానీ ఇప్పుడు అతడి తాజా లుక్ చూసిన అభిమానులు "ఇదే మన ప్రభాస్" అంటూ సంబరపడిపోతున్నారు. వరుసగా సాహెూ, రాధే శ్యామ్, ఆదిపురుష్ చిత్రాల్లో ప్రభాస్ లుక్స్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో "ప్రభాస్ మొహంలో ఓల్డ్ ఛామ్ కనిపించట్లేదు", "వెయిట్ మించినట్టుంది" అంటూ ట్రోల్స్ కూడా చోటుచేసుకున్నాయి. ఈ లోపు సలార్ సినిమాలో మాత్రం కాస్త మెరుగైన రెస్పాన్స్ వచ్చి ఊపిరి పీల్చుకునేలా చేసింది. అయినా పర్ఫెక్ట్ స్టైల్, చక్కని హెయిర్‌కట్, క్లీన్ షేవ్ లాంటి లుక్స్ చూసే భాగ్యం దక్కలేదు. అయితే తాజాగా బాహుబలి రీయూనియన్ సందర్భంగా కనిపించిన ప్రభాస్ లుక్ మాత్రం ఫ్యాన్స్‌ను ఫుల్ ఖుషీ చేసింది. షేవ్ చేసిన గడ్డం, స్టైలిష్ హెయిర్‌తో కనిపించిన ప్రభాస్.. " మన మిర్చి డేస్ ప్రభాస్" అంటూ కామెంట్లు తెచ్చుకున్నాడు. ఇక ట్రెండింగ్‌లో ఉన్న ఈ లుక్ ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. చాలా మంది ఫ్యాన్స్‌కు ఇది ఓ సర్‌ప్రైజ్‌లా మారింది. ఈ లుక్ ప్రస్తుత ఫౌజీ సినిమాలో ప్రభాస్ చేస్తున్న పాత్ర కోసమేనన్న టాక్ వినిపిస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన లుక్‌కి తగినట్లుగానే ప్రభాస్ బాడీ లాంగ్వేజ్, స్టైల్ మార్చుకున్నట్టు తెలుస్తోంది. హను తన సినిమాల్లో హీరోలను చాలా స్టైలిష్‌గా, అందంగా చూపించే విషయంలో స్పెషలిస్టే. ఆయన గత సినిమాల్లోనూ అదే కనిపించింది. ఇక రాజాసాబ్ షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. ఒక పాట, కొన్ని సీన్లు మినహాయిస్తే షూటింగ్ పూర్తి చేసినట్టు సమాచారం. ఆ తర్వాత వంగా దర్శకత్వంలో రూపొందే స్పిరిట్ కోసం గడ్డం లుక్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. అయితే ఫౌజీ లుక్‌లో కనిపించిన ప్రభాస్‌ని చూసి "ఈ లుక్‌ను కంటిన్యూ చేయాలి" అనే డిమాండ్ ఫ్యాన్స్ నుంచి వస్తోంది. మొత్తానికి ప్రభాస్ లేటెస్ట్ లుక్ చూసిన ఫ్యాన్స్.. "ఇంతకంటే బెటర్ లుక్ మేమేమీ కోరం" అంటూ కామెంట్లు పెడుతున్నారు. గత ట్రోల్స్‌కి పూర్తిగా బదులిచ్చేలా ప్రభాస్ లుక్ మారిందన్న ఫీల్‌తో అభిమానులు ఆనందంగా ఉన్నారు.

## మహావతార్ నరసింహా ట్రైలర్..!




సిల్వర్ స్క్రీన్ పై పురాణ ఇతిహాసాలు తెలిపే విషయంలో సినీ మేకర్స్ ఎప్పుడు ముందుంటారు. ఈమధ్య ఆధ్యాత్మిక సినిమాలకు కథలను ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూ వాటి ద్వారా మంచి సక్సెస్ అందుకుంటున్నారు. ఈ క్రమంలో పాన్ ఇండియా రేంజ్ లో భారీ సినిమాలు చేస్తున్న హెూంబలే బ్యానర్ నుంచి ఒకేసారి ఐదు సినిమాలు రానున్నాయి. ఈ సినిమాలు అన్నీ కూడా యానిమేషన్ రూపంలో వస్తున్నాయి. ఈ సినిమాల్లో మొదటిది మహావతార్ నరసింహా ముందు రిలీజ్ చేస్తున్నారు. మహావతార్ నరసింహా ట్రైలర్ ని లేటెస్ట్ గా రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మూవీని అశ్విన్ కుమార్ డైరెక్ట్ చేస్తున్నారు. హెూంబలే ప్రొడక్షన్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుషాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. మహావతార్ నరసిం హా ట్రైలర్ తో బ్రహ్మ వరం పొందిన హిరణ్యకశ్యపుడి ఎదుట నరసింహ నామంతో నిలబడతాడు ప్రహ్లాదుడు. ఆ టైంలో హిరణ్యకశ్యపుడు కోపోద్రక్తుడై ప్రహ్లాధున్ని శిక్షిస్తాడు. ప్రహ్లాద భక్తికి మెచ్చిన నారాయణుడు నర సింహావతారం లో ప్రత్యక్షమై హిరణ్యకశ్యపుడిని అంతం చేస్తాడు. నర సింహావతారమైన ఈ కథనే మరోసారి తెర మీద అద్భుతమైన విజువల్స్ తో చూపించనున్నారు. ట్రైలర్ లో విజువల్ ఎఫెక్ట్స్ బాగున్నాయి. ఐతే యానిమేషన్ సినిమా కాబట్టి ఆడియన్స్ ని ఎంతవరకు రీచ్ అవుతుంది అన్నది చూడాలి. ఈ సినిమా ఈ నెల 25న రిలీజ్ చేస్తున్నారు. హెూంబలె బ్యానర్ నుంచి వస్తున్న సినిమా కాబట్టి మహావతార్ నరసిం హా కూడా భారీ రిలీజ్ ఉండే అవకాశం ఉంది. ఈ సినిమాను కూడా పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. తెలిసిన కథ అయినా కూడా తెర మీద ప్రేక్షకుడిని మెప్పించేలా చేస్తే అద్భుతాలు చేయొచ్చు. ప్రహ్లాదుడి కథ అందరికీ తెలుసు.. ఐతే సిల్వర్ స్క్రీన్ పై ఈ కథను విజువల్ వండర్ గా చెబుతున్నారు. అందుకే మహావతార్ నరసిం హా మీద ఎక్కువ బజ్ ఏర్పడింది. ట్రైలర్ కూడా ఆసక్తికరంగా ఉంది కాబట్టి సినిమా జనాలకు నచ్చితే మంచి సక్సెస్ సాధించే అవకాశం ఉంటుంది.

## డెనిమ్స్‌లో మీనాక్షి సోయగాలు

అందంతో కవ్విస్తుంది.. ఫ్యాషన్ సెన్స్‌తో మురిపిస్తుంది. కాంపిటీషన్ ఎంత ఉన్నా, తననే ప్రజల కళ్లు వెంబడించే సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలుస్తుంది. ఈ భామలో మల్టీ ట్యాలెంట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంతకీ ఎవరీ ముద్దుగుమ్మ? అంటే.. నిస్కంకోచంగా మీనాక్షి చౌదరి గురించే ఇదంతా. ఇప్పుడు మీనాక్షి బ్లూ డెనిమ్స్ లో గుబులు రేపే ఫోజులతో చెలరేగిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ కుర్రకారు కంటికి కునుకుపట్టనీకుండా చేస్తోంది. మీనాక్షి బ్లూ అండ్ బ్లూ డెనిమ్ లుక్ లో ఎంతో సూపర్భ



గా కనిపిస్తోందంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. మీనాక్షి తన చేతికి బరువైన గాజులు, చెవికి కాంబినేషన్ జూకాల్ని ధరించి సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. వెంకీతో సంక్రాంతికి వస్తున్నాం,

మహేష్‌తో గుంటూరు కారం లాంటి భారీ చిత్రాల్లో నటించిన మీనాక్షి చౌదరి, టాలీవుడ్ కోలీవుడ్ లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది. హిట్ ది సెకండ్ కేస్, గోట్, లక్కీ భాస్కర్ లాంటి క్రేజీ చిత్రాల్లోను మీనాక్షి నటించింది. ఈ భామ నాగచైతన్య సరసన ఓ చిత్రంలో నటిస్తోంది. అలాగే అనగనగా ఒక రోజు అనే చిత్రంలోను నటిస్తోంది. ఈ రోజుల్లో ఇండస్ట్రీలో నెగ్గుకు రావాలంటే, యూనిక్ నెస్ తో దూసుకురావాలని చెప్పే మీనాక్షి తనదైన యూనిక్ నెస్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## టాప్ లెస్ ఫోజులో గుబులు రేపిన సోనమ్

ఈ భూప్రపంచంలో ఎన్నో సంస్కృతులు, ప్రాంతాన్ని బట్టి, దేశాన్ని బట్టి.. భాష వేషం సంస్కృతి ప్రతిదీ మారిపోతాయి. అలాగే ఈజిప్షియన్ కల్చర్ లో అత్యంత పురాతనమైన సంస్కృతి.. అక్కడి సమాధులు నిర్మాణాలు, వాటి వెనక కథలు ప్రజల హృదయాల్లో పాతుకుపోయాయి. మమ్మీ, మమ్మీ 2 సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విడుదలై సంచలన విజయం సాధించడం వెనక ఈజిప్ట్ కల్చర్ లో దాగి ఉన్న పురాణేతిహాస కథలు, పాత్రల యూనివర్సల్ అప్పీల్ ఒక కారణం అనడంలో సందేహం లేదు. చూస్తుంటే, ఇక్కడ భారతీయ ఫ్యాషనిస్టా సోనమ్ కపూర్ ఈజిప్ట్ టోంబ్ నుంచి నిదుర లేచిన మమ్మీ లా కనిపిస్తోంది. ఆ నుదుటిన భారీతనం నిండిన పాపిడి బొట్టులాంటి ఆ హారం.. ఇన్నర్ ఏదీ ధరించకుండా డ్యాషింగ్ టాప్ లెస్ ఫోజుతో




సోనమ్ తాజా ఫోటోషూట్ లో కట్టి పడేసింది. 39ఏళ్ల బ్యూటీ గ్లామర్ క్వీన్ ని తలపించింది. ఈ లుక్ చూడగానే గోల్డెన్ గాళ్ సోనమ్ అదిరిపోయింది అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. సోనమ్ కపూర్ అందాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

ఈ ఫ్యాషనిస్టా 14వ సారి వోగ్ ఇండియా కవర్ గర్ల్‌గా మెరుపులు మెరిపించింది. మేకప్ ఆర్టిస్ట్ నమ్రతా సోని సోనమ్ లుక్ ని డిజైన్ చేయగా, అది తన స్థాయిని అమాంతం పదింతలు పెంచింది. ఈ రూపం కోసం ఎంపిక చేసుకున్న మేకప్, వస్త్రాభరణాలు ప్రతిదీ వేటికవే ప్రత్యేకం. సోనమ్ కపూర్ గోల్డెన్ గర్ల్ స్టైల్, గ్లామ్ అవతార్ యువతరం హృదయాలను సున్నితంగా టచ్ చేసింది.

వీరే ది వెడ్డింగ్, ఏకే వర్సెస్ ఏకే, బ్లైండ్ వంటి చిత్రాలలో నటించాక, సోనమ్ నటనకు దూరంగా ఉంది. ప్రస్తుతం భర్తతో కలిసి విదేశాల్లో వ్యాపారాలను చక్కదిద్దుకుంటోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536